www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కాంగ్రెస్ ఖాతాల నుంచి రూ. 65 కోట్లు విత్‌డ్రా



సొమ్ములు తీసేసుకున్న ఆదాయ పన్ను శాఖ

ఐటీ రిటర్న్స్ కేసు కోర్టులో ఉండగా ఇదేం పద్ధతి

ఐటీ శాఖ తీరు అప్రజాస్వామికం: అజయ్ మాకెన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీకి చెందిన వేర్వేరు బ్యాంకు ఖాతాల నుంచి ఆదాయపు పన్ను శాఖ రూ.65కోట్లు విత్‌డ్రా చేసిందని ఆ పార్టీ మండిపడింది. ఈ చర్య అప్రజాస్వామికమని, గత సంవత్సరాల పన్ను రిటర్న్‌లకు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఈ విధంగా వ్యవహరించడమేంటని నిలదీసింది. దర్యాప్తు సంస్థల చర్యలను కేంద్రం అడ్డుకోకపోతే దేశంలో ప్రజాస్వామ్యం పతనమైపోతుందని ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్

మిగతా 2వ పేజీలో...

గురువారం | 22-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 308 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి త్రయోదశి ఉ. 1.23 తదుపరి చతుర్దశి, నక్షత్రం పుష్యమి సా. 4.44 తదుపరి ఆశ్లేష. వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.10.34-11.20, మ.3.11-3.57, అమృతఘడియలు: ఉ.9.41-11.27, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.43, సూర్యాస్తమయం: 6.16 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గద్దెపైకి సారలమ్మ

నేడే సమ్మక్క తల్లి రాక

నేడు వనదేవతల సన్నిధికి కిషన్‌రెడ్డి.. 'జాతీయ పండుగ'పై ప్రకటన చేస్తారా?

రేపు మేడారానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్

జాతరలో భక్తులకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు.. 9,695 మందికి చికిత్స

పార్కింగ్ ఏరియా నుంచి ఉచిత బస్సులేవి?.. మంత్రి చెప్పినా నడవని వైనం

ప్రైవేటు వాహనాలనూ వెళ్లనివ్వని పోలీసులు.. 5 కి.మీ. నడిచి వెళ్తున్న భక్తులు

మేడారం జాతర భక్తులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు

హనుమకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డప్పు చప్పుళ్లు.. కోయల నృత్యాలు.. భక్తుల జయజయ ధ్వానాల నడుమ సారలమ్మ మేడారం గద్దెపైకి చేరుకుంది. ఫలితంగా మేడారం మహా జాతర లాంఛనంగా ప్రారంభమైంది. సారలమ్మను గద్దెకు తీసుకొచ్చే కార్యక్రమం ఉదయం ఆమె వెలసిన కన్నెపల్లి ఆలయం నుంచే ఆర్భాటంగా మొదలైంది. ఆలయాన్ని శుద్ధి చేసి.. ముగ్గులతో అలంకరించిన అనంతరం ఆదివాసీ పూజారులు సాయంత్రం ఏడుగంటల దాకా ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ తల్లి రూపంలో ఆలయం నుంచి బయటకు వచ్చిన పూజారి సారయ్య.. భక్తుల మొక్కుల సమర్పణ నడుమ మేడారం దిశగా కదిలారు. కన్నెపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరం దారిపొడవునా భక్తులు బారులుతీరి హారతులిచ్చారు. రాత్రి 12.11 గంటలకు సారలమ్మ గద్దెకు చేరుకుంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజును కూడా గద్దెలపైకి చేర్చారు. అంతకుముందు పగిడిద్దరాజు-సమ్మక్క కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక మేడారం జాతర రెండో రోజు మరింత ప్రత్యేకం. సారలమ్మ గద్దెకు చేరుకోగా సమ్మక్క గురువారం గద్దెపైకి రానుంది. సమ్మక్క ఆగమనం కోసం ఉదయమే ఏర్పాట్లు మొదలవుతాయి. తొలుత మేడారంలోని సమ్మక్క గుడిని శుద్ధి చేస్తారు. మామిడి తోరణాలు

మిగతా 11వ పేజీలో...



సారలమ్మను గద్దెపైకి తీసుకెళ్తున్న పూజారులు



కవితకు మళ్లీ సీబీఐ నోటీసులు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మాగుంట సమాచారం మేరకే జారీ

26న విచారణకు రావాలని ఆదేశాలు

ఇప్పటికే ఆమెను 2సార్లు విచారించిన సీబీఐ

ఈడీ నోటీసులొచ్చిన నెలకే సీబీఐ తాఖీదు

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బుధవారం సీబీఐ మరోసారి నోటీసులను జారీచేసింది. ఈ నెల 26న తమ ముందు హాజరు కావాలని ఈ-మెయిల్ ద్వారా పంపిన ఆ నోటీసుల్లో పేర్కొంది. సీబీఐ కవితను ఇప్పటికే రెండుసార్లు విచారించిన విషయం తెలిసిందే.! 2022 డిసెంబరులో బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈడీ కూడా ఆమెకు గతంలో నోటీసులను జారీ చేసింది. అప్పట్లో ఢిల్లీలో సుదీర్ఘంగా విచారించింది. కవిత తాను వాడిన సెల్‌ఫోన్లను ఈడీకి అందజేశారు. కాగా, ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగానే సీబీఐ కవితకు మరోమారు నోటీసులను జారీ చేసినట్లు తెలిసింది. ఈ కేసులో సౌత్‌గ్రూప్ నుంచి నిందితుల్లో ఒకరైన విజయ్ నాయర్ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తరఫున రూ.100 కోట్ల మేరకు ముడుపులు స్వీకరించినట్లు ఈడీ ఆరోపించింది. సౌత్ గ్రూప్‌లో కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి,

మిగతా 14వ పేజీలో...

సింగరేణిలో 485 పోస్టుల భర్తీ

సీఎండీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

త్వరలో 317 డైరెక్ట్, 168 ఇంటర్నల్ పోస్టుల భర్తీ

నేడు నోటిఫికేషన్ ఇస్తాం: సీఎండీ బలరాం

వారంలో ఫ్రీ విద్యుత్తు

500కే గ్యాస్ సిలిండర్ పథకం కూడా.. మార్చి 15లోపు రైతుబంధు బకాయిల చెల్లింపు

త్వరలో రైతు రుణమాఫీ, రైతుభరోసా

14 ఎంపీ సీట్లు సాధిస్తేనే యుద్ధం గెలిచినట్లు

బీఆర్ఎస్- బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలి

పాలమూరుకు అన్యాయం చేసి జగన్‌కు కృష్ణా నీళ్లు అప్పగించిన కేసీఆర్

కోస్గి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

10 ఉమ్మడి జిల్లాల్లో 10 స్కిల్ యూనివర్సిటీలు

ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించడంలో చంద్రబాబు కీలకపాత్ర

అభివృద్ధి విధానాలను కొనసాగిస్తాం

పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తాం

తెలంగాణ వందేళ్ల భవిష్యత్తుకు సరిపడా ప్రణాళికలు.. సీఐఐ సదస్సులో రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకాన్ని, పేద మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో యుద్ధం ఇంకా పూర్తి కాలేదని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 14 ఎంపీ స్థానాలు అప్పగించి యుద్ధాన్ని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి రూ.4,369 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

మిగతా 14వ పేజీలో...



కోస్గిలో మట్టికుండల స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి ఎడమకాలి గోటికి కూడా కేసీఆర్ సరిపోరు

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్య

14



నారాయణపేటలో మగ్గం నేస్తున్న కిషన్‌రెడ్డి, అరుణ

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ భూస్థాపితం

రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లను గెలుస్తాం

బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై దుష్ప్రచారం

ఎన్ని గిమ్మిక్కులు చేసినా మోదీని ఆపలేరు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది: లక్ష్మణ్

రాంజీగోండు స్ఫూర్తి కేంద్రంగా వెయ్యి ఉరుల మర్రి.. ఏడాదిలోగా నిర్మాణం: బండి

బీఆర్ఎస్ చచ్చిన పాము.. పొత్తు ఉండదు

కాంగ్రెస్ కూటమి అతుకుల బొంత: ఈటల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ భూస్థాపితం కానుందని, రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో తమ పార్టీ గెలవబోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా రెండో రోజు బుధవారం నారాయణపేటలోని చేనేత కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, అసెంబ్లీ ఎన్నికల్లో

మిగతా 13వ పేజీలో...

పోలీసు కాల్పుల్లో రైతు మృతి!



బుల్లెట్ తగిలి 21 ఏళ్ల యువ రైతు దుర్మరణం

రబ్బరు బుల్లెటా? అసలు బుల్లెటా? అన్నదానిపై అస్పష్టత

పంజాబ్-హరియాణా సరిహద్దులో రైతులు పోలీసుల మధ్య ఘర్షణ

ఇద్దరు రైతులు, 12 మంది పోలీసులకు గాయాలు

ఉద్యమానికి రెండు రోజుల విరామం ప్రకటించిన రైతు నేతలు

చర్చలకు రావాలసిందిగా మరోసారి కేంద్రం పిలుపు

2



సీన్.. రివర్స్!

రాష్ట్రంలో బీఆర్ఎస్ చేజారుతున్న మునిసిపాలిటీలు

ఒక్కొక్కటిగా కైవసం చేసుకొంటున్న కాంగ్రెస్

ఇప్పటికే 34 మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు

మరో 20 పురపాలికల్లోనూ అవిశ్వాసానికి అవకాశం

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి నేతల కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార ప్రభుత్వం మారడంతో క్షేత్ర స్థాయి రాజకీయం మారుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థులు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గూటికి చేరడం చూశాం. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఈ సీన్ రివర్స్ అయ్యింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకొంటున్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన వారు కూడా సొంతగూటికి చేరుతున్నారు. మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు

మిగతా 13వ పేజీలో...

1000 కోట్ల అక్రమాలు!



జీఎస్టీలో భారీ అవకతవకలకు పాల్పడిన డీలర్లు

దొంగ ట్యాక్స్ ఇన్వాయిస్‌లతో ఐటీసీ క్లెయిమ్‌లు

వస్తు సరఫరా లేకపోయినా జరిగినట్లు బురిడీ.. ఇతర రాష్ట్రాల డీలర్లతో కుమ్మక్కు

'జీఎస్టీఆర్-3బీ' రిటర్నులు ఫైల్ చేయని వైనం.. సాఫ్ట్‌వేర్‌లో ఐజీఎస్టీ అక్రమాలను గుర్తించే మాడ్యూల్ లేదు

ఆ మాడ్యూల్ లేకుండా చేశారంటూ ఇద్దరు అధికారులకు మెమోలు.. వాణిజ్య పన్నుల అధికారుల లోతైన విచారణ

వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లో భారీ అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని కొందరు డీలర్లు ఎలాంటి వస్తువులు విక్రయించకపోయినా.. విక్రయించినట్లు దొంగ 'ట్యాక్స్ ఇన్వాయిస్‌లు' సృష్టించారు. వాటితో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను కొల్లగొట్టేశారు. దాదాపు రూ.1000 కోట్ల వరకు ఐటీసీని క్లెయిమ్ చేసి, ఇక్కడి డీలర్లు, ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు పంచుకున్నట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనరేట్ గుర్తించింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొందరు డీలర్లు నకిలీ ట్యాక్స్ ఇన్వాయిస్‌లతో ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించారు. ఇతర రాష్ట్రాల డీలర్లతో కుమ్మక్కై రూ.వెయ్యి కోట్ల మేర దోచుకున్నారు. ఈ అవకతవకల్లో ఇద్దరు రాష్ట్ర జీఎస్టీ అధికారుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. జీఎస్టీలో అక్రమాలను గుర్తించడానికి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లొసుగులు ఉండేలా ఈ అధికారులు సహకరించారని తేలింది. దాంతో వారిద్దరికీ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ మెమోలు జారీ చేశారు. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, కమిషనర్ టీకే శ్రీదేవి ఈ వ్యవహారంపై లోతైన విచారణ చేయిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెవెన్యూ లీకేజీలపై దృష్టి సారించింది. ముఖ్యంగా రాబడుల శాఖల్లో ఏమైనా లోపాలున్నాయా అన్నది గుర్తిస్తోంది. ఈ విషయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి, లోపాలు, లీకేజీలు ఉంటే వివరించాలని ఆదేశించింది. అదే నేపథ్యంలో రాబడుల శాఖల్లో సీనియర్ ఐఏఎస్‌లను

మిగతా 3వ పేజీలో...



న్యాయ కోవిదుడు నారిమన్ కన్నుమూత

70 ఏళ్లకుపైగా న్యాయవాద వృత్తికే అంకితం.. అహరహం లౌకికవాదం కోసం కృషి

హక్కుల పరిరక్షణ కోసం పోరాటం.. చరిత్రాత్మక తీర్పులు వచ్చిన కేసుల్లో వాదనలు

మరణానికి ముందు రోజు రాత్రి రాజ్యాంగ ధర్మాసనానికి పత్రాల సమర్పణలో నిమగ్నం

పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు.. మోదీ, ఖర్గే, రాహుల్, రేవంత్ సంతాపం

2

ZEEMEDIA

'జీ'లో 2,000 కోట్ల నిధుల మళ్లింపు

సెబీ దర్యాప్తులో బయటపడిన వ్యవహారం

12

రూ.1,336 కోట్ల జపాన్ రుణం

స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు చేయూత

టీ-హబ్, వీ-హబ్, టీఎస్ఐసీకి ప్రత్యేక నిధులు

13



ఇంగ్లండ్ పాఠశాలల్లో మొబైల్ ఫోన్లపై నిషేధం

యూకే ప్రభుత్వ నిర్ణయం

2

ఇప్పటికే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ వంటి దేశాల బడుల్లో ఆంక్షలు

ధనబలం, కండబలాన్ని అడ్డుకుంటాం

» మద్యం, నగదు పంపిణీని నియంత్రిస్తాం: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: లోక్‌సభ ఎన్నికల్లో ధనబలం, కండబలం వాడకుండా అడ్డుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఇందుకోసం టెక్నాలజీని ఉపయోగిస్తామని.. ప్రధానంగా డబ్బు పంపిణీపై ఉక్కుపాదం మోపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలను ఆదేశించామని తెలిపింది. మద్యం, నగదు, ఉచితాలు, మాదక ద్రవ్యాల పంపిణీని అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఈడీ, ఐటీ, తపాలా, అటవీ శాఖలు సహా సంబంధిత ప్రభుత్వ సంస్థలన్నీ వ్యవహరించాలని బుధవారం 'ఎక్స్'లో పేర్కొంది. మద్యం బాస్‌లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ తమ అధికారుల బృందంతో ఇప్పటికే జార్ఖండ్‌లో ఎన్నికల సన్నద్ధతపై సోమ, మంగళవారాల్లో చర్చించారు. రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. బుధవారం బిహార్ ఎన్నికల అధికారులతో, సీఎస్ బృందంతో చర్చలు జరిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ముందుగానే మొదలుపెట్టి.. సకాలంలో పూర్తిచేయాలని పలు రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేశాయని రాజీవ్‌కుమార్ మీడియాకు తెలిపారు. కాగా.. ఎన్నికల ప్రక్రియలో 3.4 లక్షలకు పైగా కేంద్ర సాయుధ బలగాలను వినియోగిస్తామని.. వారిని నిర్దేశిత రాష్ట్రాలకు సజావుగా, సత్వరమే రైళ్లలో తరలించేందుకు సహకరించాలని రైల్వే బోర్డుకు ఈసీ విజ్ఞప్తి చేసింది. 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని కోరింది. 2022, 23 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో రైళ్లలో సాయుధ బలగాల తరలింపులో పలు సమస్యలు ఎదురయ్యాయని, అందుచేత ఈ సారి అలా జరక్కుండా ముందుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించింది.

ఓటరు వేలికి 'మైసూరు' సిరా

పోలింగ్ సమయంలో ఓటరు ఎడమ చూపుడువేలిపై వేసే సిరాను ఈసీ సిద్ధం చేస్తోంది. 26 లక్షల ఇంకు సీసాలు సరఫరా చేసే బాధ్యతను మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. 1962 నుంచి ఈ సిరాను కర్ణాటక ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కోసం మాత్రమే ఉత్పత్తి చేస్తోంది. 26.5 లక్షల సీసాల సరఫరాకు ఆర్డర్ అందిందని.. ఇందులో 60 శాతాన్ని ఇప్పటికే పంపామని సదరు కంపెనీ ఎండీ కె.మొహమ్మద్ ఇర్ఫాన్ వెల్లడించారు.

3న కేంద్ర క్యాబినెట్ సమావేశం

» సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కీలక భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మార్చి 3వ తేదీన కేంద్ర క్యాబినెట్ సమావేశం కానుంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్ది రోజులు ముందు జరగనున్న ఈ భేటీలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ విధానాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై కేంద్ర మంత్రులతో ప్రధాని సమీక్షిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా, ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఇప్పటికే రాష్ట్రాల వారీగా అధికారులతో చర్చలు జరుపుతోంది. మార్చి 9న ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది.

లోకం తీరు



జోడో యాత్రకు స్వల్ప విరామం

» ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు బ్రేక్

» రాహుల్ యూకే పర్యటన నేపథ్యంలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు స్వల్ప విరామం ప్రకటించారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు యాత్రకు బ్రేక్ ఇస్తున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం వెల్లడించారు. రాహుల్ పలు ముఖ్యమైన సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో రాహుల్ ప్రసంగించనున్నారని, అలాగే ఢిల్లీలో పలు కీలక సమావేశాలకు ఆయన హాజరు కావాల్సి ఉందని జైరాం వివరించారు. మార్చి 2న రాజస్థాన్‌లోని ధౌల్‌పూర్‌లో యాత్ర పునఃప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. కాగా, మోదీ రామరాజ్యంలో దళితులు, వెనుకబడిన వర్గాల వారికి ఉద్యోగాలు రావడం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం జోడో యాత్రలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. అదానీ, అంబానీ, టాటా, బిర్లా లాంటి వారే ప్రజలను పాలిస్తున్నారని, దేశ సంపద అంతా వారి చేతుల్లోనే ఉందని, కొత్త భారతదేశానికి వారే మహారాజులని రాహుల్ విమర్శించారు.

ఇకపై విదేశాల్లోనూ నీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్- 2024)ను ఈ ఏడాది నుంచి విదేశాల్లోనూ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీని కోసం ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు బుధవారం తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ సీనియర్ డైరెక్టర్ సాధనా పరాశర్ చెప్పారు. అయితే ఈ నెల 9 నుంచి నీట్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థుల కోసం రిజిస్ట్రేషన్ తేదీ ముగిసిన తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మే 4న నీట్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

పాక్ ప్రధానిగా షాబాజ్.. అధ్యక్షుడిగా జర్దారీ!


షాబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 21 : పాకిస్థాన్‌లో దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరతకు ఎట్టకేలకు తెరపడింది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ ముస్లిం లీగ్(నవాజ్), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నిర్ణయించాయి. ఉభయ పార్టీల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం.. పీఎంఎల్(నవాజ్) అధ్యక్షుడు, మాజీ ప్రధాని షాబాజ్ షరీఫ్ మరోసారి పాక్ ప్రధాని అవుతారు. పీపీపీ సహ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్ష పదవికి ఉమ్మడి అభ్యర్థిగా పోటీపడతారు. ఈనెల 8న జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల్లో దేనికీ మెజారిటీ రాలేదు. ప్రస్తుతం ఇమ్రాన్‌ఖాన్ జైలులో ఉండగా.. ఆయన పార్టీ పీటీఐ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థులే అధిక సంఖ్యలో గెలిచారు. కానీ, ఇమ్రాన్ ప్రత్యర్థి పక్షాలు రెండూ ఇప్పుడు ప్రజా తీర్పునకు వ్యతిరేకంగా చేతులు కలిపి, ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాయి.

'ఆధార్' రద్దయిన వారికి ప్రత్యేక ఐడీ కార్డులు

» పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ

కోల్‌కతా, ఫిబ్రవరి 21: పశ్చిమబెంగాల్‌లో భారీగా ఆధార్‌కార్డులు తొలగిస్తున్నారని గత కొన్ని రోజులుగా ఆరోపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఆధార్‌కార్డులు రద్దయిన వారికి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక గుర్తింపు కార్డులను అందించనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ఆధార్‌కార్డుల తొలగింపునకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. బాధితులకు ఆధార్‌కార్డులను పునరుద్ధరిస్తామని లేదా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తామని ఆమె వివరించారు. భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ(యూఐడీఏఐ), రాష్ట్రప్రభుత్వాన్ని సంప్రదించకుండానే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజల ఆధార్‌కార్డులను తొలగించడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే ఆమె కేంద్ర ప్రభుత్వానికి ఓ లేఖను కూడా రాశారు.

రూ.1,336 కోట్ల జపాన్ రుణం

» స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఆర్థిక చేయూత

» టీ-హబ్, వీ-హబ్, టీఎస్ఐసీకి ప్రత్యేక నిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) రూ.1,336 కోట్ల భారీ రుణం మంజూరు చేసింది. స్టార్టప్ సంస్కృతిలో రాష్ట్రం ఇప్పటికే తన ప్రత్యేకత చాటుతోంది. టెక్నాలజీ స్టార్టప్‌లకు చేయూతనిచ్చేందుకు టీ-హబ్, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వి-హబ్ ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల ఆవిష్కరణలను గుర్తించి ప్రోత్సహించడంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ముందుంది. వినూత్న ఆలోచనలతో ముందుకొస్తున్న స్టార్టప్‌లను ఈ సంస్థలు గుర్తిస్తున్నా నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. టీ-హబ్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సైతం భాగస్వాములుగా ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం టీ-హబ్, వీ-హబ్‌లను విశేషంగా ప్రచారం చేసుకున్నా స్టార్టప్‌లకు కావాల్సిన ఆర్థిక సాయం అందించేందుకు ముందుకురాలేదు. ఆర్థిక సహకారం కోసం వందలాది స్టార్టప్‌లు దరఖాస్తులు చేసుకున్నా తీవ్ర నిధుల కొరతతో యువ ఆవిష్కర్తలు నిరుత్సాహానికి గురయ్యేవారు. తాజాగా జైకా భారీ రుణం అందించడంతో ఈ సంస్థలకు నిధుల కొరత తీరనుంది. గతంలో కంపెనీలు ఏర్పాటు చేసిన స్టార్టప్‌లకే టీ-హబ్, వీ-హబ్ ద్వారా ప్రైవేటు ఇన్వెస్టర్లు ఎంతోకొంత సహకారం అందించేవారు. జైకా నిధులతో ఐడియా ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లకూ సహకారం అందనుంది. గ్రామీణ స్థాయిలో స్టార్టప్ సంస్కృతి మరింత పెంచాలని, ఆంత్రప్రెన్యూర్లుగా రాణించాలనుకునే మహిళలకు ఆర్థిక సాయం అందించి మరింత ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. జైకా రుణంతో రాష్ట్రం స్టార్టప్ రంగంలో మరింత ముందుకు వెళుతుందని పేర్కొంటున్నాయి.

కాంగ్రెస్ ఖాతాల నుంచి రూ.65 కోట్లు విత్‌డ్రా

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఖాతాల జప్తుపై అప్పిలేట్ అధికారులు కేసు విచారణ చేపడుతున్నప్పటికీ కాంగ్రెస్, ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఖాతాల నుంచి రూ.65 కోట్లు డీడీల రూపంలో విత్‌డ్రా చేయాలని బ్యాంకులకు ఐటీ శాఖ లేఖలు రాసిందని ఆరోపించారు. గత పన్ను రిటర్నుల్లో వ్యత్యాసాలకు సంబంధించి రూ.210కోట్ల రికవరీపై తమ పార్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా స్టే విధించిందని, అయినా కూడా తమ ఖాతాల నుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డారని మాకెన్ తెలిపారు. కేంద్ర సంస్థల చర్యలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇది దేశంలో బహుళ పార్టీ వ్యవస్థకు ముప్పు కలిగిస్తుంది. న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోకపోతే మన ప్రజాస్వామ్య సూత్రాలు ప్రమాదంలో పడతాయి' అని 'ఎక్స్'లో చేసిన పోస్టులో మాకెన్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ వ్యవహారంపై బుధవారం అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో వాదనలు కొనసాగగా, తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది.

పోలీసు కాల్పుల్లో రైతు మృతి

బుల్లెట్ తగిలి 21 ఏళ్ల యువ రైతు బలి.. రబ్బరు బుల్లెటా? అసలు బుల్లెటా? అన్నదానిపై అస్పష్టత

» రైతులను చంపుతున్న బీజేపీ.. మీడియా వెనక దాక్కుంది: రాహుల్


రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంట ఉత్పత్తులకు మద్దతు ధర కోరుతూ మలిదశ ఉద్యమం ప్రారంభించిన రైతులు.. పోలీసులతో జరిగిన ఘర్షణలో తొలిసారిగా ఓ సహచరుడిని కోల్పోయారు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరి వద్ద బుధవారం ఈ విషాదం చోటు చేసుకుంది. మృతుడిని 21 ఏళ్ల శుభ్‌కరణ్ సింగ్‌గా గుర్తించారు. పంజాబ్‌లోని భటిండా జిల్లా బాలోక్ గ్రామానికి చెందిన శుభ్‌కరణ్‌ను చికిత్స కోసం పాటియాలలోని రాజీంద్రా హాస్పిటల్‌కు తరలించగా.. తల మీద తీవ్రమైన గాయంతో అప్పటికే ఆయన మరణించారని, బుల్లెట్ తగలటం వల్లే ఇది జరిగినట్లు భావిస్తున్నామని, శవపరీక్షలో మిగిలిన వివరాలు వెల్లడవుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ హెచ్ఎస్ రేఖి తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు రైతులు చికిత్స పొందుతున్నారు. మరణించిన రైతు నిజమైన బుల్లెట్ తగలటం వల్ల ప్రాణాలు కోల్పోయారా? లేక రబ్బరు బుల్లెట్ వల్లనా అనేది స్పష్టం కాలేదు. ఈ ఘటన నేపథ్యంలో రైతు నేతలు చలో ఢిల్లీ ఉద్యమానికి రెండు రోజుల విరామం ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. అప్పటి వరకూ పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు, ఖనౌరీ ప్రాంతాల్లో మోహరించిన దాదాపు 14 వేల మందికి పైగా రైతులు అక్కడే ఉంటారని చెప్పారు. కాగా, బుధవారం రైతులతో జరిగిన ఘర్షణలో 13 మంది పోలీసు సిబ్బంది గాయపడ్డారని హరియాణాకు చెందిన ఒక పోలీసు అధికారి తెలిపారు.

2 రోజుల విరామం తర్వాత..

ఈ నెల 18న కేంద్రంతో జరిగిన నాలుగో దఫా చర్చలు విఫలమైన నేపథ్యంలో.. రైతు ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాల నేతలు పంజాబ్-హరియాణా సరిహద్దు నుంచి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని బుధవారం తిరిగి మొదలుపెడతామని ప్రకటించారు. దీంట్లో భాగంగా ముందుకు కదిలిన రైతులపై పోలీసులు, భద్రతా సిబ్బంది విరుచుకుపడ్డారు. రబ్బరు బుల్లెట్లను, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. డ్రోన్లతో గ్యాస్ షెల్స్‌ను వదిలారు. పలువురు రైతులు టియర్ గ్యాస్ ప్రభావం నుంచి రక్షించుకోవటానికి మాస్కులను, కళ్లద్దాలను ధరించారు. పోలీసు కాల్పుల్లో యువరైతు మృతిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. బీజేపీ రైతులను చంపుతోందని ఆరోపించారు. స్నేహపూర్వక మీడియా వెనక దాక్కొన్న బీజేపీ నుంచి చరిత్ర ఏదో ఒక రోజు తప్పకుండా రైతుల హత్యలకు జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. మరోవైపు, రైతులను కేంద్రం ఐదో దఫా చర్చలకు ఆహ్వానించింది.

గ్రామాలకు రాకుండా అడ్డుకుంటాం: టికాయత్

యూపీలోని ముజఫర్‌పూర్‌లో భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఓ రైతు ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే, ఇతర రైతులు సకాలంలో మంటలు ఆర్పి, అతడిని ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలే అయ్యాయని వైద్యులు తెలిపారు. తమను ఢిల్లీకి రానివ్వకుండా అడ్డుకునే వారిని వచ్చే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తమ గ్రామాలకు రాకుండా అడ్డుకుంటామని బీజేపీని ఉద్దేశించి రాకేశ్ టికాయత్ హెచ్చరించారు.

మాపై ఆరోపణ సరికాదు: పంజాబ్

రైతుల ముసుగులో అసాంఘిక శక్తులు చొరబడుతున్నారని, రైతులు పెద్ద సంఖ్యలో గుమిగూడకుండా అడ్డుకోవటం లేదంటూ కేంద్ర హోంశాఖ రాసిన లేఖపై పంజాబ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తమపై వేసిన ఆరోపణలు పూర్తిగా తప్పని చెప్పింది. హరియాణా పోలీసులు ప్రయోగిస్తున్న టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, లాఠీచార్జి వల్ల ఇప్పటికి 160 మందికిపైగా గాయపడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లోనూ శాంతిభద్రతలు క్షీణించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని కేంద్ర హోంశాఖకు పంపిన లేఖలో పేర్కొంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, పంటరుణాల మాఫీ, రైతులకు పింఛను వంటి డిమాండ్లతో ఈ నెల 13 నుంచి రైతులు తమ నిరసనను తిరిగి ప్రారంభించారు. అయితే, వారు ఢిల్లీ వైపు రాకుండా రోడ్లపై భారీ ఎత్తున బారికేడ్లను, సిమెంటు దిమ్మెలను, ఇనుప మువ్వలను కేంద్రం ఏర్పాటు చేసింది.

భారత్-గ్రీస్ బంధం

బలోపేతం!

» ఢిల్లీలో గ్రీస్ ప్రధాని మిత్సొటాకిస్ పర్యటన

» ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఆయుధ సంపత్తి తయారీ, అభివృద్ధి కోసం కలిసి పనిచేసేందుకు భారత్, గ్రీస్ దేశాలు అంగీకారానికి వచ్చాయి. గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిత్సొటాకిస్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఢిల్లీకి విచ్చేశారు. తొలుత రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ఆయన నివాళి అర్పించారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సాధ్యమైనంత త్వరగా వలసలపై ఇరుదేశాలు ఒప్పందం చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఉగ్రవాదంపై పోరులో ఇరుదేశాల ఆందోళనలు, ప్రాధాన్యతలు ఒకేలా ఉన్నాయని అనంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రధాని మోదీ తెలిపారు. అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరం చర్చలు జరిపామని, అన్ని వివాదాలు, ఉద్రిక్తతలను చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకునేందుకు అంగీకారం కుదిరిందని వివరించారు. మోదీ గతేడాది ఆగస్టులో గ్రీస్‌లో పర్యటించినప్పటి నుంచి ఇరుదేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెరిగాయి.



హిడ్మా సొంత గ్రామం ఖాళీ!

» ఇతర గ్రామాలకు గిరిజనుల వలస.. ఊరంతా కేంద్ర బలగాల అధీనంలోకి

» 5వేల సిబ్బందితో భారీ క్యాంప్ నిర్మాణం

» తొలిసారి పూవర్తికి మీడియా

చర్ల, ఫిబ్రవరి 21: పోలీసులకు పంటికింద రాయిలా మారి.. చిక్కడు-దొరకడు అన్నట్లుగా తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత మాద్వీ హిడ్మా స్వగ్రామం ఇప్పుడెలా ఉంది? ఆయన సొంతూరు- ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామం పరిస్థితి ఏంటి? అక్కడి ప్రజలు ఎలా ఉన్నారు? ఈ అంశాలపై ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని తెలంగాణ జర్నలిస్టులు పరిశీలించారు. మొదటిసారి మీడియా ప్రతినిధులు ఆపసోపాలను ఎదుర్కొంటూ బుధవారం హిడ్మా స్వగ్రామాన్ని సందర్శించారు.

ఊరంతా ఖాళీ..

తెర్రాంలో 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల హత్య.. అంతకు ముందు.. తర్వాత చోటుచేసుకున్న పలు ఘటనల నేపథ్యంలో హిడ్మా పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారారు. అడవులపై క్రమంగా పట్టు సాధిస్తున్న పోలీసులు అబుజ్‌మడ్‌తోపాటు.. హిడ్మా స్వగ్రామం పూవర్తిపైనా పట్టు సాధిస్తున్నారు. పూవర్తిలో 5 వేల మంది బలగాలతో ఓ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. మావోయిస్టుల స్థూపాలను, జెండాలను ధ్వంసం చేశారు. తొలిసారి ఆ ప్రాంతంలో జాతీయ జెండాను ఎగురవేశారు. దీంతో ఆ గ్రామంలోని గిరిజనులంతా ఏం జరుగుతుందోననే భయాందోళనలతో ఇతర గ్రామాలకు వలస వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మీడియా ప్రతినిధులు మంగళవారం పూవర్తికి బయలుదేరి.. బుధవారం ఉదయం చేరుకున్నారు. పూవర్తిలో వందల సంఖ్యలో సాయుధ పోలీసులు కనిపించగా.. ఆ ఊళ్లోని పూరిగుడిసెలన్నీ ఖాళీగా కనిపించాయి. గ్రామంలోని హిడ్మా ఇల్లు, గెస్ట్‌హౌస్(పూరిగుడిసెలే), ఆయన చెల్లెలి ఇంటిని సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మా సోదరుడి జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపాన్ని కూల్చివేశాయి. హిడ్మా సోదరుడు, తల్లి నివసిస్తున్న పూరి గుడిసెలకు కూడా తాళాలు వేసి ఉన్నాయి. "ప్రభుత్వం తరఫున పూవర్తిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. పోలీసులు మాత్రం క్యాంపును ఏర్పాటు చేసుకున్నారు. అందుకే ఊరంతా ఖాళీ అయిపోయింది" అని కొండపల్లి ప్రాంతంలో కొంత మంది స్థానికులు మీడియా ప్రతినిధులకు వివరించారు. అయితే పోలీసులు మాత్రం గిరిజనులకు ప్రభుత్వ పథకాలను అందజేసేందుకే పూవర్తిలో క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మీడియా ప్రయాణం సాగిందిలా..!

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని చర్ల ప్రాంతం నుంచి 12 మంది మీడియా ప్రతినిధులు హిడ్మా స్వగ్రామం పూవర్తిలో గ్రౌండ్ రిపోర్టుకు మంగళవారం ఉదయం 8 గంటలకు బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొండపల్లిని చేరుకున్నారు. అక్కడ కొందరు వ్యక్తులు అనుమానం వ్యక్తం చేస్తూ ముందుకు వెళ్లకూడదంటూ ఆంక్షలు విధించారు. సాయంత్రం 5 గంటలకు.. కొందరు స్థానికులు మీడియా ప్రతినిధులను గుర్తించడంతో.. ముందుకు వెళ్లేందుకు అనుమతించారు. అప్పటికే చీకటి పడుతుండడంతో.. మీడియా బృందం రాత్రికి అదే గ్రామంలో బస చేసింది. బుధవారం ఉదయం 8గంటలకు ప్రయాణాన్ని కొనసాగించిన బృందం మధ్యాహ్నం 12 గంటలకు పూవర్తికి చేరుకుంది.

న్యాయ కోవిదుడు

నారిమన్ కన్నుమూత

» 70 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తికే అంకితం

» న్యాయ సేవలకు పద్మవిభూషణ్ అవార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి ఎస్.నారిమన్(95) ఇకలేరు. బుధవారం ఆయన ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన గుండె సంబంధిత ఇబ్బందులతోపాటు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. చివరి వరకూ ఆయన లౌకికవాదం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు. మంగళవారం రాత్రి కూడా ఆయన రాజ్యాంగ ధర్మాసనం ముందుకు రాబోయే ఓ కేసుకు సంబంధించి పత్రాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొనడం.. నారిమన్‌కు న్యాయవాద వృత్తిపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం. నారిమన్ 1929 జనవరి 10న రంగూన్ (ప్రస్తుతం మయన్మార్‌లోని యాంగాన్)లో ఓ పార్సీ వర్తకవ్యాపారుల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు బరియాంజీ నారిమన్, బానూ నారిమన్. రెండో ప్రపంచయుద్ధ సమయంలో బర్మా (ప్రస్తుతం మయన్మార్)పై జపాన్ దురాక్రమణ సందర్భంగా ఆ కుటుంబం భారత్‌కు వలస వచ్చింది. ఆయన తన పాఠశాల విద్యను హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో ఉన్న బిషప్ కాటన్ స్కూల్‌లో పూర్తిచేశారు. ముంబైలోని సెయింట్ జెవియర్స్ కళాశాల నుంచి ఎకనామిక్స్, చరిత్రలో పట్టభద్రులయ్యారు. నారిమన్‌ను ఇండియన్ సివిల్ సర్వీస్ (ఐసీఎస్-ప్రస్తుతం ఐఏఎస్) అధికారిగా చూడాలని ఆయన తండ్రి కాంక్షించారు. కానీ, నారిమన్ న్యాయవిద్య వైపు మొగ్గుచూపారు. 1950లో ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో న్యాయవిద్య పూర్తి చేశారు. ఆవెంటనే బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన న్యాయవాద వృత్తిలోనే కొనసాగారు. 1961లో సీనియర్ అడ్వొకేట్‌గా ఎంపికయ్యారు. 1972లో సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ తర్వాత భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికలకు భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా సెన్సార్ విధించడాన్ని నిరసిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఏకవాక్య రాజీనామా లేఖ అప్పట్లో సంచలనం. న్యాయవాద వృత్తిలో ఆయన సేవలకుగాను భారత ప్రభుత్వం 1991 లో పద్మభూషణ్, 2007లో పద్మవిభూషణ్ అవార్డులతో సత్కరించింది. ఆయన 1991 నుంచి 2010వరకు భారత బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలోనూ పనిచేశారు.

> లౌకికవాదం వర్ధిల్లుతున్న భారతదేశంలో నేను జీవించాను. దేవుడు కరుణిస్తే.. నా శేషజీవితాన్ని, చివరకు మరణాన్ని సెక్యులర్ భారతదేశంలోనే కోరుకుంటున్నాను
>
> - ఫాలి ఎస్ నారిమన్ వ్యాఖ్య



మైలురాయి తీర్పుల్లో కీలకం..!

సుప్రీంకోర్టు చరిత్రలోనే మైలురాయి వంటి తీర్పులు వచ్చిన పలు కేసుల్లో నారిమన్ వాదనలు వినిపించారు. ఇప్పటికీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపం' అంశంపై యూపీఎస్సీ, రాష్ట్రాల పీఎస్సీల్లో కేశవానంద భారతి కేసు తీర్పు స్కోరింగ్ అంశమే. ఈ కేసులో నారిమన్ వాదనలు వినిపించగా.. మరో కీలకమైన కేసు- మినర్వా మిల్స్ కేసులోనూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఎస్‌పీ గుప్తా కేసు (కొలీజియం వ్యవస్థకు సంబంధించినది), 2005, 2012ల్లో సమాచార హక్కు చట్టంపై దాఖలైన పిటిషన్లలోనూ ఆయన వాదనలు కీలకం. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370రద్దును ఆయన తీవ్రంగా విమర్శించారు. భోపాల్ గ్యాస్ ఉదంతం కేసులోనూ ఆయన యూనియన్ కార్బైడ్ కంపెనీ తరఫున 1985 లో వాదనలు వినిపించారు. ఆ తర్వాత ఆయన పలు సందర్భాల్లో ఈ కేసులో తాను వాదించకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

ప్రముఖుల సంతాపం

నారిమన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యుత్తమ న్యాయవాదుల్లో నారిమన్ ఒకరని, సామాన్య పౌరుల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యువ న్యాయవాదులు రాజ్యాంగం, పౌరహక్కుల పవిత్రతను కాపాడేందుకు నారిమన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నారిమన్ మృతి న్యాయవాద లోకానికి తీరని లోటు అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. నారిమన్ మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ సంతాపం తెలిపారు.

యూపీలో సీట్ల సర్దుబాటు కొలిక్కి

» కాంగ్రెస్, ఎస్పీ మధ్య సయోధ్య

» కాంగ్రెస్‌కు 17, ఎస్పీకి 62 సీట్లు

» ఆజాద్ సమాజ్ పార్టీకి ఒక స్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)ల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పోటీ చేసే లోక్‌సభ స్థానాలపై ఇరు పార్టీల మధ్య అవగాహన కుదిరింది. కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తామని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. రాహుల్ జోడో యాత్రలో ఎందుకు పాల్గొనడం లేదని బుధవారం మొయిదాబాద్‌లో అఖిలేశ్‌ను మీడియా ప్రశ్నించగా రాహుల్ గాంధీతో ఎటువంటి విభేదాలు లేవని, కూటమి తరఫున కలిసే పోటీ చేస్తామని తెలిపారు. ఆ తర్వాత కొద్ది సేపట్లోనే లఖ్‌నవూలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య చర్చలు జరిగాయి. ఆ తర్వాత ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ ఉత్తమ్ పటేల్, జాతీయ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర చౌదరి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌రాయ్, యూపీ కాంగ్రెస్ ఇన్‌చార్జి అవినాశ్ పాండే సంయుక్తంగా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా 17 సీట్లలో కాంగ్రెస్ పోటీ చేస్తుందని, 62 స్థానాల్లో ఎస్పీ, ఒకచోట ఆజాద్ సమాజ్ పార్టీ పోటీలో చేస్తాయని పటేల్ తెలిపారు.

ప్రియాంక చొరవతో కొలిక్కి..

కాంగ్రెస్, ఎస్పీ మధ్య సయోధ్య కుదరడంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారని అవినాశ్ పాండే తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ స్థానాలు ఉండగా ఖజురహో స్థానంలో ఎస్పీ పోటీ చేస్తుందని, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందని పటేల్ తెలిపారు. తొలుత కాంగ్రెస్ పార్టీ 19 సీట్లు కావాలని పట్టుబట్టింది. 11 సీట్లు ఇస్తామని ఎస్పీ తెలిపింది. మొరాదాబాద్, వారాణసీ, సీట్ల తదితర విషయంలో కీలకంగా చర్చ జరిగినట్టు తెలిసింది. ఎట్టకేలకు వారాణసీలో పోటీచేయబోమని, కాంగ్రెస్‌కు పూర్తిగా సహకరిస్తామని ఎస్పీ తెలిపింది. అదే సమయంలో మొరాదాబాద్ సీటును వదులుకునేందుకు అంగీకరించింది. దీంతో పొత్తు కొలిక్కివచ్చింది. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్ ప్రతి ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

ఇంగ్లండ్ పాఠశాలల్లో

మొబైల్ ఫోన్లపై నిషేధం

» యూకే ప్రభుత్వ నిర్ణయం

లండన్, ఫిబ్రవరి 21: ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ లేకుంటే గంట గడవని పరిస్థితి! చిన్నా పెద్దా అని తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్లను విపరీతంగా వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ల వాడకం వల్ల ప్రయోజనాలు ఉన్నట్టే నష్టాలు కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఫోన్లకే అతుక్కుపోవడం పట్ల తల్లిదండ్రుల్లో ఆందోళనలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను నిషేధించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ వంటి యూరోపియన్ దేశాల్లోని పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై ఆంక్షలు విధించారు. తాజాగా ఇంగ్లండ్ వ్యాప్తంగా పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను బ్రిటన్ ప్రభుత్వం నిషేధించింది. మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించే లక్ష్యంతో సోమవారం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాల ప్రాంగణాల్లో ఫోన్లను నిషేధించడం, పాఠశాలకు రాగానే ఫోన్లను తీసుకోవడం లేదా వాటిని పాఠశాల సమయాల్లో భద్రంగా స్టోర్ చేయడం వంటి వాటిని ఆయా పాఠశాలలు అమలు చేయడానికి అవకాశం కల్పించారు. పాఠశాలలు పిల్లలు చదువుకునే ప్రదేశాలని, తరగతి గదిలో మొబైల్ ఫోన్లు అనవసర అవరోధాలని యూకే విద్యా శాఖ సెక్రటరీ గిలియన్ కీగన్ పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధిగా ఉండాలని ఆశ..!

» లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై మోదీ, షాలదే నిర్ణయం: తమిళిసై

పుదుచ్చేరి, ఫిబ్రవరి 21: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి నుంచి బరిలో నిలవనున్నారన్న ఊహాగానాలపై ఆమె స్పందించారు. ప్రజాప్రతినిధిగా ఉండాలన్నదే తన భావన అన్నారు. కానీ, ఎన్నికల్లో పోటీపై నిర్ణయం మోదీ, అమిత్ షాదేనని స్పష్టం చేశారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం తమిళిసై విలేకరులతో మాట్లాడారు. పుదుచ్చేరి నుంచి బీజేపీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలవనున్నారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. ప్రత్యేకించి పుదుచ్చేరి నుంచి పోటీ చేస్తానని చెప్పలేదు. నా జీవితంలో దేనికోసమూ డిమాండ్ చేయలేదు. పైవాళ్లు తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేసే సాధారణ కార్యకర్తను' అని తమిళిసై చెప్పారు.

1000 కోట్ల అక్రమాలు!

(మొదటి పేజీ తరువాయి)

నియమించింది. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా టీకే శ్రీదేవి రాగానే పన్ను ఎగవేతలు, తప్పుడు ఐటీసీ క్లెయిమ్‌లపై దృష్టి సారించారు. రికార్డులను పరిశీలించగా దొంగ ఇన్వాయి‌స్‌లతో ఐటీసీని కొల్లగొట్టినట్లు గుర్తించారు. 'ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (ఐజీఎస్టీ)' విషయంలోనే డీలర్లు ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు తేలింది.

ఐటీసీ మోసాలు ఇలా..

సాధారణంగా ఒక రాష్ట్రంలోని డీలర్లు, మరో రాష్ట్రంలోని డీలర్లకు విక్రయించే వస్తువులపై ఐజీఎస్టీని కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తుంది. దీనిని కేంద్రం, వస్తువులు కొన్న రాష్ట్రానికి చెరో 50 శాతం పంపిణీ చేస్తారు. అయితే రాష్ట్రంలోని కొంతమంది డీలర్లు దీనిని ఆదాయ వనరుగా మార్చుకున్నట్లు తేలింది. ఇక్కడి డీలర్లు ఇతర రాష్ట్రాల వారికి వస్తువులు విక్రయించినట్లు దొంగ ట్యాక్స్ ఇన్వాయి‌స్‌లను సృష్టించారు. ప్రధానంగా 18 శాతం ట్యాక్స్ ఉన్న ఇనుము, ఇత్తడి, రాగి స్క్రాప్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు బుకాయించారు. భౌతికంగా ఈ వస్తు రవాణా జరగకపోయినా.. జరిగినట్లు చూపి, ఇన్వాయి‌స్‌లను ఇతర రాష్ట్రాల డీలర్లకు పంపించారు. ఉదాహరణకు తెలంగాణలోని ఒక డీలరు పంజాబ్ రాష్ట్రానికి స్క్రాప్‌ను పంపించినట్లు ఇన్వాయి‌స్‌లు తయారు చేశారు. పంజాబ్ వ్యాపారి ఆ ఇన్వాయి‌స్‌లను ఆధారంగా చేసుకుని 18 శాతం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ కౌన్సిల్ ఖాతాల నుంచి క్లెయిమ్ చేశాడు. ఈ సొమ్మును పంజాబ్ డీలరు, తెలంగాణ డీలరు పంచుకున్నారు. ఇలా తెలంగాణలోని పలువురు డీలర్లు, ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు కుమ్మక్కై సర్కారు ఖజానా నుంచి ఐటీసీని కొల్లగొట్టారు. ఇది దాదాపు రూ.1000 కోట్ల వరకు ఉండొచ్చని కమిషనరేట్ గుర్తించింది.

ఐజీఎస్టీ మాడ్యూల్ లేకుండా సాఫ్ట్‌వేర్

నిజానికి వస్తు సేవల పన్నులో జరిగే లావాదేవీలు, పన్ను ఎగవేతలు, బకాయిలు వంటివాటిని గుర్తించడానికి వాణిజ్య పన్నుల కమిషనరేట్.. ఒక ప్రైవేటు సంస్థతో సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయించింది. అయితే ఈ సాఫ్ట్‌వేర్‌లో కీలకమైన మాడ్యూల్ లేకపోవడంలో ఇద్దరు వాణిజ్య పన్నుల అధికారులు ప్రమేయం ఉన్నట్లు కమిషనరేట్ గుర్తించింది. సాధారణంగా డీలర్లు తాము అమ్మిన వస్తువులకు 'జీఎస్టీఆర్-1' రిటర్నులు, ఆ తర్వాత అమ్మకాలు, కొనుగోళ్లు, చెల్లించాల్సిన పన్నుకు సంబంధించి 'జీఎస్టీఆర్-3బీ' రిటర్నులు ఫైల్ చేయాలి. వస్తువులను కొన్న ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు జీఎస్టీఆర్-1తో పాటు 'జీఎస్టీఆర్-2ఏ' రిటర్నులు సమర్పించాలి. దీని ద్వారా ఎంత విలువైన వస్తువులను కొనుగోలు చేశారన్నది తేలుతుంది. వస్తువులు అమ్మిన డీలరు జీఎస్టీఆర్-3బీని సమర్పిస్తేనే వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ వివరాలు వెల్లడవుతాయి. కానీ.. ఇక్కడి డీలర్లు వస్తువులను ఇతర రాష్ట్రాల డీలర్లకు అమ్మినట్లు జీఎస్టీఆర్-1 రిటర్నులను మాత్రమే ఫైల్ చేశారు. వీటి ఆధారంగా ఇతర రాష్ట్రాల్లోని డీలర్లు వస్తువులను కొనుగోలు చేసినట్లు జీఎస్టీఆర్-2తో పాటు జీఎస్టీఆర్-3బీని ఫైల్ చేశారు. దాంతో వారికి ఐటీసీని క్లెయిమ్ చేసుకునే అవకాశం ఏర్పడింది. పెద్ద మొత్తంలో ఐటీసీని క్లెయిమ్ చేశారు. ఇలా రిటర్నులను ఫైల్ చేసినట్లు చూపారే తప్ప.. భౌతికంగా వస్తు సరఫరా జరగలేదు. ఇక్కడి డీలర్లు జీఎస్టీఆర్-3బీని సమర్పించినట్లయితే ప్రభుత్వానికి జీఎస్టీని చెల్లించాల్సి ఉండేది. అసలు వస్తు రవాణా జరగనప్పుడు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ.. ఐటీసీని క్లెయిమ్ చేయడానికే వస్తు సరఫరా జరిగినట్లు దొంగ ఇన్వాయి‌స్‌లను సృష్టించారు. అయితే రెండు రాష్ట్రాల మధ్య జరిగే లావాదేవీల ఐజీఎస్టీ సంబంధిత జీఎస్టీఆర్-3బీని సమర్పించారా లేదా అన్నది గుర్తించే 'మాడ్యూల్' కమిషనరేట్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో లేనట్లు తేలింది. రాష్ట్ర వస్తు సేవల పన్ను (ఎస్‌జీఎస్టీ), కేంద్ర వస్తు సేవల పన్ను(సీజీఎస్టీ)ల రిటర్నులను గుర్తించే మాడ్యూల్స్‌ను మాత్రమే సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు. ఐజీఎస్టీకి సంబంధించిన మాడ్యూల్‌ను పొందుపర్చకపోవడంతో ఇక్కడి డీలర్లు పన్ను సంబంధిత రిటర్నులను దాఖలు చేశారా లేదా అన్నది సాఫ్ట్‌వేర్ గుర్తించడం లేదు. పర్యవసానంగా దొంగ ఇన్వాయి‌స్‌లతో ఐటీసీని కొల్లగొట్టినట్లు తేలింది. ఈ ఐజీఎస్టీ మాడ్యూల్ లేకుండా చూడాలంటూ ఇద్దరు వాణిజ్య పన్నుల అధికారులు సదరు సాఫ్ట్‌వేర్ రూపొందించిన సంస్థకు సూచించినట్లు కమిషనర్ గుర్తించారు. దాంతో ఒక అదనపు కమిషనర్, మరో డిప్యూటీ కమిషనర్‌కు ఆమె ఇటీవల మెమోలు జారీ చేశారు. ఈ విషయంలో ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందంటూ ఆ ఇద్దరు అధికారులను కమిషనర్ వివరణ కోరారు. ఇప్పుడు ఇది చర్చనీయంగా మారింది.



సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

» ఎగిసిపడిన మంటలు.. కోట్లలో నష్టం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 21: సిద్దిపేట జిల్లా కేంద్రం ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న సబ్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదవశాత్తు పేలడంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు భయభ్రాంతులయ్యారు. సిద్దిపేట నియోజకవర్గంతో పాటు దుబ్బాక నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఫైర్ ఇంజన్ నీటితో మంటలు ఆర్పుతున్నప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న ఆయిల్‌తో మరింత మంటలు చెలరేగాయి. ఆరు గంటల పాటు మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం తీరును పరిశీలించారు. హుస్నాబాద్, గజ్వేల్ ఫైర్ స్టేషన్లకు ఫోన్ చేసి ఫైర్ ఇంజన్లను పంపించాలని కోరారు. విద్యుత్ మంత్రి భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి కరెంటు సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. ఆరు కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే విషయంపై విచారణ చేపట్టారు.


సబ్‌స్టేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

రాష్ట్ర డీఎంహెచ్‌వోల సంఘం ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జిల్లా వైద్యాధికారుల(డీఎంహెచ్‌వో)ల సంఘం ఏర్పాటైంది. సంఘ ఆవిర్భావ సమావేశం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఎంహెచ్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె. మల్లికార్జున్‌రావు, కోశాధికారిగా డాక్టర్ పరిపూర్ణాచారి ఎన్నికయ్యారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని అమలు చేయడంలో ప్రభుత్వానికి సంఘం తరపున సహాయం చేస్తామని పేర్కొన్నారు.

గ్రూప్ -1 సిలబస్‌ను సమీక్ష చేయించండి

హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రూప్ -1 సిలబస్‌ను పూర్తి స్థాయిలో సమీక్ష చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. గత ప్రభుత్వ పెద్దలు ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని పలు అంశాలను సిలబస్‌లో కొనసాగించారని సీఎం దృష్టికి తెచ్చారు. వాటిని వెంటనే తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ.. బుధవారం ఓ లేఖ రాశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిన్ననేత, పెద్ద నేరం

పశ్చిమబెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ మధ్య వైరం పచ్చగడ్డి వేయకుండానే నిత్యం మండుతూంటుంది కనుక, సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు జరిగి, ఆయుధాలుగా అందివచ్చినప్పుడు రాజకీయ యుద్ధం పతాకస్థాయికి చేరుకోవడం సహజం. జరుగుతున్న ఘోరాలను ఆపడం, నేరస్థులను శిక్షించడం, బాధితులకు న్యాయం చేయడం వంటివి వెనక్కుపోయి రాజకీయానిదే పైచేయి అవుతున్నందున సందేశ్‌ఖాలీ నిత్యం వార్తల్లో ఉంటూ వస్తున్నది. ఒక మారుమూల ప్రాంతంలో స్థానిక నాయకుడి అఘాయిత్యాలు, కృత్యాలు మీడియాలో ప్రధానాంశమైనాయి.

తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఓ చిన్నస్థాయి నాయకుడు షేక్ షాజహాన్, ఆయన మనుషులు ఏళ్ళ తరబడి గ్రామస్తులను పీక్కుతింటూంటే, భూములను ఆక్రమించుకుంటూ, ప్రశ్నించినవారిమీద దాడులు చేస్తూ, మహిళలపై అకృత్యాలు చేస్తూంటే ఆ ఘోరాలన్నీ ఇంతకాలమూ ఎందుకు వెలుగుచూడలేదో అర్థంకాదు. జనవరి 5న ఏదో రేషన్ కుంభకోణానికి సంబంధించి అరెస్టు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు వెడితే, షాజహాన్ మనుషులు ఈడీ అధికారులమీద ఎదురుదాడి చేయడంతో సందేశ్‌ఖాలీ తొలిసారిగా వార్తలకు ఎక్కింది. ఇది జరిగిన నెల్లాళ్ళకు కొందరు మహిళలు షాజహాన్‌నీ, ఆయన అనుచరులనూ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వారిలో ఒకరు కెమెరాముందు చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించే రీతిలో ఉన్నాయి. పేదలభూములు ఆక్రమించడం, కొన్నింటిని చెరువులుగా మార్చివేయడం, వెట్టిచేయించుకోవడం వంటి ఆరోపణలతో పాటు, ఈ ముఠా అందంగా ఉన్న మహిళలను వెతికిపట్టుకొని మరీ అక్కడి పార్టీ కార్యాలయానికి రప్పించి అత్యాచారాలకు పాల్పడుతున్నదని ఆమె ఆరోపించారు. మహిళలు ఇలా వీధుల్లోకి వచ్చి తమకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకోవాల్సిరావడం నిజానికి దురదృష్టకరమైన విషయం. ఈ నిరసనలు, ఆ వ్యాఖ్యల వెనుక అసలు నేరం కంటే రాజకీయమే ఎక్కువని తృణమూల్ వాదన. అయినా, నిజాన్ని నిగ్గుతేల్చవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. ఆ గ్రామానికి ప్రభుత్వం పంపిన మహిళా పోలీసు బృందానికి స్థానిక మహిళలు సదరు ముఠాతో తాము పడుతున్న బాధలు అనేకం చెప్పారు కానీ, అత్యాచారాల ఊసెత్తలేదు. మీ భద్రతకు లోటేమీ లేదన్న హామీ తరువాత కూడా వారు ఈ విషయం మాట్లాడకపోవడాన్ని తృణమూల్ ప్రధానంగా ప్రస్తావిస్తూంటే, ముఠాతో రాసుకుపూసుకుతిరిగే స్థానికపోలీసులనుంచి భవిష్యత్తులో తమకు ప్రమాదం ఉందన్న భయంతోనే వారు మాట్లాడలేదని బీజేపీ నాయకులవాదన.

అసత్యప్రచారాలతో, తెరవెనుక కుట్రలతో సందేశ్‌ఖాలీని బీజేపీ ఓ భయంకరమైన విషయంగా మారుస్తున్నదని ఆరోపిస్తూ తృణమూల్ సమస్యను పూర్తిగా కొట్టిపారేస్తూంటే, పార్టీ కార్యాలయాలను అత్యాచారస్థావరాలుగా మార్చేశారంటూ స్మృతి ఇరానీవంటివారు ఘాటైన పదజాలంతో మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ పెద్దలంతా రాష్ట్రపర్యటనలు చేస్తూ వివాదం వేడిగా ఉండేట్టు చూస్తున్నారు. జాతీయ మహిళా కమిషన్ రాష్ట్రాన్ని తీవ్రంగా దుయ్యబడితే, ఎస్సీ కమిషన్ ఏకంగా రాష్ట్రపతి పాలనే విధించాలన్నది. సందేశ్‌ఖాలీ వెడుతూ ఘర్షణల్లో గాయపడిన బెంగాల్ బీజేపీ అధ్యక్షుడి ఫిర్యాదుమేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ప్రివిలేజెస్ కమిటీ రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీకి తనముందు హాజరుకావాలని నోటీసులు జారీ చేస్తే, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి దానిని అడ్డుకుంది. రేపోమాపో ప్రధాని మోదీ సందేశ్‌ఖాలీ వచ్చి మహిళలను పరామర్శిస్తారని కూడా వార్తలు వస్తున్నాయి.

ఈ రాజకీయాన్ని అటుంచితే, ఇద్దరు ప్రధాన అనుచరులను అరెస్టు చేసినప్పటికీ, షేక్ షాజహాన్ ఇంకా పోలీసులకు దొరకలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుకొట్టడానికి వీధిపోరాటాలు చేసి, తృణమూల్‌తోనే మార్పు సాధ్యమని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ ఈ ఘటన విషయంలో ఉన్నతంగా వ్యవహరించడం అవసరం. కేసులు, దర్యాప్తులు జరుగుతున్నప్పటికీ, మొదట్లో ఈ వ్యవహారంమీద నోరువిప్పకపోవడం, ఆ తరువాత కొట్టిపారేయడం మమతకు అప్రదిష్ఠ తెచ్చాయి. సార్వత్రిక ఎన్నికలముందు తృణమూల్ కాంగ్రెస్‌ను రాజకీయంగా భ్రష్టుపట్టించేందుకు విపక్షాలు సహజంగానే ప్రయత్నిస్తాయి. కానీ, మహిళాపక్షపాతినని చెప్పుకుంటున్న మమతా బెనర్జీ ఈ ఘోర ఉదంతం విషయంలో న్యాయంగా వ్యవహరించడం, ప్రజలకు విశ్వాసం కలిగించడం అవసరం.

మానసిక యుద్ధం, ముందస్తు విజయాలు

ఎన్నికల వేళ జనం మనసులో ఏమున్నదో తెలియదంటారు కానీ, మరీ అంత తెలియకుండా పోదు. రాజకీయ నాయకులలాగా ఓటర్లు తమ మనోభావాలు దాచిపెట్టుకుని నటించలేరు. గొట్టాలు పెట్టి, ఓటెవరికో చెప్పమంటే చెప్పరు కానీ, ముఖకవళికలు చదవగలిగేవారు అంతరంగాలను గ్రహించగలరు. కాకపోతే, ఎటువైపు మొగ్గు ఎంతెంత అన్న పరిమాణాల అంచనాలోనే సర్వేవీరులు సఫలమో విఫలమో అవుతుంటారు.

పాత్రికేయులు, పరిశీలకులు పసిగట్టగలిగే నాడి, జనంతోనే ఉండే నాయకులకు అందదా? అందుతుంది, కానీ, అంగీకరించరు. తన రేటింగ్ తగ్గిందని సిటింగ్ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు తెలుస్తుంది, కానీ ఒప్పుకోబుద్ధి వేయదు. ఎదురులేదని చెవుల్లో హోరెత్తే భజనల్లో హితవాక్యాలు వినిపించవు. క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులకే అట్లా ఉంటే, రాష్ట్ర నేతలకు ఎట్లా ఉంటుంది? కోటలాగా కమ్ముకున్న కోటరీ, జయజయధ్వానాలను తప్ప అపశబ్దాలను దగ్గరికి కూడా రానివ్వదు కనుక, చాపకింద నీరు అసలే తెలియదు.

కేసీఆర్ విషయంలో అలానే జరిగింది. జనంలో వ్యతిరేకత అంత గగ్గోలుగా ఉంటే కూడా, ఆయనకు వినపడలేదు. లేదా, వినిపించుకోలేదు. ఇప్పుడు జగన్ సంగతీ అంతే. కాళ్ల కింద నేల జారిపోతున్నా, వాస్తవం తలకెక్కడం లేదు. ఓటమి పర్యవసానాలంటే భయం లేకపోలేదు, కానీ, తన సొంత బటన్ సంక్షేమం మీద అపారమైన నమ్మకం. కండబలం మీద మంద బలం మీద విశేషమైన గౌరవం. తన గెలుపునకు భరోసా లేదన్న ధీమాతో ఊహలలో తేలిపోతున్నారు. తప్పుల మీద తప్పులు చేసి, అధికారాంతం కోసం అపురాపురుమంటున్నారు. మరోపక్క, అపజయభయంతో పత్రికల మీద, పాత్రికేయుల మీద దాడులకు తెగబడుతున్నారు. ఉత్తరాది తరహాలో మూకలను ఉసిగొల్పుతున్నారు. సర్వశక్తిమంతులమని భ్రమపడే ఇటువంటి నాయకుల వల్ల అనేక సమస్యలున్నా, జనానికి ఒక సదుపాయం కూడా ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల మనసులో మాట తమ చెవి సోకకుండా, తగిన జాగ్రత్తలు తీసుకుంటారు కాబట్టి, చాపకిందనీరులా ప్రజలు తమ అభీష్టాన్ని నెరవేర్చుకోవచ్చు.

ఏదైనా పక్షానికి గెలుస్తామన్న ధీమా, అన్నీ సవ్యంగా ఉన్నప్పుడు సానుకూలంగా పనిచేస్తుంది కూడా. యుద్ధం అన్ని వేళలా, భౌతికంగానే ఉండదు. ప్రత్యక్ష యుద్ధానికి ముందు పరోక్ష యుద్ధం ఉంటుంది, మరో పక్క, మానసిక యుద్ధం ఉంటుంది. ఉత్సాహం మీద ఉన్న పక్షానికి, విజయం ఖాయమనే నమ్మకం అదనపు బలాన్ని ఇస్తుంది. ఇతర అంశాలు అనుకూలంగా ఉంటే, ఈ అదనపు బలం విజయానికి చేరువ చేస్తుంది. ఏ పక్షమూ కూడా తను ఓడిపోతానని అనుకోదు. తనకు తాను విజయోత్సాహాన్ని, ప్రత్యర్థులకు అపజయ భావాన్ని కలిగించడమే మానసిక యుద్ధం లక్ష్యం.

జాతీయస్థాయిలో చూస్తే, తాను గెలవడం నూటికి నూరుపాళ్ళు, నిస్సందేహమైన పరిణామం అన్నట్టు భారతీయ జనతాపార్టీ ధీమాగా ఉంది. సొంతంగా 370 అందుకుంటామా లేదా, మిత్రులతో కలసి 400 దాటతామా లేదా అన్నదే తప్ప, మరో చింత తనకు లేదని ఆ పార్టీ చెబుతోంది. ఇక, తిరుగులేని అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి, జాతీయ మీడియా అంతా అదే చాటింపు వేస్తోంది. ఇది మొత్తంగా ఎన్నికల వాతావరణాన్ని ముందే ఫలితం నిర్దయమైపోయిన క్రీడ లాగా మార్చేసింది. బీజేపీ కూటమి 400 దాటడం అసాధ్యం అంటారు ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకుడు మల్లికార్జున ఖర్గే. ఆయన మాటల్లో కూడా "మీదే గెలుపు ఒప్పుకుంటున్నాము కానీ, అన్ని సీట్లు మాత్రం రావు" అన్న ధోరణే వినిపించింది. నాలుగువందలు మాకు వస్తాయో రావో కానీ, మీరు మాత్రం 40 కంటె ఎక్కువ తెచ్చుకోవాలని కోరుకుంటున్నా.. అని నరేంద్రమోదీ కాంగ్రెస్‌ను ఉద్దేశించి వెటకారు. ఇప్పుడు 40కీ 400కీ నడుమ యుద్ధమన్నమాట. తాను చేస్తున్న తప్పు అర్థమై ఖర్గే తాజాగా, బీజేపీకి 100 సీట్లు కూడా రావని అన్నారు కానీ, అది బింకం కోసంతో అన్న మాటల్లాగే వినిపించాయి.


మనవిజయం సాధిస్తున్నా అని మోదీ పరివారం అనుకుంటున్నట్టుగానే, ఓడిపోతున్నాం అని ప్రతిపక్ష శిబిరమూ అనుకుంటోంది. ఇప్పుడు కాదు, మేం 2029లో చూసుకుంటాం అని కేజ్రీవాల్ అంటున్నారు. ఇంకో వైపున ఒకనాటి కాంగ్రెస్ అగ్రనేతల వారసులు బీజేపీలోకి దూకేస్తున్నారు. కశ్మీర్ నాయకులు అర్ధరాత్రులు అధికార భవనాల్లో తచ్చాడుతున్నారని గులాం నబీ ఆజాద్ అంటున్నారు కానీ, దేశవ్యాప్తంగా వీరాధివీర ప్రతిపక్ష నేతలు అదే పని చేస్తున్నారు.

సాధారణ ఎన్నికల మానసిక యుద్ధరంగం ఒకవైపే మొగ్గి ఉంది నిజమే కానీ, మరి ఓటర్లు కూడా నిజంగా అటే ఉన్నారా? ఒక వార్తాసంస్థ జరిపిన సర్వేలో తెలంగాణలో 34 శాతం మంది ప్రధానిగా మోదీని ఇష్టపడుతుంటే, 23 శాతం మాత్రమే రాహుల్ గాంధీని కోరుకుంటున్నారట. మరి, తెలంగాణలో బీజేపీ కాంగ్రెస్ కంటె ఎక్కువ ఎంపీ సీట్లు గెలవబోతోందా? యాభై శాతం దాకా మోదీ ప్రభుత్వం పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్టు చెప్పారు, మరి వాళ్లంతా బీజేపీకి ఓట్లు వేస్తారా? ఈ దేశంలో ఓటింగ్ సరళి ఇంకా ప్రాంతీయ ఆలోచన ద్వారానే వ్యక్తమవుతోంది. ఎవరూ నేరుగా ప్రధానిని ఎన్నుకోరు. ఉత్తరాదిలో అనేక రాష్ట్రాలలో బీజేపీ ప్రాబల్యం కారణంగానే జాతీయస్థాయిలో ఆ పార్టీకి ఆధిక్యం లభిస్తోంది తప్ప, జాతీయ ప్రాధాన్యాల ఎంపికనుంచి కాదు. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు కావాలని బీజేపీ కోరుకునేది అందుకే, ప్రాంతీయ, జాతీయ ఆధిక్యం సాధించవచ్చునని. రాష్ట్ర స్థానికతలను అధిగమించే బాధ్యతను రామాలయ ప్రచారం తీసుకోగలదని ఆ పార్టీ ఆశిస్తోంది. బహుశా, అందులో అది కొంతవరకు విజయం సాధించేటట్టే ఉంది.

తమకిక ఓటమే ఖాయమని అనుకునేటట్టయితే, ప్రతిపక్ష కూటమికి పోరాడే చేవనే ఉండబోదు. ఎంతో కొంత ప్రతిఘటన ఇవ్వాలని, కనీసం అనుకున్న సంఖ్య అందుకుండా చూడాలని ప్రతిపక్ష శ్రేయోభిలాషులు సమాధానపడవచ్చును కానీ, ప్రతిపక్షాలు మాత్రం గెలవగలమనే అనుకోవాలి. ఏ ధైర్యంతో రెండు రాష్ట్రాల రైతులు ఢిల్లీలో వైపాయించి, తమ గొంతు వినిపిస్తున్నారు? కేంద్రం విపక్ష మీద ఢిల్లీ పోరులతో ఉద్యమిస్తానని కేజ్రీవాల్ ఎందుకు ఆలోచన చేస్తున్నారు? అన్ని చోట్లా వీగిపోయిన కాంగ్రెస్ పొత్తు ఉత్తరప్రదేశ్‌లో ఎందుకు సఫలమయింది? అన్ని చీలికలు, ఫిరాయింపులు జరిగి, అనేక ఉద్రిక్తతలను అనుభవించి, చివరకు మరాఠా రిజర్వేషన్లను సాధించి కూడా మహారాష్ట్ర సమాజం ఎందుకు అంత గుంభనంగా ఉన్నది? మరీ దేశం అంత ఎడారిగా మారలేదు! దేవుణ్ణి మెచ్చినంతమాత్రాన, ప్రజలు రాజునీ మెచ్చాలని ఏమీలేదు! తలచుకుంటే జనం తమ విచక్షణతో అందరినీ ఆశ్చర్యపరచవచ్చు!

జనహృదయంలో ఏకపక్షంగా ఘనవిజయాలు అందించే ఆలోచనలేవీ ఉన్నట్టు కనిపించకపోవడం వల్లనే ఢిల్లీ వ్యూహకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ లాగా, జగన్ లాగా ముంచుకు వస్తున్న ముప్పును చూడకుండా కళ్లు మూసుకోవడం లేదు. ఓట్ల కుంభవృష్టి కురుస్తుందని పైకి చెబుతూనే, ఒక్క చినుకూ వృథాపోకుండా పట్టుకోవాలని చూస్తున్నారు. అంకెలలో ఎవరు అధికులో వారికే అధికారం వస్తుంది నిజమే కానీ, ఈ సారి అనేక పవనాలు, అనేక వెల్లువలు భారతీయ సమాజంలో ప్రసరిస్తున్నాయేమో, ప్రవహిస్తున్నాయేమో అనిపిస్తుంది. తమను అతిగా ప్రభావితం చేసి, అభిమతాలను దారి మళ్లించాలనుకునే ధోరణులకు పగ్గం వేసే లక్షణం ఏదో మన రాజకీయ ఎంపికలకు ఉండవచ్చునన్న ఆశ కలుగుతుంది. ఇది ఒక ధోరణికి వ్యతిరేకతో, మరొకదానికి అనుకూలతో కాదు, అన్నీ తానై ఆక్రమించుకునే బాహుబలి తత్వాన్ని నిరాకరించే ప్రజాస్వామికత.

మరో రెండువారాల్లో ఎన్నికల రంగస్థలం అవతరిస్తుంది. ఆ తరువాత చేయలేని అనేక పనులు ఈ లోగా జరిగిపోతాయి. అనేక రాజకీయ కథనాలు సామాజిక మాధ్యమాల ద్వారా, ప్రధాన మీడియాద్వారా ప్రజల మీదకు దాడిచేస్తాయి. జనం చూపును, శ్రవణశక్తిని, విచక్షణను అనుసయించే, భ్రమపెట్టే, గందరగోళపరిచే అనేక విన్యాసాలు విజృంభిస్తాయి. ప్రజల ఎంపికల మీద సంధించే ఆఖరి అస్త్రం డబ్బు. ఈ సాధారణ ఎన్నికలు దేశానికి ఎంతో ముఖ్యమని, భయరహితమైన భవితవ్యానికి ఎంతో కీలకమని గుర్తింపు పెద్దగా లేకుండానే అశేషజనం ఈ ప్రక్రియలో పాల్గొంటారు. కానీ చైతన్యవంతులైన అతికొద్ది మంది మాత్రమే కాలాన్ని మలుపు తిప్పే ప్రయత్నం చేస్తారు.



జనహృదయంలో ఏకపక్షంగా ఘనవిజయాలు అందించే ఆలోచనలేవీ ఉన్నట్టు కనిపించకపోవడం వల్లనే ఢిల్లీ వ్యూహకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ లాగా, జగన్ లాగా ముంచుకు వస్తున్న ముప్పును చూడకుండా కళ్లు మూసుకోవడం లేదు. అంకెలలో ఎవరు అధికులో వారికే అధికారం వస్తుంది నిజమే కానీ, ఈ సారి అనేక పవనాలు, అనేక వెల్లువలు భారతీయ సమాజంలో ప్రసరిస్తున్నాయేమో, ప్రవహిస్తున్నాయేమో అనిపిస్తుంది. తమను అతిగ్రాప్రభావితం చేసి, అభిమతాలను దారి మళ్లించాలనుకునే ధోరణులకు పగ్గం వేసే లక్షణం ఏదో మన రాజకీయ ఎంపికలకు ఉండవచ్చునన్న ఆశ కలుగుతుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

తెలంగాణలో 34 శాతం మంది ప్రధానిగా మోదీని ఇష్టపడుతుంటే, 23 శాతం మాత్రమే రాహుల్ గాంధీని కోరుకుంటున్నారట. మరి, తెలంగాణలో కాంగ్రెస్ కంటె బీజేపీ ఎక్కువ ఎంపీ సీట్లు గెలవబోతోందా? యాభైశాతం దాకా మోదీ ప్రభుత్వం పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్టు చెప్పారు, మరి వాళ్లంతా బీజేపీకి ఓట్లు వేస్తారా? ఈ దేశంలో ఓటింగ్ సరళి ఇంకా ప్రాంతీయ ఆలోచన ద్వారానే వ్యక్తమవుతోంది.

ఎం.ఎస్. స్వామినాథన్‌ని 'ఎం.ఎస్.పి'కి కుదించేశారు!

హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్‌కి మరణానంతర భారతరత్న, ఇంతలోనే మళ్లీ రైతుల ముట్టడి. మళ్లీ కదిలింది హరిత విప్లవ పంజాబు రైతులే. హరిత విప్లవం వల్ల ధాన్యాల దిగుమతులు అవసరంలేని స్థితికి చేరుకున్నట్టే కనిపించినా, పప్పులూ వంటనూనెల దిగుమతులు 2031 దాకా తప్పవని నాబార్డ్ అధ్యయనం చెప్తున్నది. గత మూడేళ్లలో వాటి దిగుమతుల విలువ రూ.4 లక్షల కోట్లు. ఉల్లి వెల్లుల్లి దిగుమతులూ సాగుతున్నాయి. ఇంకా అనేక సమస్యలు – పాతవీ కొత్తవీ కూడా – పరిష్కారం కాకుండా ఉన్నాయి.

భారీస్థాయిలో యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో కూడిన హరితవిప్లవం భూసారాన్ని, నీటి వనరులని, పర్యావరణాన్ని దెబ్బతీసిందన్న విమర్శలు తెలిసినవే. అంతేనా? అనేకానేక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సమస్యల్నీ వైరుధ్యాల్నీ సృష్టించింది హరిత విప్లవం. గ్రామీణ నిరుద్యోగం, పట్టణాలకి వలసల పెరుగుదల సంక్షోభ స్థాయిలో ఉన్నాయి. పట్టణ నిరుద్యోగం తీవ్రమైంది. ఆ క్రమంలోనే యూపీఏ కాలంలో – కోట్లాదిమందికి ఏటా కనీసం వందరోజుల ఉపాధిని విధిగా ప్రభుత్వమే కల్పించే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రూపొందింది. దాని రద్దుని మోదీ తొలిదశలో ఆలోచించినా, దశాబ్దాల యూపీఏ వైఫల్యాన్ని ఎత్తి చూపటానికైనా ఆ పథకాన్ని అట్టిపెడతాం అన్నట్టుగా కొనసాగిస్తున్నారు. పదేళ్ల 'సబ్ కా వికాస్' పాలన తర్వాత, ఉచితంగా 80 కోట్ల మందికి నెలకి తలకు 5కిలోల తిండిగింజలని మరో 5 ఏళ్ల పాటు ఇస్తాం అని ప్రధానమంత్రి ప్రకటించారు. 2020లో కోవిడ్ వల్ల ప్రారంభించిన ఉచిత ఆహార ధాన్యాల పథకాన్ని, 2013 నాటి కాంగ్రెస్ వారి ఆహార భద్రతా చట్టంతో జోడించి మోదీ కొనసాగిస్తున్నారు. ఉచితాలు సముచితం కాదంటూనే మోదీ ఛత్తీస్‌గఢ్ ఎన్నికల మధ్య ఈ ప్రకటన చేశారు. ఇందిరమ్మ గరీబీ హటావో నినాదం ఇచ్చిన 50ఏళ్లకు ఇంకా 'గరీబ్ కళ్యాణ్ అన్నయోజన' పేరిట పథకం కొనసాగింపు ఆయా ప్రభుత్వాల నిర్వాకానికీ దేశ దుర్గతికీ సాక్ష్యంగా ఉన్నది. 80 కోట్ల మందికి ఐదేళ్లు ఉచితంగా తిండి గింజలను ఇవ్వగల సామర్థ్యాన్ని ఇచ్చిన హరిత విప్లవమే కోట్లాది పేదల్ని సృష్టించటం మన వ్యవస్థ విధాన వైఫల్యాల్నీ వైరుధ్యాల్నీ ఎత్తిచూపుతున్నది. దేశదుర్గతిని, వ్యవసాయరంగ సంక్షోభాన్ని బట్టబయలు చేసే యథార్థ దృశ్యమిది.



వ్యవసాయ యోగ్యమైన భూములని, అడవులని వ్యవసాయేతర రంగాల్లోని వారూ, పెట్టుబడిదారులూ, కార్పొరేట్లూ, ఫార్మ్ హౌసుల దొరలూ చౌకగా కాజేస్తున్నారు. అలాంటి వ్యవసాయభూముల మళ్లింపుని నివారించాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది. పాలక వర్గాలే కాక వామపక్షాలూ ఈ భూమి సమస్యని వదిలేశాయి.

బీటెక్ పాసైన లక్షలాదిమంది యువత అమెజాన్‌లో, ఊబర్‌లో, ఓలాలో రోజు కూలీలుగా కుములుతున్నారు. అలాంటివారు ప్రభుత్వ రంగంలో నాలుగో తరగతి ఉద్యోగాలకై ఏళ్ల తరబడి కోచింగులు తీసుకుంటున్నారు. విద్యా ఉపాధి రంగాల్లోని సంక్షోభాన్ని ఏకకాలంలో ఎత్తిచూపుతున్న సన్నివేశం ఇది. మిగులు ధాన్యాన్ని మార్కెట్‌కై ఉత్పత్తి చేస్తున్న వేలమంది 'అన్నదాతలు' – అందులో అత్యధిక భాగం భూస్వాములూ, ధనిక రైతులూ – రోడ్డెక్కిన తరుణంలో నిర్బంధమే విధానంగా ఉన్న రామరాజ్యం మనది. కనీస మద్దతు ధర, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు వంటి డిమాండ్లూ, ఆ డిమాండ్లకు పర్యాయపదమన్నట్టుగా పదేపదే ప్రస్తావించబడుతున్న స్వామినాథన్ రిపోర్టు మరోసారి విస్తృతంగా చర్చలోకి వచ్చాయి. అయితే పెద్దలంతా చూడదలచని వాస్తవం ఒకటుంది: స్వామినాథన్ 2006లోనే లేవనెత్తిన ఒక మౌలిక సమస్యని అందరూ విస్మరిస్తున్నారు. 'భూసంస్కరణలు ఇంకా ముగియని ఎజెండాగా ఉన్నాయి' అని ఆ నివేదిక నొక్కిచెప్పింది.

భూసంస్కరణల ప్రకారం మిగులు భూముల్నీ, బంజరు భూముల్నీ భూమిలేని పేద రైతాంగానికి పంచాలని నివేదికలో ఉందని అంతా మర్చిపోయారు. గ్రామీణ కుటుంబాల్లో 10 శాతంగా ఉన్న సంపన్నుల చేతిలో 54శాతం సాగుభూమి ఉన్నదనీ, క్రిందనున్న సగం గ్రామీణ జనాభా వద్ద కేవలం 3.8శాతం భూమి ఉన్నదనీ, ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూమికి తామే యజమానులు కావాలని గ్రామీణపేదలు కోరుతున్నారనీ స్వామినాథన్ నివేదిక చెప్పింది. కలప కాకపోయినా మిగతా అడవి ఉత్పత్తులైనా తమకు చెందాలనీ, పచ్చిక మైదానాల్లో పశువుల మేత హక్కులు గ్యారంటీ చేయబడాలనీ ఆదివాసులు, పశుపోషకులు, ఇతర గ్రామీణ పేదలూ కోరుతున్న వాటిని వారికి దక్కేలా చూడాలనీ నివేదికలో పేర్కొన్నారనీ అంతా మర్చిపోయారు! ఈ అసమానతలు కొనసాగుతున్నాయని ఇటీవలి వ్యవసాయ గణాంకాలూ సూచిస్తున్నాయి. సుమారు 48 కోట్ల ఎకరాల పంట భూమిలో వర్షాధార సాగుభూమి 60శాతం దాకా ఉందనీ, వ్యవసాయోత్పత్తుల్లో 45శాతం అలాంటి భూమి నుంచేననీ అందులో పేర్కొన్నారు. పంట కాలువల్లేని వెనుకబడిన ప్రాంతాల్లో చాలినంత సాగునీరు దక్కని గ్రామీణ పేదలే ఈ శ్రేణుల్లో ఉండి ఆహారోత్పత్తికి దోహదం చేస్తున్నారు. ఉచిత ఆహార పథకం పొందే 80కోట్ల మందిలో అత్యధికులు ఈ వర్గాలూ, గ్రామాల్లో బతకలేక పట్టణాలకు వచ్చిన పట్టణపేదలే. ఈ పేదల సమస్యల్ని పరిష్కరించకపోవటం వల్ల గిట్టుబాటు కాని వ్యవసాయాలు చేయలేక, ఆ భూముల్ని తెగనమ్ముకుని వ్యవసాయ రంగం నుంచే ఏటా లక్షలాదిగా వైదొలగుతున్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములని, అడవులని వ్యవసాయేతర రంగాల్లోని వారూ, పెట్టుబడిదారులూ, కార్పొరేట్లూ, ఫార్మ్ హౌసుల దొరలూ చౌకగా కాజేస్తున్నారు. అలాంటి వ్యవసాయ భూముల మళ్లింపుని నివారించాలని కమిషన్ రిపోర్టులో సూచించింది.

ఈ పేదల సమస్యలే మన దేశ వ్యవసాయ రంగ సంక్షోభంలోని కీలకాంశం. దాన్ని స్వామినాథన్ కమిషన్ ఎత్తి చూపినా విస్మరిస్తున్నారు. పాలక వర్గాలే కాక వామపక్షాలూ ఈ భూమి సమస్యని వదిలేశారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి పేరిట సమర్థించుకుంటున్నారు. హరిత విప్లవం మొదలైన సుమారు 30ఏళ్ల తర్వాత హరిత విప్లవ పితామహుడు నొక్కిచెప్పిన ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. స్వామినాథన్ రిపోర్టు అంటే కనీస మద్దతు ధరలూ వగైరాయే అన్న రీతిలో కుదించి వక్రీకరించి చూపెడుతున్నారు.

పెట్టుబడిదారీ వ్యవసాయం 50ఏళ్లుగా అత్యంత అభివృద్ధి చెందిన 'పంజాబులో ఈనాటికీ అర్ధ భూస్వామ్య ఫ్యూడలిజం తాండవిస్తున్నది; అందువల్ల పెట్టుబడిదారీ సంబంధాలు పూర్తిగా రూపుదాల్చలేదు' అని అక్కడి ఉద్యమకారులు అంటున్నారు. ఇటీవలి రైతు ఆందోళనలోని సంస్థలవారు తాము పంజాబులో దేశీ విదేశీ బడా పెట్టుబడిదారులతోపాటు అర్థఫ్యూడలిజాన్నీ వ్యతిరేకించి పోరాడాల్సివస్తున్నదని చెప్తున్నారు. పంజాబ్ గ్రామాల్లోని లక్షలాది వ్యవసాయకూలీలు భూమి కోసం తహతహలాడుతున్నారు. దేశంలోనే అత్యధిక శాతం దళితులున్న పంజాబులో వారిపై దోపిడీ అణచివేతలు కొనసాగుతున్నాయి. జాట్ తదితర భూస్వామ్యవర్గాల సేవలో తరిస్తున్న పార్టీలన్నీ వారిని విస్మరిస్తూ వచ్చాయి. ఆ అదనులోనే ఆప్ పార్టీ దళిత ముఖ్యమంత్రి వచ్చారు. స్వామినాథన్ పేరిట భూస్వాముల సేవలో మునిగిన అందరినీ ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ పేదలు నిలదీయాల్సిన తరుణమిది.

■ ఎమ్. జయలక్ష్మి
ఆప్కాబ్ రిటైర్డ్ ఏజీఎం

గురువులు కరువయ్యారు!



నేటి యువత అధిక సంఖ్యలో ఇంజనీరింగ్, ఇతర టెక్నికల్ డిగ్రీలు చదువుతూ సాఫ్ట్‌వేర్ రంగంలోనే అధిక మొత్తంలో వేతనాలు వస్తున్నాయన్న ఆశతో ఆ రంగం వైపే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. బీఏ, బీఎస్సీ బీకాం లాంటి డిగ్రీలు; బీఈడీ, ఎంఈడీ, ఎంఎస్సీ లాంటి ఉన్నత కోర్సులు చదివేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ప్రైవేట్ విద్యా సంస్థలు, ముఖ్యంగా బడ్జెట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత మరింత అధికంగా ఉంది. ఏడాది పొడవునా ఉపాధ్యాయులు కావాలని దినపత్రికల్లో నిత్యం వస్తున్న ప్రకటనలే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ ఉపాధ్యాయులకు లక్షల్లో వేతనాలు వస్తున్నాయి. అదే విధంగా సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా లక్షల్లో వేతనాలు వస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రయివేటు విద్యారంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. రాష్ట్రంలో 10,900కు పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. లక్షా 79 వేలమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరో 20వేల నిష్ణాతులైన ఉపాధ్యాయుల అవసరం ఉందని అంచనా. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంటుంది.

ఇంటర్నేషనల్ స్కూల్స్, సీబీఎస్సీ స్కూల్స్‌లో సైతం గత్యంతరం లేని పరిస్థితుల్లో పదవతరగతి, ఇంటర్, డిగ్రీ నామమాత్రంగా పాస్ అయిన వాళ్లను టీచర్లగా నియమించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఏడు నుంచి పది తరగతుల విద్యార్థులకు ఒక నిర్దిష్ట సబ్జెక్టులో నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు దొరకడం లేదు. విచిత్ర పరిణామం ఏమిటంటే గత నాలుగేళ్ళుగా బడ్జెట్ స్కూళ్లలో ఉన్న మాములు టీచర్లను కూడా ఇంటర్నేషనల్, సీబీఎస్సీ స్కూల్ యాజమాన్యాలు ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇచ్చి తీసుకోవడం. సిటెట్, నెట్, టెట్ వంటి పరీక్షలు రాసి ప్రభుత్వ టీచర్లుగా ఉద్యోగాలు రాని వారు సహితం ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు లేదా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసమే పరిగెడుతున్నారు తప్ప తాము నేర్చుకున్న విద్యను ఇతరులకు నేర్పించే గురువులుగా మారడం లేదు.

తరగతి నిర్వహణ, నిర్దిష్ట విషయాలలో నైపుణ్యం, మౌఖిక కమ్యూనికేషన్, విభిన్న పరిస్థితులకు అనుగుణంగా విద్యను బోధించే సామర్థ్యం, టెక్నాలజీకి అనుగుణంగా బోధనా సామర్థ్యం, వినూత్న శిక్షణ వ్యూహాలు, వ్యక్తిత్వ లక్షణాలు, సమర్థవంతమైన సంభాషణ, సహనం సానుకూలత, సృజనాత్మకత బహుళ సబ్జెక్టులను బోధించే నైపుణ్యం.. ఇవేవీ నేటి టీచర్లలో కనిపించడం లేదు. అడిగినంత ఫీజులు కట్టినప్పటికీ విద్యార్థులకు సరైన బోధన లభించడం లేదని తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది. చాలా పాఠశాలల్లో టీచర్లు లేక కొన్ని పిరియడ్స్ ఖాళీగా కూర్చోవలసి వస్తున్నదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

హిందీ పండిత్ టీచర్లకు మరింత కొరత ఏర్పడింది. హిందీ భాషలో డిప్లొమా చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతూ ఉంది. ఒకప్పుడు పదవ తరగతి తర్వాత భూషణ్, విద్వాన్ పరీక్షలు రాసి హిందీ టీచర్లుగా నియామకాలు చేపట్టేవారు. ప్రస్తుతం ఇంటర్ తర్వాత హిందీ భాషలో డిప్లొమా చేయాల్సి ఉంది. కానీ నేటితరం ఎవరూ హిందీ డిప్లొమా కోర్సులు చదివేందుకు ముందుకు రాకపోవడం వల్ల హిందీ పండితుల కొరత తీవ్రంగా ఉంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి హిందీ పండితులను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గత నాలుగైదేళ్ళుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటం వల్ల ఉపాధ్యాయుల కోసం పాఠశాలల మధ్య తీవ్ర పోటీ నెలకొంటున్నది. కావాల్సిన ఉపాధ్యాయులను సరఫరా చేస్తామంటూ బోగస్ సంస్థలు వెలిశాయి. ప్రైవేట్ యాజమాన్యాలు వాటికి డబ్బులు చెల్లించి మోసపోయిన సంఘటనలు కూడా జరిగాయి. ప్రైవేటు విద్యాసంస్థల మధ్య టీచర్ల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో కొందరు ఉపాధ్యాయులు ఏ సంస్థ ఎక్కువ వేతనం ఇస్తే ఆ సంస్థలో చేరిపోవడం పరిపాటిగా మారింది. ఒక సంస్థలో చేరిన టీచర్ ఆ విద్యా సంవత్సరమంతా పనిచేయాలని నిబంధన ఉన్నప్పటికీ నైతిక విలువలను మరిచి కొద్దిపాటి వేతనం కోసం మూడు నెలలకోమారు ఆరు నెలలకోమారు టీచర్లు స్కూల్స్ మారిపోతూ విద్యార్థులకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నారు.

పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరికొన్నాళ్ళకు గురువులు కరువయ్యే ప్రమాదం ఉంది. విద్య నేర్చుకున్న వారే మరొకరికి విద్య నేర్పడానికి ముందుకు రాకపోవడం వ్యవస్థ పతనానికి దారితీస్తుంది. ప్రభుత్వం జరుగుతున్న పరిణామాలను పూర్తిగా విశ్లేషించి యువతరాన్ని ఉపాధ్యాయ ఉద్యోగాల వైపు ప్రోత్సహించి రాబోయే తరానికి మంచి గురువులను అందించేలా చర్యలు చేపట్టాలి.

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా...

'దోపిడి చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం. ప్రాంతం వారే దోపిడి చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం' అని నాడు ప్రజాకవి కాళోజీ అన్న మాటలు 3 డిసెంబర్ 2023న తెలంగాణలో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. నియంతృత్వ పోకడలతో తెలంగాణవాదం పేరుతో స్వరాష్ట్రాన్ని దోచుకుతిన్న బీఆరఎస్ పార్టీని ప్రజలు నిజంగానే పాతర పెట్టారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలు ఎంత బలంగా కోరుకున్నారో, బీఆరఎస్ పార్టీని గద్దె దింపాలని అంతే గట్టిగా అనుకున్నారు. ప్రజలు తాము ఎదుర్కొన్న బాధను, వ్యథను, అణచివేతను, ఫ్యూడలిజాన్ని ఓటు అనే పాశుపతాస్త్రంతో కూలదోశారు. కాళోజీ మాటలే ప్రేరణగా తాము అనుభవించిన గోసను మరిచిపోకుండా గుర్తు పెట్టుకున్నారు. ప్రజలంటే లెక్కలేనితనానికి, అహంకారానికి, రాచరికపు నియంతృత్వ పోకడలకు ప్రజలు ఘోరీ కట్టారు. నేడు కుటుంబ చెర నుంచి విడుదలై తెలంగాణ రాష్ట్రం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నది.

ఈ పదేళ్ళ పాలనలో బీఆరఎస్ పార్టీ బంగారు తెలంగాణ పేరుతో ఉన్న సంపదను కొల్లగొట్టి, అందినకాడికి దోచుకున్న తీరే వారి పరాజయానికి బాటలు వేసిందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. ప్రతి శాఖలోనూ స్వప్రయోజనాల కోసం వారు పెంచి పోషించిన అక్రమార్కుల అవినీతి చిట్టా ఒక్కొటిగా బయటపడుతున్న తీరు తెలంగాణ సమాజాన్ని విస్మయానికి గురి చేస్తున్నది. బీఆరఎస్ పాలన ప్రతీ శాఖను గుల్ల గుల్ల చేసింది. ఏ శాఖ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, ప్రతి శాఖ చరిత్ర సమస్తం అవినీతి, అక్రమాల మయం అనే పరిస్థితి నెలకొని ఉంది. ఈ పదేళ్ళలో యువత, కార్మికులు, కర్షకులు, తెలంగాణ ఉద్యమకారులు బీఆరఎస్ పాలనలో నిరాదరణకు గురయ్యారు. దళితులు, గిరిజనులు, బీసీల హక్కులను నాటి నిరంకుశ ప్రభుత్వం విస్మరించింది. పక్క రాష్ట్రాల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోళ్ళతో వేల కోట్ల అప్పులు, విద్యుత్ రంగంలో అక్రమ నియామకాలు, ఆదాయ వ్యయాలపై సరైన అంచనాలు లేకుండా ఇష్టానుసారంగా నిధుల మళ్ళింపు, ఆర్థిక అంశాలపై అవగాహన లేమితో చేసిన అప్పులు, కాళేశ్వరం అవినీతి... ఇలా చెప్పుకుంటూ పోతే బీఆరఎస్ ప్రభుత్వం పథకాలు, ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తాం అంటూ ప్రజలను మభ్యపెట్టి వారిని అధఃపాతాళంలోకి నెట్టింది. బీఆరఎస్ పాలనలో ప్రజలు తమ సమస్యలు పరిష్కారమయ్యే దారి లేక ఎంత నరకయాతన పడ్డారో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వెల్లువెత్తుతున్న దరఖాస్తులే చెపుతాయి. వీరు సాగించిన దమనకాండతో రాష్ట్ర సంపద ఆవిరై పోయింది. ఆత్మగౌరవాన్ని కోల్పోయామనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. మొత్తంగా 'దశాబ్ది' బీఆరఎస్ పాలన తెలంగాణ రాష్ట్రాన్ని 'ఒక శతాబ్దం' వెనక్కు నెట్టింది.

ప్రతికూల పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర పాలనను చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను నిష్ఠతో నిర్వహిస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగా 'ఆడిందే ఆట పాడిందే పాట' అన్నట్టుగా కాకుండా పూర్తి వివేచనతో, ఎలాంటి తడబాటుకు గురి కాకుండా రాష్ట్ర అవసరాలను, ఆదాయ వ్యయాలను బేరీజు వేసుకొని, ఎన్నికల హామీలు ఒక్కోదాన్ని అమలు చేస్తూ తనను తాను చేతల ప్రభుత్వంగా నిరూపించుకుంటున్నది.






ఈ ప్రతికూల పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర పాలనను చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను నిష్ఠతో చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నర నెలల పాలనా కాలంలోనే ప్రజలకు రాష్ట్ర పురోగమనంపై గొప్ప నమ్మకాన్ని కలిగించింది. కరీంనగర్‌ను డల్లాస్ చేస్తాం, హైదరాబాద్‌ను ఇస్తాంబుల్‌గా మారుస్తాం, లక్షల కోట్ల పనులు చేపడతాం, కుర్చీ వేసుకొని పనులు చేపిస్తాం అంటూ ప్రజలను మభ్యపెట్టే వాగ్దానాలు చేయకుండా, రాష్ట్ర వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ, నిర్వీర్యమైపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక యజ్ఞమే చేపట్టింది. ఇందులో భాగంగా మొదట గత ప్రభుత్వ పాలనలో పలు వ్యవస్థలు గాడి తప్పిన తీరును ప్రభుత్వం ప్రజల ముందుంచింది. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, విద్యుత్, నీటిపారుదల రంగాలపై ప్రభుత్వం శ్వేతపత్రం సమర్పించి అభివృద్ధి పేరుతో బీఆరఎస్ ప్రభుత్వం తెలంగాణ ఖజానాను కొల్లగొట్టిన తీరును ప్రజల కళ్ళ ముందు నిలిపింది. రాష్ట్ర వాస్తవ పరిస్థితులపై ప్రజలకు అవగాహనను కల్పించి, పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా కార్యాచరణను ప్రకటించి, సంక్షేమ, అభివృద్ధి పథకాలను అత్యంత పారదర్శకతతో అమలు చేస్తున్నది.

'అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. అవి చూపించి అభివృద్ధి జరిగిందని భ్రమపడితే దానికంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. చివరి వరుసలో నిలబడ్డ తండాలు, గూడేలు, పల్లెల్లో ఉండే ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందినప్పుడే అది నిజమైన పురోగతి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న మాటలే కాంగ్రెస్ ప్రభుత్వ కార్యాచరణను స్పష్టం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన 48గంటల్లోనే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ సేవలు 10 లక్షల రూపాయలకు పెంచి ప్రజా సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నది. మరికొన్ని రోజుల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేసి పేదలకు మరింత చేయూతనివ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. గత ప్రభుత్వం మాదిరిగా 'ఆడిందే ఆట పాడిందే పాట' అన్నట్టుగా కాకుండా పూర్తి వివేచనతో, ఎలాంటి తడబాటుకు గురి కాకుండా రాష్ట్ర అవసరాలను, ఆదాయ వ్యయాలను బేరీజు వేసుకొని ఒక్కో హామీని అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా నిరూపించుకుంటున్నది. ఆత్మగౌరవమే ఆలంబనగా బతికే తెలంగాణ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవడమే ఏకైక లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది.

● కొండా సురేఖ
అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 కనిష్ఠం 20.2

దగ్గు, జలుబు జ్వరం





ఉస్మానియా ఆస్పత్రిలో క్యూలో ఉన్న రోగులు

- పెరుగుతున్న వైరల్ ఇన్ఫెక్షన్ కేసులు
- అడినో వైరస్ విజృంభణతో అవస్థలు
- పగలు ఎండ, రాత్రి చలితో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న ఫ్లూ బాధితులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణం మారుతోంది. వేసవి కాలం ప్రవేశిస్తున్న దృష్ట్యా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ సాయంత్రం వేళ వాతావరణం చల్లగా ఉంటోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల ఉష్ణోగ్రతల్లో చోటుచేసుకుంటున్న విపరీత మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత పది రోజులుగా నగరంలో ఇలాంటి వాతావరణం ఉండడంతో వైరస్ శక్తిని పుంజుకుని జనంపై దాడిచేస్తున్నది. ఈ క్రమంలో చాలామంది జ్వరాల బారిన పడి వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

పెరుగుతున్న రోగులు

ఫీవర్ ఆస్పత్రికి జ్వరంతో వచ్చే కేసులు పెరుగుతున్నాయి. గత నెలలో 350నుంచి 400 లోపు ఉంటే, ప్రస్తుతం 450కి పైగా ఉంటున్నాయి. సోమవారం 520 ఉండగా, మంగళవారం 470 కేసులు నమోదయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రికి మంగళవారం 2,986మంది, గాంధీ ఆస్పత్రికి 2,994మంది రోగులు రాగా, వీళ్లలో సీజనల్ జ్వరాల రోగులు ఎక్కువే ఉన్నారు.

ప్రస్తుతం ఎక్కువగా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శరీరపు నొప్పులు, ఫ్లూ జ్వరం, ఆయాసం సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. వైద్యుల వద్దకు వచ్చే కేసుల్లో దాదాపు ఇరవై శాతం ఈ రకం కేసులే ఉంటున్నాయి. ఫీవర్ ఆస్పత్రికి ప్రతిరోజూ 400 నుంచి 470 వరకు ఓపీ కేసులు ఉంటుండగా, 300 మంది జ్వర బాధితులు కావడం గమనార్హం.

బలపడుతున్న వైరస్

రోగ కారకమైన అడినో వైరస్ ఈ వాతావరణంలో బాగా బలపడుతుంది. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే ఈ వైరస్ చాలా చురుకుగా ఉండి తన శక్తిని రెట్టింపు చేసుకుంటుంది. చల్లటి ప్రదేశంలో ఈ వైరస్ కదలికలు తక్కువగా ఉంటాయి. అవి

మిగతా 6వ పేజీలో..

అడినో వైరస్‌తో ఇబ్బందులు



సాధారణ మందులు విని యోగిస్తే దగ్గు, జ్వరం, ఫ్లూ వంటి జబ్బులు సహజంగా నాలుగైదు రోజుల్లో తగ్గిపోవాలి. కానీ ప్రస్తుతం ఈ అడినో వైరస్ వల్ల వెంటనే తగ్గడం లేదు. కొన్ని సార్లు వైరల్ ఫీవర్లు, దగ్గు వారాల తరబడి ఉంటుంది. ఇమ్యూనిటీ లేకపోవడంతో త్వరగా జబ్బు నియంత్రణలోకి రావడం లేదు. చాలామంది గాలి, వెలుతురు లేని గదుల్లో ఉండడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్‌ఫెక్షన్ త్వరగా విస్తరిస్తున్నది. మధుమేహం, కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారికి వైరస్ తీవ్రత తగ్గడానికి కొంత సమయం పడుతుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే పిల్లలు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. కిడ్నీ, మధుమేహం, గుండెజబ్బులు, ఇతర వ్యాధులు, స్మోకింగ్ చేసే వారికి ఈ వాతావరణం మరింత ప్రమాదం తెచ్చిపెడుతుంది.

- డాక్టర్ దిలీప్ నందమూరి, సీనియర్ జనరల్ ఫిజీషియన్, యశోద ఆస్పత్రి

జీహెచ్‌ఎంసీలో బదిలీలు..!

- అడ్మిన్ సరోజ అవుట్ ● నళినీ పద్మావతికి బాధ్యతలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో అంతర్గత బదిలీలు జరిగాయి. ఇతర కార్పొరేషన్లు, మునిసిపాల్టీల నుంచి వచ్చిన పలువురికి పోస్టింగ్‌లు ఇవ్వడంతో పాటు.. సంస్థలోని కొందరు అధికారులకు స్థానచలనం కల్పిస్తూ బుధవారం కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కమిషనర్ (అడ్మిన్) పి.సరోజను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఇటీవల జీహెచ్ ఎంసీలో రిపోర్ట్ చేసిన నళినీ పద్మావతిని అదనపు కమిషనర్‌గా నియమించారు. సరోజ శాఖాపరమైన విచారణ అదనపు కమిషనర్‌గా కొనసాగనున్నారు. అదనపు కమిషనర్ (లీగల్, ఎలక్ట్రికల్) శ్రీవత్స సెలవుపై వెళ్లడంతో ఆయన బాధ్యతలను కె.సత్యనారాయణకు అప్పగించారు. వేణుగోపాల్‌రెడ్డిని శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్(ఎస్‌డబ్ల్యూఎం)గా, మహ్మద్ షేక్‌ను ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ (ఎస్‌డబ్ల్యూఎం)గా నియమించారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

కార్పొరేటర్ల నుంచి ఫిర్యాదులు రావొద్దు

- పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై కార్పొరేటర్ల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం మేరకు జరుగుతుందా.. లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందంటూ కౌన్సిల్‌లో కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో బుధవారం కమిషనర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వీపింగ్ మిషన్లపై నిఘా పెట్టాలని, నిర్దేశించిన సమయం వరకు స్వీపింగ్ చేయించాలన్నారు.

బస్తీ యాక్షన్ ప్లాన్..

బస్తీ స్థాయిలో వ్యర్థాలను సేకరించేందుకు రిక్షాలను ఏర్పాటు చేయాలని, బస్తీవాసులకు ఈ విషయంలో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. పారిశుధ్య పనుల్లో చురుకుగా పనిచేసే కార్మికులకు బహుమతులు అందచేయాలన్నారు.

చెరువులు అన్యాక్రాంతం కాకుండా..

చెరువులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. వాటిని ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. చెరువుల చుట్టూ ఖాళీ స్థలాలు కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు కమిటీ సభ్యులు ప్రతిరోజూ సంప్రదింపులు జరిపేందుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

దుర్గం చెరువులోకి మురుగునీరు!

- హానికారక రసాయనాలు కూడా..
- ఎఫ్‌టీఎల్‌లో 78, బఫర్‌జోన్‌లో 146 నిర్మాణాలు
- హైకోర్టుకు నిపుణుల కమిటీ నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దుర్గం చెరువులోకి శుద్ధి చేయకుండానే మురుగునీరు, హానికారక రసాయన జలాలు వచ్చి చేరుతున్నాయని నిపుణుల కమిటీ పేర్కొంది. మ్యాప్ ప్రకారం ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో 78, బఫర్ జోన్ పరిధిలో 146 నిర్మాణాలు ఉన్నాయని హైకోర్టుకు తెలిపింది. ఇటీవల దుర్గం చెరువులో పెద్ద ఎత్తున చేపలు చనిపోవడంపై పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. చెరువును పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌ఈఈఆర్‌ఐ) నాగ్‌పూర్ డైరెక్టర్ అతుల్ నారాయణ్ వైద్య, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ (క్యాడ్) ముఖ్యకార్యదర్శి, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి శాంతివర్ధనిలతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం పరిశీలించింది.

నివేదికలోని అంశాలు..

దుర్గం చెరువు జూబ్లీహిల్స్‌-మాదాపూర్ మధ్య 160 ఎకరాల్లో విస్తరించి ఉంది. హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు ఏర్పాటు చేసిన 5 ఎంఎల్‌డీ, 7 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ఎస్టీపీ ప్లాంట్లు ఉండగా.. 30 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన కాల్వల ద్వారా సీవేజ్ వాటర్ వచ్చి చేరుతోంది. కేవలం 12 ఎంఎల్‌డీ మాత్రమే శుద్ధి చేస్తుండగా మిగతా మురుగు జలాలు ట్రీట్‌మెంట్ లేకుండానే చేరుతున్నాయి. అలాగే దుర్గం చెరువు దిగువన, మల్కం చెరువు ఎగువన ఎటువంటి ఎస్టీపీ ప్లాంట్లు లేవు. 5 ఎంఎల్‌డీ ఎస్టీపీ ప్లాంట్ జలాల్లో తప్ప మిగతా నీటిలో ప్రమాదకర కోలీఫోం, ఈకోలి ఉన్నట్లు తేలింది. నీటి నాణ్యత దారుణంగా ఉండడంతోపాటు ఐరన్, మాంగనీస్, నికెల్, జింక్, మెంటలాయిడ్స్, ఆర్సెనిక్, బోరాన్ వంటి భార ధాతువులు ఉన్నట్లు తేలింది. సీవేజ్ మళ్లింపునకు మెట్రో వాటర్ బోర్డు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తికాలేదని నివేదికలో తెలిపింది. పూర్తిస్థాయి పరిశీలనలతోపాటు జలాశయ పరిరక్షణ, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేసింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్‌బోర్డు సహా ప్రతివాదులందరికీ అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

పోలీసుల కస్టడీకి డ్రగ్స్ ముఠా సభ్యులు

మూడు రోజులపాటు టీన్యాబ్ పోలీసుల విచారణ ● హైదరాబాద్ డ్రగ్స్ లింకులపై ఆరా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టుబడి రిమాండ్‌లో ఉన్న అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా కేసులోని ముగ్గురిని చంచల్‌గూడ జైలు నుంచి తెలంగాణ నార్కొటిక్ బ్యూరో (టీ న్యాబ్) పోలీసులు బుధవారం కస్టడీలోకి తీసుకున్నారు. వీరిని మూడు రోజులపాటు విచారించనున్నారు. అంతర్జాతీయ ఘరానా నైజీరియన్ డ్రగ్స్ కింగ్‌పిన్ ఉవాల ఉడొక స్టాన్లీ కేసులో టీన్యాబ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రిమాండ్‌లో ఉన్న స్టాన్లీని ఐదు రోజులపాటు పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించిన పోలీసులు దేశవ్యాప్తంగా స్టాన్లీ విస్తరింపజేసిన డ్రగ్స్ నెట్‌వర్క్ వివరాలు సేకరించారు. అందులో భాగంగానే ఇటీవల మరో ముగ్గురు స్మగ్లర్స్ (పుణెకు చెందిన సౌరబ్, గోవాకు చెందిన దివాకర్‌బాబు, విశాల్‌)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో బుధవారం వారిని మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు.



సరుకు దిగుమతి బాధ్యత సౌరబ్‌దే..

కస్టడీలోకి తీసుకున్న సౌరబ్, దివాకర్‌బాబు, విశాల్‌ల నుంచి పోలీసుల పలు విషయాలను రాబట్టినట్లు తెలిసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే డ్రగ్స్‌ను పుణెలో దిగుమతి చేసుకునే

మిగతా 6వ పేజీలో..

బీఆర్‌ఎస్‌కు 'స్టాండింగ్' తలనొప్పి..!

- పార్టీ నుంచి ఇప్పటికే పది నామినేషన్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నిక బీఆర్‌ఎస్‌కు తలనొప్పిగా మారుతోంది. పార్టీకి చెందిన 10మంది కార్పొరేటర్లు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారు. మరి కొందరు నామినేషన్లు వేసే అవకాశముందని తెలుస్తోంది. గత రెండు పర్యాయాలు ఎంఐఎంతో అవగాహన వల్ల కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బీఆర్‌ఎస్ నుంచి ఎనిమిది మంది, ఎంఐఎంకు చెందిన ఏడుగురికి అవకాశం కల్పించారు. ఇదే ఒప్పందం ఇప్పుడు కూడా కొనసాగుతుందని భావించారు. అయితే, ఎనిమిదికి మించి సభ్యులు నామినేషన్లు వేసిన నేపథ్యంలో ఏం జరగనుందన్నది చర్చనీయాంశమైంది. అధికారం కోల్పోవడం.. కొందరు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరడం.. ఇంకొందరు అదే దారిలో ఉన్నారన్న ప్రచారం నేపథ్యంలో అగ్రనేతలు ఏం చేస్తారనేది కీలకం కానుంది.

'ఆసరా'లో అక్రమాలు 8

గంటకో బస్సు..



- ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం ● అవస్థలు పడ్డ ఉద్యోగులు, విద్యార్థులు
- 30 శాతం బస్సులతో సేవలెలా : తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సిటీబస్సులు లేక ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. మేడారం జాతర నేపథ్యంలో 70శాతం బస్సులు సిటీనుంచి వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు రూట్లలో గంటకో బస్సును ఆర్టీసీ నడిపించడంతో ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై వేళాడుతూ ప్రయాణించారు. వేలాదిమంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. జాతర నేపథ్యంలో సిటీబస్సులు పలు జిల్లాలకు వెళ్లిపోవడంతో గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సుల బంద్ పాటించిందా.. అన్నట్టుగా పరిస్థితులు ఏర్పడ్డాయి. 30 శాతం బస్సులతో గ్రేటర్‌లో ప్రయాణికులకు సేవలు ఎలా అందించాలో అర్థం కాక పలు డిపోల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. డిపోలకే పరిమితమైన పాతబస్సులను రోడ్లపైకి తెచ్చి తక్కువ దూరం కలిగిన రూట్లలో నడుపుతున్నారు.

కొల్లగొడుతున్నారు..



స్వీపింగ్ పేరిట జీహెచ్‌ఎంసీ నిధులు స్వాహా..!

- అద్దె యంత్రాల పేరిట దందా
- యేటా రూ.22.50 కోట్లు ఖర్చు
- బాబ్‌కాట్లకు మరింత అదనం
- ఇప్పటి దాకా రూ.200 కోట్ల వరకు వ్యయం

స్వీపింగ్ మిషన్లకు అద్దె పేరిట జీహెచ్‌ఎంసీలో జోరుగా దందా జరుగుతోంది. ఏటా కొన్ని చొప్పున సొంతంగా వాహనాలను కొనుగోలు చేసే శక్తి ఉన్నా అద్దెవాహనాల వైపే అధికారులు మొగ్గుచూపుతూ కోట్లాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. స్వీపింగ్‌తో పాటు బాబ్‌కాట్లకు కలిపి ఇప్పటి వరకు రూ.50కోట్లు ఆర్థికంగా బల్దియాకు నష్టం చేకూర్చారు.

- గ్రేటర్‌లో రోడ్లు ఊడ్చేందుకు 18 స్వీపింగ్ యంత్రాలను జీహెచ్‌ఎంసీ అద్దెకు వినియోగిస్తోంది. ఇందుకు ఒక్కో యంత్రానికి నెలకు రూ.10.40 లక్షల చొప్పున యేటా రూ.1.25 కోట్లు చెల్లిస్తున్నారు. ఈలెక్కన 18 వాహనాలకు రూ.22.5 కోట్లు ఖర్చవుతోంది. అయితే, కంపెనీని బట్టి ఒక్కో స్వీపింగ్ యంత్రం ఖరీదు రూ.40లక్షల నుంచి రూ.60లక్షలు. వాహనాల కొనుగోలు ధరకన్నా చాలా ఎక్కువగా జీహెచ్‌ఎంసీ అద్దె చెల్లించడం విడ్డూరం

- 70కిపైగా బాబ్‌కాట్ల(చిన్న స్వీపింగ్ యంత్రం)నూ రహదారుల స్వీపింగ్ కోసం వినియోగిస్తున్నారు. ఒక్కో బాబ్‌కాట్‌కు యేటా రూ.30 లక్షలు చెల్లిస్తున్నారు. మొత్తం బాబ్‌కాట్లకు రూ.21 కోట్లు వెచ్చిస్తున్నారు. వాస్తవంగా ఒక్కో బాబ్‌కాట్ ధర రూ.20-25 లక్షలు. కానీ.. అంతకు 50 శాతం ఎక్కువే సంవత్సరానికి అద్దెగా చెలిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బల్దియాకు ఆది నుంచి అద్దె వాహన వినియోగంపైనే మోజు ఎక్కువ. సొంతంగా కొనుగోలు చేసే శక్తి ఉన్నా అందుకు అధికారులు ఆసక్తి చూపరు. నిర్వహణ వ్యయమెక్కువ.. సంస్థకు ఆదా చేసేందుకేనంటూ కోట్లు ఖర్చు చేస్తుంటారు. కమీషన్ల కక్కుర్తే ఇందుకు ప్రధాన కారణం. స్వీపింగ్ యంత్రాలు, బాబ్‌కాట్ల పేరిట పారిశుధ్య నిర్వహణ విభాగంలో భారీ అవినీతి జరుగుతోంది. సాంకేతిక పర్యవేక్షణ అని చెబుతున్నా.. క్రమేణా అక్రమాలు అధికమవుతున్నాయి. రోడ్లు ఊడ్చడం నుంచి చెత్త తరలింపు, శాస్త్రీయ నిల్వ, నిర్వహణ వరకు అదే తీరు. ఒక యంత్రానికి యేడాది అద్దెగా చెల్లించే మొత్తంతో రెండు యంత్రాలు కొనుగోలు చేసే వీలున్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అద్దె బిల్లుల చెల్లింపులో వాటాలు తీసుకునేందుకు అలవాటు పడిన కొందరు ఉన్నతాధికారులు ఈ తతంగాన్ని నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో రాజకీయ ఒత్తిళ్లూ అద్దె యంత్రాల వినియోగానికి మరో కారణం.

రూ.200 కోట్లు ఖర్చు

పారిశుధ్య కార్మికులు ప్రమాదాలకు గురవుతుండడంతో నగరంలోని ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ కొన్నేళ్ల క్రితం ప్రారంభించారు. మొదట్లో సొంత

మిగతా 6వ పేజీలో..

దగ్గు, జలుబు, జ్వరం

(5వ పేజీ తరువాయి)

వైరస్ కదలికలు తక్కువగా ఉంటాయి. అవి కదలకుండా ఉండడం వల్ల శ్వాస తీసుకుంటున్న సమయంలో ఊపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరంలో ప్రవేశించిన వైరస్ మొదట నిద్రావస్థలో ఉండి ఐదారు రోజుల తర్వాత తన ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు.

ఫ్లూతో జర భద్రం

తేమ వాతావరణం వైరస్‌కు అనుకూలం కావడంతో ఫ్లూ ముప్పు పొంచి ఉంది. ఫ్లూ వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుల్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధిని నిర్ధారించి మంచి మందులు ఇవ్వాల్సి ఉంటుంది.

ర్యాపిడ్ డయాగ్నోస్టిక్, పీసీఆర్ నిర్ధారణ వంటి పరీక్షలు చేయించాలి. ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్ష వల్ల కొంత మేరకు వ్యాధిని నిర్ధారించగలమని, పీసీఆర్ పరీక్ష వంద శాతం పూర్తి ఫలితాలను సాధించే అవకాశముందని వైద్యులు వివరించారు.

ఇలా చేస్తే..

గొంతు నొప్పి ఉండే వారు చలికి దూరంగా ఉండాలి. నీటిని కాచి, చల్లార్చి వడపోసుకుని తాగాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. రోజూ రెండుసార్లు గోరువెచ్చటి నీటిలో కొంచెం ఉప్పువేసి పుకిలించాలి. తద్వారా గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. ఫ్రిజ్ నీళ్లు అసలే తాగవద్దు. వేడి ఆహారమే తీసుకోవాలి. ఈఎన్‌టీకి సంబంధించిన సమస్యలున్న వారు వైద్యులను సంప్రదించి తగిన సలహాలు తీసుకుని పాటించాలి.

కొల్లగొడుతున్నారు..

(5వ పేజీ తరువాయి)

యంత్రాలు, అద్దె వాహనాలతో స్వీపింగ్ జరిగేది. పక్కా ప్రణాళికతో సొంత వాహనాలను స్క్రాప్ చేసిన అధికారులు.. అద్దె యంత్రాల వినియోగానికి మొగ్గు చూపారు. ప్రస్తుతం నగరంలో 37 యంత్రాలతో 2,550 కి.మీ.ల రహదారుల స్వీపింగ్ జరుగుతోంది. ఇందులో కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్ఎంపీ) పనులు చేస్తోన్న ఏజెన్సీలకు చెందినవి 20 యంత్రాలు కాగా.. జీహెచ్ఎంసీ 18 యంత్రాలను అద్దెకు వినియోగిస్తోంది. ఇందుకోసం యేటా రూ.22.50 కోట్లు చెల్లిస్తున్నారు. బాబ్‌కాట్లతో కలిపి ఇప్పటి వరకు అద్దె యంత్రాలకు రూ.200 కోట్ల వరకు ఖర్చు చేశారు. సొంత వాహనాలు కొనుగోలు చేసినా.. నిర్వహణ వ్యయంతో కలిపి ఖర్చు రూ.150 కోట్లు కూడా దాటేది కాదని, అధికారుల కక్కుర్తితో రూ.50 కోట్ల వరకు జీహెచ్ఎంసీకి నష్టం జరిగిందని కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు పేర్కొన్నారు.

ఉత్తుత్తి జీపీఎస్

వివరాలివి..	స్వీపింగ్ యంత్రాలు	కి.మీలు
జీహెచ్ఎంసీ అద్దె	18	1,080
సీఆర్ఎంపీ	19	1,470
మొత్తం	37	2,550

యేటా చెల్లిస్తోన్న మొత్తం రూ.22.50 కోట్లు

చాలా వరకు అద్దె స్వీపింగ్ యంత్రాలు సక్రమంగా పని చేయడం లేదు. నిత్యం 60 కి.మీ.లు తిరగాల్సి ఉన్నా.. అందులో కనీసం 50 శాతం స్వీపింగ్ కూడా జరగడం లేదు. జీపీఎస్ పర్యవేక్షణ ఉందని చెబుతోన్నా.. అవి సక్రమంగా పని చేయడం లేదని పారిశుధ్య విభాగం అధికారులే అంగీకరిస్తారు. గతంలో బుష్‌లు పని చేస్తున్నాయా..? లేదా..? అన్నది గుర్తించేందుకు సెన్సార్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క వాహనానికీ సెన్సార్ అమర్చిన దాఖలాలు లేవు. కేవలం ఒకటి, రెండు బుష్‌లతో స్వీపింగ్ చేస్తున్నారు.

పోలీసుల కస్టడీకి డ్రగ్స్ ముఠా సభ్యులు

(5వ పేజీ తరువాయి)

బాధ్యత సౌరబ్‌దని గుర్తించారు. స్టాన్లీ తనకు సరుకు అవసరమైనప్పుడల్లా గోవా జైల్లో ఉన్న నైజీరియా స్మగ్లర్ ఓక్రాకు వాట్సాప్‌లో ఆర్డర్ పంపేవాడు. దాని ప్రకారం నైజీరియా నుంచి వారి కున్న చీకటి మార్గాల ద్వారా పుణేకు సరుకు రాగా, దానిని సౌరబ్ దిగుమతి చేసుకుని స్టాన్లీకి అందించేవాడు. అయితే సౌరబ్ తన ఐడెంటిటీని స్టాన్లీ ముందు దాచిపెట్టి డోగ్రాగా చెప్పుకునేవాడు.

దివాకర్‌తో నగరానికి లింకులు..

రెంటల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు నడిపే దివాకర్, విశాల్‌లు గోవాలో టూరిస్టులకు డ్రగ్స్ సరఫరా చేసేవారు. ఈ క్రమంలో దివాకర్‌బాబుకు హైదరాబాద్‌కు చెందిన కొంతమందితో మంచి పరిచయాలు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దివాకర్ ద్వారా ఎంతమంది హైదరాబాదీలు డ్రగ్స్ కొనుగోలు చేసేవారు అనేది టీ న్యాబ్ పోలీసులు ఆరా తీస్తున్నారు. స్మగ్లర్స్ సౌరబ్, దివాకర్, విశాల్ కస్టడీ శుక్రవారంతో ముగియనుంది.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు


అనిల్ కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న అంజయ్య

చార్మినార్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గాజుల అంజయ్య అన్నారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఎం. అనిల్ కుమార్‌యాదవ్‌ను బుధవారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. కొన్నేళ్లుగా అనిల్‌కుమార్ యాదవ్ తన తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతంకోసం నిరంతరం పని చేశారన్నారు. అనిల్ కుమార్ యాదవ్ సేవలను గుర్తించి రాజ్యసభకు ఎంపిక చేయడం పట్ల అధిష్ఠానానికి అంజయ్య ధన్యవాదాలుతెలిపారు.

వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలి:జేఏసీ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్ని విధాల హక్కులను కోల్పోయిన వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో చైర్మన్ గోల్కొండ సతీష్, అదనపు సెక్రటరీ పల్లెపాటి నరేశ్‌ల బృందం బుధవారం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో వీఆర్వోలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని. ముఖ్యంగా వీఆర్ఓ వ్యవస్థ లేకపోవడంతో ఇప్పటికే గ్రామాల్లో భూములు అక్రమణలకు గురయ్యాయని అనిల్‌కు వివరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలి


మహంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం కావాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. విజయ సంకల్ప బస్సు యాత్ర ఈనెల 28న భాగ్యనగర్ జిల్లాకు రానున్న సందర్భంగా బీజేపీ నాయకులు లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, నాయకులు నిరంజన్ యాదవ్‌తోపాటు మధుకర్‌రెడ్డి, జె.చంద్రశేఖర్, ధీరజ్‌లాల్, దర్మతేజ, పొన్నవెంకటరమణ, రఘుకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు ఖాయం


రవిచంద్రకు శుభాకాంక్షలు చెబుతున్న సలావుద్దీన్ లోధీ

చార్మినార్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌కు మెజార్టీ సీట్లు వస్తాయని ఆ పార్టీ చార్మినార్ ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నూతనంగా రాజ్యసభకు ఎంపికైన రవిచంద్రను కలిసిన ఆయన, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోధి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూడు నెలల పాలనలో ప్రజలు విసిగిపోయారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలో నిరుత్సాహం చెందవద్దని అన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ తదితరులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ డివిజన్ ఉప్పర్‌పల్లి నుంచి చింతల్‌మెట్‌కు వెళ్లే దారిలో రూ. 14లక్షలతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. బుధవారం కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్, రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ మధుసూదన్ రావుతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి రోడ్డు పనులను పరిశీలించారు. కార్పొరేటర్ సంగీత మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బీట్యారి సిద్దేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏ.రాజు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


చార్మినార్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బార్కస్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తా నుంచి ఎర్రకుంట చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు మజ్లిస్ నాయకుడు హఫీజ్ పటేల్ పరిశీలించారు. బండ్లగూడ చౌరస్తా నుంచి ఎర్ర కుంట చౌరస్తా వరకు మధ్యలో ఉన్న ఇస్మాయిల్ నగర్, అహ్మద్‌నగర్, హుస్సేన్ నగర్, నూరి నగర్, గౌస్‌నగర్, మహ్మద్‌నగర్, ఎస్సీ కాలనీలలో రోడ్లు ఇరుకుగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని ఎంపీ అసదుద్దీన్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయించారని హఫీజ్ పటేల్ తెలిపారు. రోడ్డు విస్తరణకు సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


పురస్కార గ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

వైద్యులను గౌరవించడం అభినందనీయం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైద్యసేవలోని నిష్ణాతుల్ని గుర్తించి గౌరవించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరెపల్లి నంద అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కాన్ఫరెన్స్ హాల్‌లో మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులకు వైద్యరత్న అవార్డులను ప్రదానం చేశారు. సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ సూరెపల్లి నంద అవార్డుగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాణం పోసే దేవుడు కంటే ప్రాణం నిలిపే వైద్యుడు మిన్న అని పేర్కొన్నారు. మదర్‌థెరిస్సా ఫౌండేషన్ పదిహేనేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డీఎల్.పాండు, సూరజ్, డా.ఆశిష్ చౌహాన్, కంజర ఈశ్వర్‌చారి, అంకెనపల్లి మల్లికార్జునరావు, రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తదితరులు అవార్డుగ్రహీతల్ని సత్కరించి అభినందించారు.

గోషామహల్ ఎమ్మెల్యే కనిపించడం లేదు?


మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

గోషామహల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే కనిపించకుండా పోయాడని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం గౌలిగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి, బీజేపీ నుంచి గెలుపొందిన రాజాసింగ్ రెండు నెలల నుంచి పత్తాలేకుండా పోయాడని దుయ్యబట్టాడు. ఆయన ఇంటికి వెళితే రాజాసింగ్ ఔట్ ఆఫ్ స్టేషన్‌లో ఉన్నారని. అక్కడున్న ఆయన అనుచరులు తెలుపుతున్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కనిపించకపోవడంతో గోషామహల్ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజలను పదేళ్లుగా మోసం చేస్తున్న రాజాసింగ్ వెంటనే నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇటీవల బీఆర్ఎస్ నాయకులతో కలిసి తాను ఆరు డివిజన్లలో పర్యటించగా, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నవని, దాదాపు అన్ని డివిజన్లలో 60 శాతం పవర్ బోర్లు, చేతిపంపులు నిరుపయోగంగా మారాయని విమర్శించారు. చెత్తకుప్పలు, గుంతలమయమైన రోడ్లు దర్శనమిచ్చాయన్నారు.

తాగునీటి, డ్రైనేజీ వ్యవస్థల ఆధునికీకరణకు కృషి


రెయిన్ బజార్ డివిజన్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి తాగునీటి, డ్రైనేజీ వ్యవస్థల ఆధునికీకరణకు కృషి చేస్తున్నట్లు ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఎంపీ నిధులు రూ.2.45 కోట్లతో చేపట్టబోతున్న డ్రైనేజీ పైపులైన్ పనులకు బుధవారం ఎంపీ శంకుస్థాపన చేశారు. అనంతరం నియోజక వర్గ పరిధిలోని రెయిన్ బజార్ డివిజన్‌లో జలమండలి అధికారులతో కలిసి ఎంపీ పర్యటించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ మాట్లాడుతూ పాతబస్తీని అన్ని విధాల అభివృద్ధి చేసింది మజ్లిస్ పార్టీనని, త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మీరాజ్, కార్పొరేటర్లు నస్రీన్ సుల్తానా, డాక్టర్ సమీనా, అలందర్ వాజాహి, మాజీ కార్పొరేటర్లు వజహత్ అలీఖాన్, మోసిన్ బాలాల, రహీల్, యాసర్ అర్ఫాత్, మొయిన్, రజా పాల్గొన్నారు.

మాతృభాషలో బోధన సాగితేనే తెలుగు భాష అభివృద్ధి

సాహిత్య అకాడమీలో ఘనంగా మాతృభాషా దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న నామోజు బాలాచారి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషలో బోధన సాగితేనే తెలుగుభాష అభివృద్ధి చెందుతుందని తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం రవీంద్రభారతి ప్రాంగణంలోని అకాడమీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా ఉపాధ్యాయులు, తెలుగు భాష అభిమానులతో మాతృభాష పరివ్యాప్తి అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. మాతృభాషను పరిరక్షించుకోవాలంటే ఆయా మాతృభాషలోనే పాఠ్యాంశాలను పొందపరచాలన్నారు. కార్యక్రమానికి ముంబయి నుంచి విచ్చేసిన పారుపల్లి కోదండ రామయ్య మాట్లాడుతూ తెలుగు భాషా అమలు తెలుపుతూ ప్రజలు ఒక బలమైన ఉద్యమం చేపట్టాలన్నారు. ఆచార్య టి.గౌరీశంకర్ మాతృభాషా దినోత్సవ నేపథ్యాన్ని తెలుగు భాషా ఔనత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, కాలు మల్లయ్య ఆచార్య డా.బాబాల భుజంగరెడ్డి, డా.చంద్రయ్య, ఘంటా మనోహర్‌రెడ్డి, డా.జయప్రకాష్, నంబరాజు రవిప్రకాష్, వెంకటేష్, రామకృష్ణ, చంద్రమౌళి, గడ్డం మోహన్‌రావు, వాహెద్, ఆడెపు లక్ష్మీపతి, దీపిక, డా.చంద్రప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కాలం నుంచి సంస్కృతం మన సంస్కృతికి ప్రతిబింబం


ముదిగంటి గోపాల్‌రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య

అఫ్జల్‌గంజ్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలం నుంచి సంస్కృతం మన సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిందని సంస్కృత అకాడమీ సంచాలకులు ఆచార్య కాశోజ్జుల నీలకంఠం పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ప్రముఖ సంస్కృత పండితుడు, విద్యాలంకార ముదిగంటి గోపాల్ రెడ్డికి పురస్కార ప్రదానం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పూర్వ సంచాలకులు శ్రీపాద సుబ్రహ్మణ్యం, గోపాల్‌రెడ్డి సతీమణి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డిల చేతుల మీదుగా నీలకంఠాన్ని రూ.25 వేల నగదు, జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ... సంస్కృతానికి మనం దేశం పుట్టినిల్లు అయినా, మనకంటే విదేశీయులు ఎక్కువగా సంస్కృతాన్ని అధ్యయనం చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతంలో జన్మించిన ముదిగంటి గోపాల్‌రెడ్డి సంస్కృతి భాష, సాహిత్యాల్లో ప్రపంచ ప్రసిద్ధుడైన పండితుడుగా పేరు పొందారన్నారు. కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ నవీన్‌కుమార్

నెక్నాంపూర్ చెరువును పరిశీలించిన కమిషనర్

నార్సింగ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, 8వ వార్డు కౌన్సిలర్ అలస్యం నవీకుమార్‌తో కలసి నెక్నాంపూర్ చిన్న చెరువును బుధవారం పరిశీలించారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపును సరిగా చేపట్టకపోవడంతో సమస్య అలాగే ఉందని, పరసర ప్రాంతాలలోని హుడా లే అవుట్‌లో ఉన్న స్థలాలను కొంతమంది కబ్జాదారులు ఆక్రమించుకున్నారని కౌన్సిలర్ నవీన్.. కమిషనర్‌కు వివరించారు. మూడేళ్ల క్రితం మంజూరైన రోడ్డు పనులను కూడా అధికారులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అనంతరం కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డివిజన్ అధికారిణి దివ్య జ్యోతి, అసిస్టెంట్ అధికారిణి మౌనిక, శానిటేషన్ ఇంజనీర్ సంపత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


స్మారకోపన్యాసంలో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు

సాహిత్య ఉద్యమ రైతు వట్టికోట

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని నడిపించి, ప్రజలను తన అక్షరానికి పదును పెట్టడం ద్వారా చైతన్యపరిచిన గ్రంథాలయోద్యమ నాయకుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ ప్రజాసాహిత్యకులు, రచయిత, ఉద్యమకర్త వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని డా.బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. 'వట్టికోట ఆళ్వార్ స్వామి- గ్రంథాలయోద్యమం' అనే అంశంపై మాట్లాడుతూ తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరు విత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమరైతు వట్టికోట అని అన్నారు. తెలంగాణ భాషకు యాసకు పెద్ద పీటవేసిన సాహిత్య మేరు నగధీరుడని ఆయన కొనియాడారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె.సీతారామారావు మాట్లాడుతూ తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట అన్నారు. తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాట తత్వాన్ని, సంస్కృతిని నరనరాన జీర్ణించుకుని గ్రంథ పఠనం ద్వారా లోకజ్ఞానం కలుగుతుందని సమాజాన్ని అర్థం చేసుకొని చైతన్య పరచవచ్చని ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించి ప్రజా చైతన్యానికి బాటలువేసిన ప్రముఖ సాహిత్య దిగ్గజం వట్టికోట అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్ రెడ్డి, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విశ్వవిద్యాలయ లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజని, పలు విభాగాల అధిపతులు, డీన్స్, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజారోహణం

- సమతామూర్తి కేంద్రంలో రెండో రోజు బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం లో సమతా కుంభ్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ధ్వజారోహణం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీత్రిదండి రామానుజ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో కనుల పండువగా సాగింది. బుధవారం ఉదయం అష్టాక్షరి మంత్ర జపంతో ప్రారంభమయ్యాయి. యాగశాలలో వేదపండితులో మంత్రోచ్ఛరణలతో సేవాకాలం, శాత్తుముఱై, అగ్నిప్రతిష్ఠ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివ్య సాకేతంలోని శ్రీరామచంద్రుడికి అర్చకులు సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. చిన జీయర్ స్వామి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని, మానవ సేవే మాధవ సేవ అని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని సూచించారు.

రవాణాశాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- నాలుగు వాహనాలు బుగ్గి


ప్రమాదంలో కాలిపోయిన వాహనాలు

హైదరాబాద్ సిటీ/మదీన, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని బండ్లగూడలో ఉన్న సౌత్‌జోన్ రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన నాలుగు వాహనాలకు దుండగులు నిప్పు పెట్టి అంటించారు. బుధవారం తెల్లవారుజామున కార్యాలయం పార్కింగ్‌లో ఉన్న వాహనాల నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు సమాచారం అందించడంతో జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బృందం చేరుకుని మంటలను ఆర్పివేశారు. వివిధ కారణాలతో రవాణాశాఖాధికారులు సీజ్ చేసిన మూడు సెవన్ సీటర్ ఆటోలు, ఓ గూడ్స్ వాహనం మంటల్లో కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. అయితే అగ్నిప్రమాదానికి కారణాలేంటనే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలిసిన వారే ఈ పని చేసి ఉంటారని... సీసీ కెమెరాలతో నిందితులను గుర్తించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే బండ్లగూడ రవాణాశాఖాధికారి సదానందం కార్యాలయానికి చేరుకుని కారణాలపై ఆరా తీశారు. సౌత్‌జోన్ కార్యాలయానికి చేరుకున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ అగ్నిప్రమాద ఘటనపై అధికారులతో సమీక్షించారు.

వెక్కిళ్లతో పూజారి మృతి

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వెక్కిళ్లు ఓ పూజారి నిండు ప్రాణాల్ని బలికొన్నాయి. ఈ ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సునీల్‌కుమార్(33) జుంగూర్ బస్తీలో సోదరి కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. తన బావతో కలిసి పూజారిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19న వెక్కిళ్లు రాగా, ఎంతకీ ఆగకపోవటంతో మంచినీళ్లు తాగాడు. కాసేపటికే అతడు స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడినుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సునీల్‌కుమార్‌కు సిగరెట్ తాగే అలవాటు ఉందని అందువల్లే వెక్కిళ్లు వచ్చి గుండెపై ఒత్తిడి పెరిగి హార్ట్ ఎటాక్ దారితీసిందని వైద్యులు గుర్తించారు. చికిత్స అందిస్తుండగా ఈనెల 20న మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పేర్కొన్నారు. మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ టీటీలో హితేష్‌కు 3 పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ డి.హితేష్ మూడు పతకాలు కొల్లగొట్టాడు. ఇండోర్‌లో మూడ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో సింగిల్స్‌లో హితేష్ 3-1తో విశ్వ (మహారాష్ట్ర)పై నెగ్గగా, డబుల్స్ హితేష్-కునాల్ జోడీ 3-2తో ప్రసాద్-రవీంద్ర (హరియాణా) ద్వయంపై, మిక్స్‌డ్ డబుల్స్‌లో హితేష్-బేబీ సహనా జోడీ 3-1తో విశ్వనతానియా (ఢిల్లీ) ద్వయంపై గెలిపొందింది.

రేపు హైదరాబాద్ అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ మీట్ ట్రయల్స్‌ను శుక్రవారం నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు రాజేష్ కుమార్ ప్రకటించారు. బాలబాలికలు, పురుషులు, మహిళలకు విడివిడిగా ఉదయం 6 గంటల నుంచి ట్రయల్స్‌ను జరపనున్నట్లు వెల్లడించారు. అండర్-14, 16, 18, 20 విభాగాలోకల ట్రయల్స్‌ను నిర్వహించనున్నామని రాజేష్ చెప్పారు.

ఒకరితో ఒకలా.. మరొకరితో ఇంకోలా..!

- రిజిస్ట్రేషన్ల శాఖలో ఉన్నతాధికారుల వివక్ష

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, అధికారులపై ఐజీ స్థాయి ఉన్నతాధికారులు వివక్ష కనబరుస్తున్నారంటూ ఉద్యోగ సంఘాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వివిధ స్థాయిల్లో ఉద్యోగులు, అధికారుల నియామక ఉత్తర్వులను అమలు చేయడంలో వివక్ష కనబరచడమే కాకుండా, ఆయా ఉత్తర్వులను సదరు వ్యక్తులకు అందించడంలోనూ కమిషనర్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా డీఐజీ నియామకంలో అధికారుల వింతవైఖరి గురించి 'ఆరు నెలలు తిరక్కుండానే అదే ఆర్డర్' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రిజిస్ట్రేషన్ వర్గాల్లో తీవ్రంగా చర్చ జరిగింది. ఆయా నియామకాలపై హైకోర్టులో రిట్ పిటీషన్ ముగియకుండానే ప్రభుత్వం ఈ నెల 10న (గతేడాది ఇచ్చిన ఉత్తర్వుల మాదిరిగానే) జీఓలు జారీచేయడాన్ని ఉద్యోగ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డికి గంటల వ్యవధిలో ఆర్డర్స్ కమ్యూనికేట్ చేసిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయం అధికారులు.. పది రోజులు దాటినా కరీంనగర్ డీఐజీగా నియమితులైన రవీందర్‌కు ఉత్తర్వులను ఎందుకు కమ్యూనికేట్ చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు, అధికారులందరికీ పెద్దదిక్కుగా ఉండాల్సిన ఐజీ స్థాయి ఉన్నతాధికారి, కొందరిపై ప్రేమ, మరికొందరిపై వివక్షను చూపడం సమంజసంగా లేదని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XI1Hw1H లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: https://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

రాజేంద్రనగర్‌కు నూతన అధికారులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం అధికారుల బదిలీలను చేపట్టింది. దాంతో రాజేంద్రనగర్‌కు నూతన అధికారులు వచ్చారు. రాజేంద్రనగర్‌లో ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న ఈ. మల్లయ్యను గోదావరిఖనికి, రాజేంద్రనగర్ తహసీల్దార్ వేణుగోపాల్‌ను నరూర్‌నగర్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో రంగారెడ్డి జిల్లా యూఎల్‌సీ విభాగంలో పనిచేస్తున్న వెంకటరెడ్డిని రాజేంద్రనగర్ ఆర్డీవోగా, సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన విభాగంలో విధులు నిర్వహిస్తున్న రాములును రాజేంద్రనగర్ తహసీల్దార్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా, వారు బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్ర నగర్ ఏసీపీగా లక్ష్మీనారాయణ, డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా అబ్దుల్ ఖాదర్ బాధ్యతలు స్వీకరించారు.


ఆర్డీవో, తహసీల్దార్‌లను సన్మానిస్తున్న నాయకులు

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డి కోరారు. ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. అధికారులు వారికి ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో కొప్పుల వెంకటరెడ్డిని, తహసీల్దార్ రాములును బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

చార్మినార్ ఏసీపీగా సుదర్శన్


బాధ్యతలు స్వీకరిస్తున్న సుదర్శన్

చార్మినార్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ ఇంటిలిజెన్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిటీ సెక్యూరిటీ వింగ్‌లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ చార్మినార్‌కు బదిలీ కాగా, బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాత బస్తీలో శాంతి భద్రతలు పరిరక్షణ కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

హైదరాబాద్ ఆర్డీవోగా వెంకట్‌రెడ్డి


ఆర్డీవోను సత్కరిస్తున్న బద్దం సతీష్‌గౌడ్ తదితరులు

అఫ్జల్‌గంజ్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఆర్డీవోగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు బద్దం సతీష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, నాగభూషణం, శ్యామ్, రాజేశ్, రాధాకృష్ణల బృందం బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆర్డీఓకు వివరించారు. వెంటనే వాటి పరిష్కారం కోసం దశలవారీగా కృషిచేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


పూజలు చేస్తున్న విఠల్ బాబా తదితరులు

వైభవంగా పెద్దమ్మతల్లికి మారుబోనం

పహాడీషరీఫ్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ తల్లికి మారుబోనం వైభవంగా కొనసాగింది. ఆలయ ధర్మకర్త విఠల్‌బాబా పర్యవేక్షణలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించారు. కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మాజీ ఎంపీటీసీ దూడల శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


అన్నప్రసాద వితరణలో ప్రేమ్‌దాస్‌జీ మహారాజ్ గద్దీ నర్సింగ్, మహంత్ కల్యాణ్‌దాస్ మహరాజ్

అయోధ్యలో రోజూ 30 వేల మంది రామభక్తులకు అన్న ప్రసాద వితరణ

అఫ్జల్‌గంజ్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని హనుమాన్‌ఘడ్ వద్ద భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఉస్మాన్‌గంజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ ప్రేమ్‌దాస్‌జీ మహారాజ్ గద్దీ నర్సింగ్, మహంత్ కల్యాణ్‌దాస్ మహరాజ్‌లు హాజరై అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు క్యాథం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేశ్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం నుంచి అయోధ్యకు ప్రత్యేక వాహనంలో నిత్యావసర వస్తువులను తీసుకొచ్చి రోజూ 30 వేల మంది రామ భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 2వ తేదీ వరకు అన్నప్రసాద కార్యక్రమం కొనసాగుతుందని వారన్నారు.

‘ఆసరా’లో అక్రమాలు

- కాగ్ నివేదికలో వెల్లడి
- నగర శివార్లలో భారీగా అవకతవకలు
- విలాసవంతమైన కార్లు ఉన్న వారికీ పింఛన్లు
- చనిపోయిన వారి ఖాతాల్లో కొన్నినెలలపాటు జమ



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఆసరా పింఛన్లలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) ఇచ్చిన నివేదికలో ప్రభుత్వ పథకాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయటపడ్డాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో ఆసరా పింఛన్ల పంపిణీలో భారీగా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయింది. పింఛన్ల పంపిణీపై రాష్ట్రంలో పలు మండలాల్లో 2018 నుంచి 2021 వరకు ఆడిట్ తనిఖీలు నిర్వహించగా.. అక్రమాలు బయటపడ్డాయి. రంగారెడ్డిజిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్లు మండలాల్లో కొన్ని ప్రాంతాలను తనిఖీ చేయగా అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.

కుటుంబ సర్వే వివరాలతో పింఛన్ల డేటాను సరిచూడగా సుమారు 16 శాతం కుటుంబాలకు అర్హత లేకున్నా పింఛన్లు ఇస్తున్నట్లు వెల్లడైంది. చనిపోయిన వారికి ఏడాదికిపైగా పింఛన్లు ఇచ్చినట్లు బయటపడ్డాయి. రైతుబంధు డేటాను ఆసరా డేటాతో పరిశీలించగా.. ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిమితికి మించి భారీగా భూములు ఉన్న వారికి కూడా పింఛన్లు ఇచ్చారు. అనేకచోట్ల భారీగా ఆస్తులతోపాటు ఏడాదిలో రూ. 10 లక్షలకుపైగా బ్యాంకు లావాదేవీలు నిర్వహించిన వారికి కూడా పింఛన్లు పొందుతున్నట్లు తేలింది.

రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా జరిగిన భూముల క్రయవిక్రయాలు పరిశీలించగా.. రూ.10 లక్షలకు మించి ఆస్తుల క్రయవిక్రయాలు చేసిన వారికి కూడా పింఛన్లు ఇస్తున్న విషయం బయటపడింది. విలాసవంతమైన వాహనాలు ఉన్న వారు కూడా ఆసరా పింఛన్లు పొందుతున్నారు.

సరూర్‌నగర్‌లో ఆడిట్ రికార్డుల ప్రకారం.. చనిపోయిన 102 మంది ఖాతాల్లో రూ. 16.75 లక్షలు కొన్ని నెలలపాటు జమచేసినట్లు తేలింది. అబ్దుల్లాపూర్‌మెట్‌లో చనిపోయిన 14 మందికి రూ. 4.08 లక్షలు పింఛన్ కింద వారి ఖాతాల్లో జమచేశారు. కొందరు లబ్ధిదారులు చనిపోయిన తరువాత 39 నెలలపాటు పింఛన్ ఇవ్వడం గమనార్హం. ఈ విషయం బయటపడిన తరువాత కూడా రికవరీ చేసేందుకు ప్రయత్నించలేదు. ఇలాంటి విషయాలను పరిశీలించి రికవరీ చేయడానికి యంత్రాంగం లేదని అధికారులు కాగ్‌కు వివరణ ఇవ్వడం మరింత ఆశ్చర్యానికి గురిచేసే విషయం. సాధారణంగా లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకొని పింఛన్ ఇస్తుంటారు.

ఏదైనా కారణంచేత వేలిముద్రలు స్కాన్ కాకపోతే స్థానిక పంచాయతీ కార్యదర్శి లేదా బిల్ కలెక్టర్ బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తుంటారు. కానీ, కొందరు లబ్ధిదారుల విషయంలో ఏడు నెలల నుంచి 30 నెలల పాటు వేలి ముద్రలు విఫలమైనట్లు చూపించి పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రల ద్వారా భారీగా పింఛను డబ్బులు డ్రాచేసినట్లు తెలిసింది.

సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ఇలా తమ ధ్రువీకరణ ద్వారా చేసిన చెల్లింపులకు సంబంధించి రుజువుగా అక్విటెన్స్ రిజిస్టర్ రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలి. కానీ ఈ రిజిస్టర్‌లో వివరాలు నమోదు ఎక్కడా సరిగా నిర్వహించలేదు. ఇందువల్ల వీటి వెనుక అవతవకలు జరిగినట్లు అనుమానిస్తూ విచారణ చేయాలని సూచించారు. అనర్హులకు నిబంధనలకు విరుద్ధంగా చేసిన చెల్లింపులను రాబట్టాలని పేర్కొంది. కొత్త లబ్ధిదారుల ఎంపికలో కూడా సరైన విధానాలు అవలంబించలేదని కాగ్ ఆక్షేపించింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పక్రియలో లోపాలు ఉన్నట్లు తెలిపింది.

తెలంగాణ సమస్యలు, పునర్నిర్మాణం, అభివృద్ధిపై
26 నుంచి ఓయూలో జాతీయ సదస్సు

తార్నాక, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమస్యలు, పునర్నిర్మాణం, అభివృద్ధిపై ఓయూలో ఈనెల 26 నుంచి 28 వరకు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్, సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ చింత గణేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ఓయూ వీసీ డా. రవీందర్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని గణేష్ పేర్కొన్నారు. నిరుద్యోగం, విద్య, వైద్యం, కళలు, సాహిత్యం, జీవన విధానం, సామాజిక, సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక, సామాజిక, రాజకీయ సవాళ్లు, కర్తవ్యం వంటి అంశాలపై చర్చించి పరిష్కారానికి మార్గాలు కనుగొనే విధానాల రూపకల్పన జరుగుతుందన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వ్యాప్తంగా 361 కేంద్రాల్లో..
- మార్చి18 నుంచి ఏప్రిల్ 2 వరకు
- అధికారుల సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పరీక్షలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 361 కేంద్రాల్లో 76,575 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను, కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలు పకడ్బందీగా తీసుకెళ్లేందుకు పోస్టల్‌శాఖ సహకరించాలని, విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష సమయం కన్నా ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.నర్సింగ్‌రావు, బి.నరసింహ, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళలు పోలీస్ ఉద్యోగంలోకి రావడం గర్వకారణం

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి : సీపీ కొత్తకోట


శిక్షణ కానిస్టేబుళ్లను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు పోలీస్ ఉద్యోగాల్లోకి రావడం గర్వకారణమని, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లన్న ధైర్యంగా ఎదుర్కోవాలని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సైబరాబాద్, రాచకొండ, నిజామాబాద్, సిద్దిపేటకు చెందిన 268 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లు (ఎస్‌సీటీపీసీ) ఏఆర్ మహిళలతో పాటు 17 మంది డ్రైవర్స్, మెకానిక్‌లుగా ఎంపికైన కానిస్టేబుళ్లకు పేట్లబురుజు సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు మనమందరం శాయశక్తులా కృషి చేసి వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. శారీరక ధృడత్వం కోసం వ్యాయామాలు చేయడం, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం అన్నిటికంటే ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్ జాయింట్ సీపీ సత్యనారాయణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు పేరు తీసుకురావాలి

సివిల్ ఎస్‌సీటీపీసీ(స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్)లు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం సివిల్ ఎస్‌సీటీపీసీల బేసిక్ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సిద్దిపేట, మెదక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 196 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు బుధవారం సైబరాబాద్‌లోని కమాండ్ ట్రైనింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేశారు. సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవిస్ మాట్లాడుతూ.. ఈ 9 నెలల ట్రైనింగ్ పైనే సర్వీస్ మొత్తం ఆధారపడి ఉంటుందన్నారు. సోషల్ మీడియా పట్ల జాగ్రత వహించాలన్నారు.

దాచేస్తే దండన తప్పదు

- అటానమస్ కాలేజీల యాజమాన్యాలకు జేఎన్‌టీయూ వీసీ హెచ్చరిక
- నిబంధనల మేరకు కళాశాలల్లో వసతులు ఉండాల్సిందేనని ఆదేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాలల్లో ఈ నెల 27 నుంచి తనిఖీలు ఉంటాయని, దరఖాస్తులో పేర్కొన్న వసతులను చూపకుండా దాచేస్తే దండన తప్పదని జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించారు. అటానమస్ కళాశాలల యాజమాన్యాలతో బుధవారం జేఎన్‌టీయూలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలకు వచ్చే ప్రొఫెసర్లకు డబ్బులు ఇవ్వొద్దన్నారు.

సమయం ఇవ్వకుండా.. వసతులు కల్పించేదెలా !

ఇటీవల కొత్తగా మంజూరు చేసిన కోర్సులకు సంబంధించి లేబొరేటరీలను ఏర్పాటు చేసుకునేందుకు సమయం ఇవ్వకుండా తనిఖీలు నిర్వహించడం సమంజసంగా లేదని పలు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు అభ్యంతరాలను లేవనెత్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో కొత్త ల్యాబ్‌ల ఏర్పాటుకు కనీసం రెండు నెలల సమయం పడుతుందన్నారు. ఏప్రిల్‌లో జరగాల్సిన ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను ఫిబ్రవరిలో నిర్వహించడం తమను ఇబ్బందుల పాలు చేయడమేనని వాపోయారు. యూనివర్సిటీకి వచ్చి వీసీ లేదా రిజిస్ట్రార్‌ను కలవాలంటే అవకాశం ఇవ్వడం లేదన్నారు. వీసీ స్పందిస్తూ.. ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ తారాకళ్యాణి, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 వేలు తిరిగివ్వలేదని
స్నేహితుడిని కత్తితో పొడిచారు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై హత్యాయత్నం చేశారు స్నేహితులు. అప్పు తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదని కత్తితో విచక్షణారహితంగా పొడిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టప్పాచబుత్ర కుమ్మర్‌వాడి ప్రాంతానికి చెందిన నిఖిల్(22) రహీంపుర ప్రాంతానికి చెందిన లడ్డూ, ఆకాష్, దీప్‌సింగ్ స్నేహితులు. నిఖిల్ లడ్డూ వద్ద రూ. 80 వేలు అప్పు తీసుకున్నాడు. ఇటీవల రూ. 60 వేలు తిరిగి చెల్లించాడు. రూ. 20 వేల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాట్లాడాలని ఈనెల 20న గంగాబౌలిలో అల్లాబండ రిజర్వాయర్ వద్దకు నిఖిల్‌ను పిలిపించారు. డబ్బుల విషయమై లడ్డూ, నిఖిల్ మధ్య మాటామాటా పెరగడంతో కోప్రోదిక్తుడైన లడ్డూ తనతో తెచ్చుకున్న కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన నిఖిల్ స్పృహతప్పి పడిపోయాడు. చనిపోయాడనుకుని అక్కడి నుంచి ముగ్గురూ పారిపోయారు. స్పృహలోకి వచ్చిన నిఖిల్ స్నేహితుడు పరమేష్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అతడు స్నేహితులతో అల్లాబండ చేరుకొని నిఖిల్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మంగళ్‌హాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిఖిల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.


అందెశ్రీకి స్వర్ణ కంకణం తొడుగుతున్న విద్యాసాగర్‌రావు

తెలంగాణ ఎవరి జాగీరూ కాదు : అందెశ్రీ

- తెలుగు భాష గొప్పది : విద్యాసాగర్‌రావు

బేగంపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎవరి జాగీరూ కాదని ప్రముఖ కవి అందెశ్రీ అన్నారు. బుధవారం బేగంపేట ప్లాజా హోటల్‌లో అక్షరయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా అందెశ్రీని స్వర్ణ కంకణంతో సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. మాతృభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫిబ్రవరి 21న ప్రపంచమంతా మాతృభాషా సంబరాలు జరుపుకోవాలన్నారు. తెలుగు భాష గొప్పదన్నారు. విద్య, వైద్యం కోసం ప్రభుత్వాలు అధిక నిధులు ఖర్చు చేయాలని సూచించారు. తెలుగులో చక్కటి రచనలు చేసి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి మంచి పేరు తీసుకురావాలని, ఈ కార్యక్రమాలను అక్షరయాన్ చేపట్టాలన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ.. తన భాష తప్ప మరో భాష రాదన్నారు. తెలంగాణ అంటే పోరాటాల గడ్డ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ దంపతులను, తెలుగు భాషకు సేవ చేసిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జొన్నల గడ్డ స్నేహజ, అక్షరయాన్ వ్యవస్థాపకురాలు అయినంపూడి శ్రీలక్ష్మి, వంశీరామరాజు, రచయిత సరోజ తదితరులు పాల్గొన్నారు.

బాంబు పేలుళ్ల మృతులకు నివాళి



దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన జంట పేలుళ్లకు బుధవారానికి 11 ఏళ్లు పూర్తయింది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గంగం నవీన్‌కుమార్, స్థానిక నాయకులు బీబినేపల్లి వెంకటేశ్వర్‌రావు, శ్రీశైలంయాదవ్, రమేష్ ముదిరాజ్, బేర బాలకిషన్, యాదవ శంకర్ తదితరులు నివాళులర్పించారు. గోకుల్‌చాట్ పేలుళ్లలో ఎడమ కంటి చూపు కోల్పోయిన సైదాబాద్ నివాసి రహీం దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల మృతులకు నివాళులర్పించారు. మానని గాయాలకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు సహాయం అందలేదన్నారు.
- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 22 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



సన్నిహితుల సమక్షంలో రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల విత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.

పద్నాలుగు రోజుల ప్రేమకథ



కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రం '14 డేస్ లవ్'. నాగరాజు బోడెం దర్శకత్వంలో హరిబాబు దాసరి నిర్మించారు. మనోజ్ పుట్టూర్, చాందిని భాగవని హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'తమ కుటుంబాన్ని కాపాడుకునే ప్రయత్నంలో వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుందని చెప్పారు. కుటుంబ విలువలు, సంప్రదాయాలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో చేశామని దర్శకుడు తెలిపారు. సంగీతం: కిరణ్ వెన్న, సినిమాటోగ్రఫీ: కన్నన్ మునస్వామి

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల ప్రదానం



భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారూఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారూఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

అభినవ్ హీరోగానూ సక్సెస్ కావాలి



అభినవ్ గోమఠం హీరోగా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో వరుణ్‌తేజ్ ముఖ్య అతిథిగా హాజరై బిగ్ టికెట్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'విభిన్న పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అభినవ్ తొలిసారిగా హీరోగా నటిస్తున్నాడు. చిత్రంలో అన్ని భావోద్వేగాలు ఉన్నాయని తెలిసింది. కంటెంట్‌ను నమ్మి తీసిన సినిమాలా అనిపించింది. ఈ చిత్రం విజయం సాధించాలి' అని అన్నారు. 'నా కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. ఈ సినిమాలో నటించడం లక్కీగా ఫీలవుతున్నాను. నా సినిమా కంటెంట్ నచ్చితే ప్రోత్సహించండి.' అన్నారు అభినవ్. దర్శకుడు తిరుపతిరావు మాట్లాడుతూ 'దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చిన అభినవ్‌కు, నిర్మాతలకు రుణపడి ఉంటాను. అందరి సహకారంతో చిత్రాన్ని పూర్తి చేశాను. తప్పకుండా నచ్చుతుందని అనుకుంటున్నాను' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన భవాని కాసుల మాట్లాడుతూ 'సినిమాలోని ప్రతి పాత్ర అందరికీ రిలేటెడ్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. సినిమా విజయం మీద నమ్మకం ఉంది' అన్నారు. వైశాలి రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ వి నిర్మించారు.

'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!



'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్', 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.

బడ్జెట్ పెరిగినా వెనక్కు తగ్గలేదు

- నిర్మాతలు స్నేహాల్, శశిధర్, కార్తీక్


శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించారు.



● గతంలో 'పేప్ మహల్', 'సీతో' చిత్రాలు నిర్మించాం. 'భూతద్దం భాస్కర్ నారాయణ' స్క్రిప్ట్ అద్భుతంగా అనిపించడంతో బడ్జెట్ పెరిగినా ఎక్కడా రాజీపడకుండా మంచి క్వాలిటీతో నిర్మించాం. ఇదొక డిటెక్టివ్ థ్రిల్లర్. టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. ఓవర్సీస్, ఓటీటీ బిజినెస్ క్లోజ్ చేశాం.

● ఇందులో కథే హీరో. ఇప్పటి వరకూ ఇలాంటి కథను ప్రేక్షకులు చూసి ఉండరు. ప్రతి ఇంటి ముందూ ఉండే దిష్టిబొమ్మ వెనుక ఉన్న కథేమిటి అనే అంశానికి ఫాంటసీ ఎలిమెంట్‌ను జోడించి ఆసక్తికరంగా తెరకెక్కించారు. పురుషోత్తం రాజ్ విజన్ ఉన్న దర్శకుడు. చాలా కొత్తగా తీశారు. పురాణాలతో ముడిపెట్టి కథను నడిపే తీరు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. డిటెక్టివ్‌గా శివ కందుకూరి పాత్రలో ఒదిగిపోయారు. హీరోయిన్ రాశీ సింగ్ కూడా ప్రతిభగల నటి. శ్రీ చరణ్ బీజీఎం సినిమాను ఓ స్థాయిలో నిలబెడుతుంది. ఏఐ టెక్నాలజీ వాడి రూపొందించిన శివ ట్రాన్స్ సాంగ్‌కు చక్కటి స్పందన రావడం ఆనందాన్నిచ్చింది.











గద్దెపైకి సారలమ్మ







(మొదటి పేజీ తరువాయి)

మేడారం మహా జాతర

ఐదు కి.మీ నడుచుకుంటూ మేడారానికి...



పోరాట స్ఫూర్తికి నిదర్శనం సమ్మక్క సారలమ్మ: ప్రధాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) . సమ్మక్క సారలమ్మ పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం మేడారం మహా జాతర అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీల అతిపెద్ద పండుగల్లో ఒకటైన మేడారం జాతర బుధవారం ప్రారంభమైన సందర్భంగా ట్విటర్ (ఎక్స్) వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనులు జరుపుకొనే అతిపెద్ద పండుగల్లో ఒకటైన ఈ మహా జాతర మన సాంస్కృతిక వారసత్వానికి స్ఫూర్తి అని అభివర్ణించారు. చైతన్య శక్తికి అద్దం పట్టే మహా వేడుక అని.. భక్తి, సంప్రదాయం, సామూహిక భావనల మహా సమ్మేళనం అని పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మలకు ప్రణమిల్లి.. వారి ఐక్యత, పోరాట స్ఫూర్తిని స్మరించుకుందామని పిలుపునిచ్చారు.

మేడారానికి తొలిసారి రాష్ట్రపతి రాక

మేడారం జాతరకు ప్రముఖులు రానున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మేడారానికి వచ్చి వనదేవతలను దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకొని, అక్కడి నుంచి సైనిక హెలికాప్టర్‌లో మేడారానికి వస్తారు. మేడారానికి ఓ రాష్ట్రపతి రానుండడం మహాజాతర చరిత్రలో ఇదే తొలిసారి. ఫలితంగా జాతర ప్రాశస్త్యం మరింత విస్తృతమవుతుందని భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా శుక్రవారమే మేడారానికి రానున్నారు. గద్దెల వద్ద తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి, ప్రత్యేక ... మేడారం జాతరకు విచ్చేసిన గవర్నర్ తమిళిసై ఈసారి కూడా వచ్చి వనదేవతలను దర్శించుకోనున్నారు. తల్లులను దర్శించుకునేందుకు గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మేడారానికి రానున్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అందుతున్న సౌకర్యాలపై కిషన్ రెడ్డి సమీక్ష చేస్తారు. కాగా మేడారాన్ని జాతీయ పండుగగా ప్రకటించాలన్న డిమాండ్ చాన్నాళ్లుగా ఉంది. అయితే మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించే విషయం ఆలోచిస్తామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం ఈ విషయంలో కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేయొచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడ బెల్లమే బంగారం!

సమ్మక్కసారలమ్మలకు నైవేద్యంగా బెల్లం.. టన్నులకొద్దీ బెల్లం ఉన్నా వాటిని తగలు!



ఎలాంటి ఆంక్షలు, హద్దులు లేని మాతృప్రేమకు నిలువెత్తు రూపం ముకుంద మాల. తన కడుపున పుట్టిన బిడ్డ యుక్త వయసుకొచ్చాక మొదట తాను 'గే' అని చెబితే, ఫర్లేదు 'నువ్వు నా బిడ్డవు' అని కొండంత అండగా మారారు. కొన్నాళ్లకు 'అబ్బాయిని కాదు, అమ్మాయిని' అనగానే... 'నాకు పుట్టింది అమ్మాయే అనుకొంటా' అంటూ బిడ్డలో జీవిత కాలానికి సరిపడా ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఇప్పుడు తన కూతురులాంటి వారందరి హక్కుల కోసం గళం విప్పారు. ఎల్జీబీటీక్యూ వ్యక్తుల హక్కుల ఉద్యమంతో మమేకమై... కన్నవారు తిరస్కరించిన కమ్యూనిటీకి పెద్దమ్మగా మారిన ముకుంద మాల 'నవ్య'తో 'క్వీర్ బంధు' ప్రస్థానం గురించి పంచుకున్నారిలా.

నేనొక ట్రాన్స్‌కు తల్లిని

ఆంధ్రజ్యోతి నవ్య

కుటుంబ కదంబం

features@andhrajyothy.com



మరో కోణం

అమ్మాయికి పెళ్లి...



మొదటిసారి ప్రైడ్ మార్చ్‌లో...

అమెరికాలో ట్రాన్స్ అమ్మాయిగా...

ఇంటిపేరు చెడగొడుతున్నావన్నారు...

కమ్యూనిటీతో కలిసి...

అమ్మ ప్రేమలో షరతులా..!

• సాంత్వన్

టాప్-20లో జైస్వాల్

» ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: ఇంగ్లండ్‌లో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో డబుల్ సెంచరీలతో పరుగుల వరద పారించిన భారత యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ ర్యాంకుల్లో దూసుకెళ్లాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో యశస్వీ ఏకంగా 14 స్థానాలు మెరుగుపరచుకొని 15వ స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరంగా ఉన్న విరాట్ కోహ్లీ 7వ ర్యాంక్‌తో టాప్-10లో ఉన్న భారత బ్యాటర్‌గా నిలిచాడు. రోహిత్ శర్మ ఓ స్థానం ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలవగా, జడేజా 34వ స్థానానికి చేరుకున్నాడు. కేన్ విలియమ్సన్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బౌలర్ల జాబితాలో బుమ్రా నెంబర్‌వన్‌గా, అశ్విన్ రెండో ర్యాంక్‌లో ఉన్నారు.

యూఏఈ క్రికెట్ చీఫ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్



దుబాయ్: టీమిండియా మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పురుషుల క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. 62 ఏళ్ల లాల్‌చంద్ 2016లో ఆఫ్ఘానిస్థాన్, 2018లో జింబాబ్వే జట్లకు చీఫ్ కోచ్‌గా పనిచేశాడు.

లంకపై అఫ్ఘాన్ గెలుపు

దంబుల్లా: శ్రీలంక టూర్‌లో ఆఫ్ఘానిస్థాన్ ఎట్టకేలకు గెలుపు నమోదు చేసింది. మూడు టీ20ల సిరీస్‌లో బుధవారం ఉత్కంఠగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో అఫ్ఘాన్ 3 పరుగులతో లంకను ఓడించింది. తొలుత ఆఫ్ఘానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 209 పరుగులు చేసింది. రహ్మనుల్లా గుర్బాజ్ (70), హజ్రతుల్లా జజాయ్ (45) ధాటిగా ఆడారు. ఛేదనలో లంక ఓవర్లన్నీ ఆడి 206/6 స్కోరు మాత్రమే చేసింది. కమిందు మెండిస్ (65 నాటౌట్), నిస్సంక (60 రిటైర్డ్ హర్ట్) పోరాడినా ఫలితం లేకపోయింది.

టర్నింగ్ పిచ్‌పై ఇద్దరికీ అవకాశాలు



స్పిన్ ఫ్రెండ్లీ వికెట్ అయితే ఇరుజట్లకూ సమానావకాశాలుంటాయి. తొలి బంతి నుంచి బాల్ టర్న్ అయితే.. టాస్ ప్రభావం ఉండదు. ఫ్లాట్ వికెట్ అయితే క్రమంగా మారుతుంది. ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడానికి స్వీప్, సృజనాత్మక షాట్లు ఆడతాం. పిచ్ తీరును బట్టి భారత్ నాలుగో స్పిన్నర్‌తో ఆడే చాన్సుంది.

– ఇంగ్లండ్ బ్యాటర్ ఒల్లీ పోప్

ఖేలో స్విమ్మింగ్‌లో సాయికి రెండో స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో హైదరాబాద్ స్విమ్మర్ సాయినిహార్ రెండో స్వర్ణాన్ని సాధించాడు. మొత్తంగా మూడో పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. గువాహటిలో బుధవారం జరిగిన పురుషుల 400 మీటర్ల మెడ్లేలో సాయి.. 4 నిమిషాల 45 సెకన్లలో రేసు ముగించి విజేతగా నిలిచాడు. ఈ పోటీల్లో సాయి.. గుంటూరు కేఎల్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇదే టోర్నీ షూటింగ్‌లో ఏపీకి చెందిన మద్దినేని ఉమా మహేష్ రజత పతకం దక్కించుకున్నాడు.

ఆటకు ముందు వేడుక

రేపటి నుంచే మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: మహిళల ఐపీఎల్ అయిన ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి జరిగే ఈ లీగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం ఐదు జట్లు పోటీపడే ఈ లీగ్ ట్రోఫీని బుధవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఐదు జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. వచ్చేనెల 17న ఫైనల్ పోరు జరగనుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో నిరుడు రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. గుజరాత్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్ లీగ్ బరిలో ఉన్న మిగతా జట్లు. వచ్చేనెల 4 వరకు జరిగే మ్యాచ్‌లన్నింటికీ ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించనుండగా.. తర్వాత జరిగే మ్యాచ్‌లకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. కాగా, తొలిరోజు జరిగే ప్రారంభ వేడుకల్లో బాలీవుడ్ నటులు టైగర్‌ష్రాఫ్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా, కార్తీక్ ఆర్యన్ చిందేయనుండగా.. ప్రముఖ సింగర్లు తమ పాటలతో అలరించనున్నారు.



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో జట్ల కెప్టెన్లు



ప్రాక్టీస్ సెషన్‌లో ముకేష్, సిరాజ్, ఆకాష్‌దీప్

బుమ్రా లేడు.. ఎలా ఇప్పుడు?

రాంచీ: ఇంగ్లండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టెస్టులో నెగ్గిన భారత్.. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 2-1తో ముందంజలో ఉంది. ఇదే జోరులో శుక్రవారం నుంచి ఇక్కడ జరిగే నాలుగో టెస్టులో గెలిచి.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది. కానీ, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కీలకమైన పేసర్ బుమ్రాకు నాలుగో మ్యాచ్‌లో విశ్రాంతినివ్వడంతో భారత తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత మూడు టెస్టులను పరిశీలిస్తే స్పిన్నర్ల కంటే బుమ్రానే తన రివర్స్ స్వింగ్‌తో ఇంగ్లండ్ పనిబట్టాడు. రెండో టెస్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఇంతటి ఫామ్‌లో ఉన్న బుమ్రాకు తక్షణం బ్రేక్ ఇవ్వాల్సిన పరిస్థితులైతే లేవు. కానీ, అతడి వెన్నెముక సమస్యతోపాటు రాబోయే ఐపీఎల్ టీ20 వరల్డ్‌కప్ టోర్నీలను దృష్టిలో ఉంచుకొని.. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాల్సిన పరిస్థితి. మరి అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరనేది ఇప్పుడు టీమిండియా మేనేజ్‌మెంట్ ముందున్న పెద్ద ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో రాంచీ పిచ్ ఎలా ఉంటుందనే దానిపైనే భారత తుది జట్టు కూర్పు ఆధారపడి ఉంది. గత మూడు టెస్టుల కోసం ఫ్లాట్ వికెట్లనే మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. దీంతో భారత స్పిన్నర్లకు ఆశించినంత మద్దతు లభించకపోవడంతో.. పేసర్లు ఆ భారాన్ని భుజానకెత్తుకున్నారు. కానీ, ఇప్పుడు బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ బౌలింగ్ కొంత బలహీనంగా కనిపిస్తోంది.



ఆకాష్ అరంగేట్రం?

రాంచీ వికెట్ కూడా నల్లమట్టితో తయారు చేసిందే. దీంతో హైదరాబాద్, వైజాగ్, రాజ్‌కోట్ తరహాలోనే ఈ పిచ్ కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఒకవేళ భారత జట్టు స్పిన్ వికెట్ కావాలని కోరితే.. గ్రౌండ్ సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో నీటిని చల్లడమో లేదా పూర్తిగా ఆపేయడమో జరుగుతుంది. కాగా, మరో పేసర్ కావాలనుకొంటే సిరాజ్‌తో కొత్త బంతిని పంచుకొనేందుకు ముకేష్ కుమార్ లేదా ఆకాష్‌దీప్‌లో ఒకరికి తుది జట్టులో స్థానం లభించొచ్చు. అయితే, వైజాగ్ టెస్టులో ముకేష్ ధారాళంగా పరుగులివ్వగా.. భారత్-ఎ తరఫున ఆకాష్ 10 వికెట్లతో ఆకట్టుకొన్నాడు. కానీ, బజ్‌బాల్ గేమ్‌తో ఇంగ్లండ్ విరుచుకుపడుతున్న నేపథ్యంలో ఆకాష్‌తో అరంగేట్రం చేయించడం కొంత రిస్కే. అయినా.. సెలెక్టర్లు మాత్రం అతడిని ఆడించాలనుకొంటున్నారని సమాచారం. అయితే, సిరీస్‌లో ఆఖరిదైన ఐదో టెస్టు ధర్మశాలలో జరగనుంది. అక్కడి చల్లటి వాతావరణ పరిస్థితులు ఇంగ్లండ్‌కు ఒకింత అనుకూలం. దీంతో ఇక్కడే సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకొంటున్న భారత్.. తమ ప్రధాన బలమైన స్పిన్‌ను దృష్టిలో ఉంచుకొని టర్నింగ్ వికెట్‌వైపే మొగ్గుచూపుతుందని మాజీ ఆటగాళ్ల విశ్లేషణ. ఇదే జరిగితే బుమ్రా స్థానంలో బ్యాటింగ్ కూడా చేయగల స్పిన్ ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి తుది జట్టులో చోటు దక్కొచ్చు.

వావ్.. ఆసీస్

కివీస్‌తో తొలి టీ20



మిచెల్ మార్ష్ (72 నాటౌట్)

భారీ ఛేదనలో ఆఖరి బంతికి థ్రిల్లింగ్ విన్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనను ఆస్ట్రేలియా అద్భుతంగా ఆరంభించింది. బుధవారం జరిగిన తొలి టీ20లో భారీ లక్ష్యాన్ని ఆఖరి బంతికి ఛేదించి వారెవ్వా అనిపించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (44 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 72 నాటౌట్), టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 31 నాటౌట్) సూపర్ ఇన్నింగ్స్‌తో ఆసీస్ ఆరు వికెట్లతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 68), డెవాన్ కాన్వే (46 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 63)కు తోడు ఫిన్ అలెన్ (31) సత్తా చాటడంతో 20 ఓవర్లలో 3 వికెట్లకు 215 పరుగులు సాధించింది. భారీ ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 216/4 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు వార్నర్ (32), హెడ్ (15 బంతుల్లో 24) మెరుపు ఆరంభాన్నిచ్చారు. వన్‌డౌన్‌లో వచ్చి ఆఖరిదాకా క్రీజులో నిలిచిన కెప్టెన్ మిచెల్.. మ్యాక్స్‌వెల్ (11 బంతుల్లో 25), టిమ్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి కొండంత లక్ష్యాన్ని కరిగించాడు. చివరి ఓవర్‌లో టిమ్ వీర విహారం చేశాడు. ఆరు బంతుల్లో 16 పరుగులు అవసరమైన దశలో బౌలర్ సౌథీ తొలి రెండు బంతుల్లో 3 పరుగులే ఇచ్చాడు. అయితే, చివరి నాలుగు బంతులను టిమ్ 4, 6, 2, 4గా మలచి కంగారూలకు థ్రిల్లింగ్ విక్టరీని అందించాడు. మిచెల్ మార్ష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. టీ20ల్లో ఆసీస్‌కు ఇది మూడో అత్యధిక ఛేదన కావడం విశేషం.

టాప్-100 నుంచి సుమిత్ అవుట్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ ర్యాంకింగ్స్‌లో వెనుకంజలో నిలిచాడు. తాజా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో సుమిత్ మూడు స్థానాలు కోల్పోయి 101వ ర్యాంక్‌కు పడిపోయాడు. రామ్‌కుమార్ 420వ, శశికుమార్ ముకుందర్ 457వ ర్యాంకుల్లో నిలిచారు. ఇక, డబుల్స్‌లో వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. కాగా, యుకీ 60వ, శ్రీరామ్ బాలాజీ 80వ, సాకేత్ 89వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

మనీషా డబుల్.. భారత్ అదుర్స్



అలన్యా (టర్కీ): స్ట్రయికర్ మనీషా కల్యాణ్ డబుల్ గోల్స్‌తో విజృంభించడంతో టర్కిష్ మహిళల ఫుట్‌బాల్ కప్‌లో భారత జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. బుధవారం హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 4-3తో ఎస్తోనియాను చిత్తుచేసింది. యూరోపియన్ జట్టుపై భారత్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. భారత జట్టులో మనీషా (17వ, 81వ) రెండు గోల్స్ సాధించగా, ఇందుమతి (62వ), ప్యారీ గ్జాజా (79వ) చెరోటి కొట్టారు.

ప్రీక్వార్టర్స్‌లో ఓడినా..

బుసాన్ (దక్షిణ కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో శరత్ కమల్ సారథ్యంలోని పురుషుల జట్టు 0-3తో ఆతిథ్య దక్షిణ కొరియా చేతిలో, మనికా బత్రా నేతృత్వంలోని అమ్మాయిల బృందం 1-3తో చైనీస్ తైపీ చేతిలో పరాజయం పాలయ్యాయి. ఇది పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత టోర్నీ. క్వార్టర్‌ఫైనల్ చేరిన జట్లకు విశ్వక్రీడలకు బెర్త్ దక్కుతుంది. అయితే, ప్రీక్వార్టర్స్‌లోనే ఓడినా..ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా భారత క్రీడాకారులకు పారిస్ బెర్త్ ఖరారయ్యే అవకాశముంది. ఒలింపిక్స్‌కు ఎవరు అర్హత సాధించారనేది వచ్చేనెల 5న ప్రకటించనున్నారు.

అగ్రస్థానానికి పుణెరి పల్టన్

పంచకుల: ప్రొ కబడ్డీ సీజన్-10 లీగ్ దశను పుణెరి పల్టన్ జట్టు అగ్రస్థానంతో ముగించింది. బుధవారం ఆడిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పుణె 40-38తో యూపీ యోధాస్‌పై నెగ్గింది. ఒక దశలో ఏకంగా 13 పాయింట్లు వెనుకంజలో నిలిచిన పుణె అనూహ్యంగా పుంజుకుని, విజయం సాధించింది. పుణె రైడర్ పంకజ్ కీలక సమయంలో 12 పాయింట్లు సాధించి, ఆ జట్టు గెలుపులో ముఖ్యభూమిక పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 53-39తో హరియాణాపై నెగ్గింది.

భారత్ జీపీటీ 'హనుమాన్' వచ్చేస్తోంది..

వచ్చేనెలలో అందుబాటులోకి..

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అప్లికేషన్ చాట్ జీపీటీ తరహా దేశీ వెర్షన్ త్వరలోనే అందుబాటులోకి రాబోతోంది. ఐఐటీ బాంబే నేతృత్వ భారత్ జీపీటీ ఎకోసిస్టమ్ భాగస్వామ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీకి చెందిన సీతా మహాలక్ష్మి హెల్త్‌కేర్ (ఎస్ఎంఎల్) సంస్థ 'హనుమాన్' పేరుతో లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌ను మంగళవారం ఆవిష్కరించింది. వచ్చే నెలలోనే దీన్ని ఓపెన్ సోర్స్‌గా అందరికీ అందుబాటులోకి తేనున్నారు. ఈ లాంగ్వేజ్ మోడల్ హిందీ, తెలుగు, తమిళం సహా 11 దేశీయ భాషల్లో సేవలందించగలదు. దీని సేవల సామర్థ్యాన్ని భవిష్యత్‌లో 22 దేశీయ భాషలకు విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

హనుమాన్ సేవలు: మల్టీ మోడల్ ఏఐ సామర్థ్యాలతో అభివృద్ధి చేస్తున్న హనుమాన్.. యూజర్లకు టెక్స్ట్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్, టెక్స్ట్ టు వీడియో లేదా స్పీచ్ టు టెక్స్ట్, వీడియో టు టెక్స్ట్ విధానాల్లో సమాధానాలు అందించగలదు. తొలుత హెల్త్‌కేర్, గవర్నెన్స్, ఆర్థిక సేవలు, విద్యా విభాగాల్లో సేవలందించనుంది.

భారత్ జీపీటీ ఎకోసిస్టమ్ గురించి: దేశంలోని భిన్న భాషల్లో మాట్లాడే సామాన్యులకు సైతం చాట్ జీపీటీ తరహా సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఐఐటీ బాంబే నేతృత్వంలోని 8 ఐఐటీల రీసెర్చ్ కన్సార్షియమే భారత్ జీపీటీ ఎకోసిస్టమ్. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌తో పాటు అంబానీకి చెందిన ఎస్ఎంఎల్, రిలయన్స్ జియో ఈ ప్రాజెక్టుకు మద్దతిస్తున్నాయి. దేశీయంగా జనరేటివ్ ఏఐ అప్లికేషన్ అభివృద్ధి కోసం ఏర్పాటైన తొలి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యమిది.

అమ్మకానికి కేఎన్ఆర్ రోడ్డు ప్రాజెక్టులు

» రూ.820 కోట్ల వరకు సమకూరే అవకాశం

హైదరాబాద్: కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ నాలుగు రోడ్డు ప్రాజెక్టులను అమ్మకానికి పెట్టింది. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఈ నాలుగు హైబ్రిడ్ యాన్యుటీ ప్రాజెక్టుల కోసం క్యూబ్ హైవేస్ పోటీపడుతున్నట్టు సమాచారం. ఇందులో తమిళనాడులోని ఒడ్డాన్‌చత్రం-మడతుకులం నాలుగు వరుసల రహదారికి సంబంధించి రెండు కంపెనీల మధ్య చర్చలు తుదిదశకు వచ్చాయి. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయు)పై రెండు సంస్థలు ఒకటి రెండు నెలల్లో సంతకాలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా మూడు రోడ్డు ప్రాజెక్టులపైనా క్యూబ్ హైవేస్ ఆసక్తి చూపిస్తోంది. అయితే వీటి అమ్మకం ధరపై రెండు కంపెనీలు ఇంకా అవగాహనకు రాలేదని సమాచారం. ఈ నాలుగు హైబ్రిడ్ యాన్యుటీ రోడ్డు ప్రాజెక్టుల అమ్మకం ద్వారా రూ.800 కోట్ల నుంచి రూ.820 కోట్లు సమకూర్చుకోవాలని కేఎన్ఆర్ భావిస్తోంది.

అంతరిక్ష రంగంలో మరింత ఎఫ్‌డీఐ

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృత్రిమ ఉపగ్రహాల్లో ఉపయోగించే విడి భాగాల తయారీలో 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. దీనికి తోడు ఉపగ్రహాల తయారీ, నిర్వహణ, ఉపగ్రహ డేటా ఉత్పత్తుల రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 74% ఎఫ్‌డీఐని అనుమతించేందుకూ ఆమోదం లభించింది. ఈ రంగాల్లో 74 శాతానికి మించిన ఎఫ్‌డీఐకి మాత్రం ప్రభుత్వ ప్రత్యేక అనుమతి అవసరం. ఉపగ్రహ ప్రయోగ వాహక నౌకలు, ప్రయోగ కేంద్రాల ఏర్పాటులో మాత్రం ఆటోమేటిక్ రూట్‌లో 49% ఎఫ్‌డీఐని అనుమతిస్తారు. అంతకుమించితే మాత్రం ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

ఈసారి 9.5 శాతం వేతన పెంపు!

» వెల్లడించిన అయాన్ సర్వే

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్‌లో ఉద్యోగుల వేతనాలు సగటున 9.5 శాతం పెరగవచ్చని అయాన్ పీఎల్‌సీ తాజా సర్వే నివేదిక అంచనా వేసింది. 2023లో 9.7 శాతం వేతన వృద్ధితో పోలిస్తే మాత్రం తక్కువేనని పేర్కొంది. కరోనా సంక్షోభం ముగిశాక 2022లో రెండంకెల ఇంక్రిమెంట్ల తర్వాత ఇండస్ట్రీలో జీతాల పెంపు ఏక అంకె స్థాయి వద్ద స్థిరపడిందని రిపోర్టు అభిప్రాయపడింది. 45 రంగాలకు చెందిన 1,414 కంపెనీల డేటా విశ్లేషణ ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో అగ్ర దేశాలతో పోలిస్తే భారత్‌లో వేతన పెంపు అధికమని అంటోంది. ఈ ఏడాది సగటు వేతన వృద్ధిలో భారత్ తర్వాత స్థానంలో బంగ్లాదేశ్ (7.3 శాతం), ఇండోనేషియా (6.5 శాతం) ఉన్నాయి.

అక్రమ రుణ యాప్‌ల పని పట్టాల్సిందే



మరిన్ని చర్యలు తీసుకోండి

రెగ్యులేటరీ సంస్థలకు ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన

న్యూఢిల్లీ : అక్రమ ఆన్‌లైన్ రుణ యాప్‌ల దందాపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. వీటి భరతం పట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)తో సహా రెగ్యులేటరీ సంస్థలు మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం నాడిక్కడ జరిగిన ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) సమావేశంలో ఆమె ఈ విషయం చెప్పారు. అక్రమ రుణ యాప్‌ల మాయాజాలంతో వేల మంది మదుపరులు నష్టపోతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ విషయం చెప్పడం విశేషం. దేశ ఆర్థిక స్థిరత్వానికి దేశ, విదేశాల నుంచి ఎదురయ్యే ముప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె రెగ్యులేటరీ సంస్థలను కోరారు. ఇందుకోసం నిరంతరం జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై నిఘా పెట్టి, అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతారామన్ కోరారు. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చీఫ్‌తో సహా పలు రెగ్యులేటరీ సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జీడీపీ వృద్ధి రేటు మరింత పెరగాలి

2047 నాటికి మన దేశం 35 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే వచ్చే 30 సంవత్సరాలు మన జీడీపీ ఏటా 9-10 శాతం చొప్పున పెరగాలని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ అన్నారు. బ్రిటన్, జపాన్, జర్మనీ ఆర్థిక మాంద్యంలో ఉన్నందున భారత్ 2027 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమన్నారు.

జూన్ నుంచి వడ్డీ రేట్లు తగ్గొచ్చు : క్రిసిల్

జూన్ నుంచి ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా. గత ఏడాది డిసెంబరుతో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో ద్రవ్య లభ్యత లోటు రెట్టింపైందని తెలిపింది. ఈ లోటు భర్తీ చేసేందుకు ఆర్‌బీఐ వివిధ రూపాల్లో రూ.2.07 లక్షల కోట్లు మార్కెట్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపింది. నిధుల లభ్యత తగ్గడం వల్లే స్వల్ప కాలిక కాల్‌మనీ వడ్డీ రేట్లు 6.75 శాతానికి చేరాయని క్రిసిల్ పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో జూన్ నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని తెలిపింది.

'జీ'లో రూ.2,000 కోట్ల నిధుల మళ్లింపు

సెబీ దర్యాప్తులో బయటపడిన వ్యవహారం

సోనీతో విలీనం ఒప్పందం రద్దయిన జీ గ్రూప్‌నకు మరో గట్టి దెబ్బ తగిలింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్ఈఈఎల్) లో రూ.2,000 కోట్ల మేర నిధుల మళ్లింపు జరిగినట్టు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గుర్తించినట్టు బ్లూంబర్గ్ తాజా కథనం పేర్కొంది. జీ వ్యవస్థాపకులపై సెబీ జరుపుతున్న దర్యాప్తులో భాగంగా కంపెనీ పద్దుల తనిఖీ సందర్భంగా ఈ విషయం బయటపడినట్లు తెలిసింది. నిధుల మళ్లింపుపై దర్యాప్తు అధికారుల ప్రాథమిక అంచనాల కంటే పదింతలు అధికమిది. ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ సెబీ జీ గ్రూప్ వ్యవస్థాపకులైన సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు పునీత్ గోయెంకాతో పాటు కంపెనీ బోర్డులోని కొందరు సభ్యులకు సమన్లు జారీ చేసినట్టు రిపోర్టు తెలిపింది. అయితే, నిధుల మళ్లింపు విషయంపై వ్యాఖ్యానించేందుకు కంపెనీ ప్రతినిధి నిరాకరించారు. సెబీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నట్టు మాత్రం తెలిపారు.

15 శాతం క్షీణించిన షేరు: ఈ వార్త నేపథ్యంలో జెడ్ఈఈఎల్ షేరు బుధవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో భారీగా క్షీణించి లోయర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో ట్రేడింగ్ నిలిచేసరికి, షేరు 14.77 శాతం నష్టంతో రూ.164.50 వద్ద ముగిసింది.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 434 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీల ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బుధవారం ట్రేడింగ్ ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 434.31 పాయింట్లు క్షీణించి 72,623.09 వద్దకు జారుకుంది. నిఫ్టీ 141.90 పాయింట్లు కోల్పోయి 22,055.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 నష్టపోయాయి. ఎన్‌టీపీసీ షేరు 2.76 శాతం పతనంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. పవర్‌గ్రిడ్, విప్రో సైతం రెండు శాతానికి పైగా తగ్గాయి. టాటా స్టీల్, ఎస్‌బీఐ మాత్రం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. ప్రధాన షేర్ల కంటే చిన్న, మధ్య స్థాయి కంపెనీల స్టాక్స్ అధిక ఒత్తిడికి లోనయ్యాయి.

27 నుంచి ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్ ఐపీఓ

ఈవీ చార్జర్ల తయారీ సంస్థ ఎక్సికామ్ టెలీసిస్టమ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 27న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.329 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటింగ్ కంపెనీ నెక్స్‌వేవ్ వాటాకు చెందిన 70.42 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది. కాగా, ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఓరియంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా రూ.120 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన 46 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిలో విక్రయించనుంది.

కొత్త రియల్ ఎస్టేట్ ఫండ్ ద్వారా మోతీలాల్ ఓస్వాల్ రూ.1,250 కోట్ల సమీకరణ

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రత్యామ్నాయ పెట్టుబడుల విభాగమైన మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ (ఎంఓ ఆల్ట్స్)కు చెందిన ఆరో రియల్ ఎస్టేట్ ఫండ్ తొలి విడతలో రూ.1,250 కోట్లు సమీకరించింది. ఈ నిధులను ముంబై, ఢిల్లీ సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లోని రియల్టీ మార్కెట్లో వ్యాపారావకాశాల కోసం ఉపయోగించనున్నట్టు ఎంఓ ఆల్ట్స్ తెలిపింది.

ఐదో అత్యంత విలువైన కంపెనీగా ఎస్‌బీఐ

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. ఇన్ఫోసిస్‌ను వెనక్కి నెట్టి దేశంలో ఐదో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 1.51 శాతం పెరిగి రూ.771.55 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,88,578 కోట్లకు చేరుకుంది. రూ.6.87 లక్షల కోట్ల ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్ కంటే రూ.1,228 కోట్లు అధికమిది.

బిజినెస్


ఫోన్‌పే.. ఇండస్ యాప్‌స్టోర్

న్యూఢిల్లీ: భారత్‌లో గూగుల్ ప్లేస్టోర్‌కి పోటీగా కొత్త ఆండ్రాయిడ్ యాప్‌స్టోర్ అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ పేమెంట్ సంస్థ ఫోన్‌పే.. బుధవారం స్థానికంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ స్టోర్.. ఇండస్ యాప్‌స్టోర్‌ను విడుదల చేసింది. మొత్తం 45 కేటగిరిల్లో 2 లక్షల మొబైల్ యాప్స్ గేమ్స్‌ను భారతీయ వినియోగదారులు ఈ ఇండస్ యాప్‌స్టోర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఫోన్‌పే వెల్లడించింది. మొత్తం 12 భారతీయ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉండనుంది. డెవలపర్ల కోసం ఏడాది పాటు యాప్ లిస్టింగ్ ఫీజు నుంచి మినహాయిస్తున్నట్టు తెలిపింది. అలాగే డెవలపర్లు తమకు ఇష్టమైన ఏదేని థర్డ్ పార్టీ పేమెంట్ గేట్‌వేను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ సీఓఈ

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. కెనడా కేంద్రంగా పని చేసే సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ తన 'ఐఓటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. కెనడా తర్వాత తమ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) డివిజన్‌కు ఇదే అతిపెద్ద సీఓఈ అని తెలిపింది. ఈ కేంద్రంలో ఐఓటీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన మిషన్ క్రిటికల్ ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తారు.


పిరామల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ హైదరాబాద్‌లో పూర్తిగా మహిళలే నిర్వహించే శాఖను ప్రారంభించింది. మైత్రేయి పేరుతో ఈ శాఖను సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ శాఖలో గృహ, ఎంఎస్ఎంఈ రుణాలు సహా అన్ని రకాలైన సేవలను అందించనుంది. ఈ శాఖ ఏర్పాటుతో హైదరాబాద్‌లో మొత్తం బ్రాంచీల సంఖ్య 14కు చేరుకోగా తెలంగాణలో 25కు చేరుకున్నట్లు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,740 ▲	57,600 ▲	77,200 ▲
ముంబై	62,258 ▲	57,028 ▲	70,708 ▼


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ	
హైదరాబాద్	534
22వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	515
విజయవాడ	515
విశాఖపట్నం	525
వరంగల్	536

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	140

ర్యాంకు జాబితాల్లోని వారు సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోండి: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ పరీక్షల ఫలితాల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం సిద్ధం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సూచించింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎన్‌సీసీ వంటి రిజర్వేషన్ వర్తించే అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లను దగ్గర ఉంచుకోవాలని, త్వరలోనే వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు కమిషన్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో అనేక పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే పలు పోస్టులకు పరీక్షలు నిర్వహించి ఫలితాలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన (ప్రొవిజనల్ జాబితా) అభ్యర్థులను ఆయా పోస్టుల భర్తీకి పరిశీలనలోకి తీసుకోనున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలిచ్చే ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తారు. ఈ నేపథ్యంలో అవసరమైన సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచించింది.

విలేకరులపై దాడులు సరికాదు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పత్రికా కార్యాలయాలు, విలేకరులపై దాడులు సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రిక విలేకరులపై జరిగిన భౌతిక దాడులను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇలాంటి దాడులు విఘాతమని తెలిపారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణకు ఎండీ రాధాకృష్ణ పరామర్శ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ పరామర్శించారు. అనంతపురం జిల్లాలో ఆదివారం వైసీపీ మూకల దాడిలో గాయపడిన శ్రీకృష్ణను మెరుగైన చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం వేమూరి రాధాకృష్ణ ఆస్పత్రికి వెళ్లి శ్రీకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దాడిలో తగిలిన గాయాల నొప్పులతో విపరీతంగా బాధపడ్డారని శ్రీకృష్ణ భార్య రజనీ వివరించారు. అపోలోకు తరలించి చికిత్స అందించాక నొప్పులు కొంచెం తగ్గుముఖం పట్టాయని చెప్పారు. ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారని, ఆందోళన చెందవద్దని రజనీకి ఎండీ రాధాకృష్ణ ధైర్యం చెప్పారు.



ఆస్పత్రిలో శ్రీకృష్ణను పరామర్శిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ భూస్థాపితం

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీలు రెండూ కుమ్మక్కై బీజేపీపై దుష్ప్రచారం చేశాయని విమర్శించారు. కానీ, తాము ఎనిమిది స్థానాల్లో విజయం సాధించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఒప్పందం లేకుంటే కేసీఆర్ అవినీతిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వాళ్లు ఎన్ని గిమ్మిక్కులు చేసినా మోదీని ఆపలేరని స్పష్టం చేశారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లు, ఎన్డీఏకు 400 పైగా ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో భారత్ అంటే ప్రపంచ దేశాలు చిన్నచూపు చూసేవని, ఇప్పుడు.. ప్రధాని కృషి వల్ల అగ్రదేశాల సరసన భారత్ నిలబడిందన్నారు. ధర్మపాలన కావాలో, అధర్మ పాలన కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. నారాయణపేట జిల్లా చేనేత కార్మికుల కోసం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో హామీల గారడీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. దీంతో రాష్ట్ర పరిస్థితి పెనం నుంచి పొయిలో పడ్డట్టయిందని విమర్శించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ మోసం చేసిన కేసీఆర్‌ను ప్రజలు పర్మనెంట్‌గా ఫామ్‌హౌస్‌కు పంపించారని పేర్కొన్నారు.

రాంజీగోండు స్ఫూర్తి చిహ్నాన్ని తరలిస్తారా?

నిర్మల్‌లోని వెయ్యి ఉరుల మర్రి స్మారక ప్రాంతాన్ని రాంజీగోండు స్ఫూర్తి కేంద్రంగా మారుస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది కల్లా స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా నిర్మల్ చేరుకున్న సంజయ్.. వెయ్యి ఉరుల మర్రి వద్ద రాంజీగోండు స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆదిలాబాద్, నేరడిగొండ, ఇచ్చోడ సభల్లో మాట్లాడారు. రాంజీగోండు స్మారక చిహ్నాన్ని ఓ వర్గం వారి సమాధికి కేటాయించడంపై నిప్పులు చెరిగారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

రాంజీగోండు స్మారక చిహ్న ప్రాంతాన్ని వివాదాస్పదం చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఓట్ల కోసం రాజకీయాలు చేయాలనుకుంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. అనంతరం రాంజీగోండు స్ఫూర్తి కేంద్రం నిర్మాణానికి సంజయ్ భూమి పూజ చేశారు. పొత్తు పేరిట కేసీఆర్ ఢిల్లీకి పోతున్నారట. బీఆర్ఎస్ జాతీయ పార్టీ అన్న కేసీఆర్‌తో మాకేం పొత్తు.. పారిన్ పారెన్ నుంచి వచ్చిన స్కాచ్ బాటిల్ టేస్టు చూడడానికే కేసీఆర్ ఢిల్లీ పోయిండు' అని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తమ నోటి కాడి ముద్దను లాక్కుందన్నారు. తెలంగాణలో రావాల్సింది రామరాజ్యమని, కానీ రజాకారుల రాజ్యం వచ్చిందన్నారు. అయోధ్యలో రాముడి పుట్టుకను ప్రశ్నిస్తున్న పార్టీలకు భవిష్యత్తే లేకుండా చేస్తామన్నారు. 'ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్న. ఔరంగజేబులంతా ఒక్కటై బీజేపీ అభ్యర్థులను ఓడించేందుకు సిద్ధమైనా.. వారిని ఎదురించి ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించడం మాములు కాదు. మీరంతా తోపులే అని అన్నారు.

సుస్థిర పాలన నరేంద్రమోదీకే సాధ్యం

దేశంలో సుస్థిర పాలన ప్రధాని మోదీకే సాధ్యమని ఈటల రాజేందర్ అన్నారు. విజయ సంకల్ప్ యాత్రలో భాగంగా ఆలేరు నుంచి తిరుమలగిరి వరకు పలు చోట్ల ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కూటమి అతుకుల బొంత అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అని, అలాంటి పార్టీతో తమకు పొత్తు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీ గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ అమలు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని ఈటల సవాల్ విసిరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్.. కుటుంబ పార్టీలు

కాంగ్రెస్, బీఆర్ఎస్.. కుటుంబ పార్టీలని, ఆ రెండు పార్టీలకు కాలం చెల్లిందని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా పరిగి, చేవెళ్లలో ఆయన మాట్లాడారు. ఎన్ని పార్టీలు ఒక్కటైనా బీజేపీని ఎదుర్కోలేవని అన్నారు. మోదీ కారణజన్ముడని, దేవుడు పంపిన దూత అని కొనియాడారు. రాహుల్ అవగాహన లేని పిల్లవాడని, కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలతో బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వారి మాటలను ప్రజలు నమ్మబోరని తెలిపారు. పాపాల పుట్ట లాంటి బీఆర్ఎస్‌తో తాము పొత్తు పెట్టుకోబోమన్నారు. ఇటీవలి ఎన్నికల్లో దోపిడీ దొంగలను ఓడించి గజదొంగలను గెలిపించారని అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి పొత్తులు అవసరం లేదని, సింగిల్‌గానే ఎన్నికలు ఎదుర్కొంటామని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ అప్పులు చేసి చిప్ప పెట్టిపోతే, ఇప్పుడొచ్చిన సీఎం ఆ చిప్ప పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.



అనంతపురం జిల్లా ఉరవకొండలో జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల నిరసన

'చలో అనంత'పై నిర్బంధం

- జర్నలిస్టుల ముందస్తు అరెస్టులు, నోటీసులు
- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసన
- నేడు అనంతలో జర్నలిస్టుల ర్యాలీ, ధర్నా

అనంతపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)/కర్నూలు: 'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా జర్నలిస్టు సంఘాలు పిలుపునిచ్చిన 'చలో అనంతపురం'పై అణచివేతకు పోలీసులు తెగబడ్డారు. గురువారం అనంతపురం చేరుకుని 'చలో'ను విజయవంతం చేయడానికి సిద్ధమవుతున్న జర్నలిస్టులపై రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధకాండను ప్రయోగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దంటూ పలు జిల్లాల్లో జర్నలిస్టులకు బుధవారం ముందస్తు నోటీసులను పోలీసులు అందించారు. 'ఆంధ్రజ్యోతి'కి చెందిన పలువురు రిపోర్టర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిని నిరసిస్తూ మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తూ జర్నలిస్టులు 'చలో అనంతపురా'నికి పిలుపునివ్వడం సర్కార్‌ను మరింతగా కలవరపెట్టింది. దీంతో కర్నూలు జిల్లాలో పలు మండలాలకు చెందిన 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్లకు ఎస్‌ఐలు నోటీసులిచ్చి అనంతపురం వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దేవనకొండ 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ నాగరాజు, పత్తికొండ 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ రంగన్నలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పత్తికొండ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' రిపోర్టరు పక్కీరప్పకు ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులను హౌస్ అరెస్టు చేశారు. మంత్రాలయం 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ జయరాజును స్టేషన్‌కు పిలిపించి నోటీసులు ఇచ్చారు.

సీన్.. రివర్స్!

- బీఆర్ఎస్ చేజారుతున్న మునిసిపాలిటీలు
- ఒక్కొక్కటిగా కైవసం చేసుకొంటున్న కాంగ్రెస్
- ఇప్పటికే 34 చోట్ల అవిశ్వాస తీర్మానాలు
- మరో 20 చోట్ల అవిశ్వాసానికి అవకాశం



హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార ప్రభుత్వం మారడంతో క్షేత్రస్థాయి రాజకీయం మారుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన అభ్యర్థులు అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గూటికి చేరడం చూశాం. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే ఈ సీన్ రివర్స్ అయ్యింది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన వారు కూడా సొంతగూటికి చేరుతున్నారు. మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు అధికమయ్యాయి. వెరసి.. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ చేతిలో ఉన్న మునిసిపాలిటీ పాలకవర్గాలు ఒక్కొక్కటిగా హస్తగతం అవుతున్నాయి. మరోపక్క, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవడం దృష్టి పెట్టిన కాంగ్రెస్ కూడా మునిసిపాలిటీలపై పట్టుకోసం అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో సగానికిపైగా మున్సిపాలిటీలను తమ సొంతం చేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలహీన పరిచేందుకు గతంలో బీఆర్ఎస్ ఏ ఎత్తుగడలు వేసిందో అవే ఎత్తులను హస్తం నేతలు ఇప్పుడు అమలు చేస్తున్నారని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాది గడువు ఉండడంతో మెజారిటీ పాలక వర్గాలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుందని అంటున్నారు.

సింహభాగం బీఆర్ఎస్ ఖాతాలోనే!

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు వల్లనైతేనేమీ, ఎక్స్ అఫీషియో ఓట్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల వల్లనైతేనేమీ రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో 90 శాతానికి పైగా ఆ పార్టీకే దక్కాయి. దీంతో రాష్ట్రస్థాయి నుంచి స్థానిక సంస్థల వరకూ బీఆర్ఎస్ హవా నడిచింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. మున్సిపాలిటీల పాలక వర్గాలు అధికార పార్టీ బాట పడుతున్నాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటిదాకా 34 మున్సిపాలిటీల పాలక వర్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభ్యులు అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇందులో 30 మున్సిపాలిటీల్లో పాలకవర్గ సమావేశాలు కూడా జరిగాయి. వీటిలో 15 మున్సిపాలిటీల్లో పాలక వర్గం ఎన్నికలకు నోటిఫికేషన్లూ జారీ అయ్యాయి. తొమ్మిది మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగ్గా ఆరు మున్సిపాలిటీల్లో జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగిన 9 మున్సిపాలిటీలూ అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం అయ్యాయి. మహబూబ్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, భూపాలపల్లి, నాస్పూర్, మంచిర్యాల, నల్లగొండ, వేములవాడ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరగా.. జగిత్యాల, భువనగిరి, ఖానాపూర్, హుజూర్‌నగర్, సుల్తానాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. ఇవి కాక మరో 20 మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. మరోపక్క, బీఆర్ఎస్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళుతున్నారు.

పందెన్ వాగుకు పాతర

డెవలపర్ల ప్రయోజనాలకు నాలా బలి.. ఏకంగా వాగు మార్గాన్నే మార్చేశారు

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో రాయదుర్గం మల్కం చెరువు నుంచి మూసీనది వరకూ వర్షపు నీటి వరదను మోసుకెళ్లే పందెన్ వాగును అధికారులు పాతరేశారు. అసలే హైదరాబాద్ మహా నగర విస్తరణలో కుచించుకుపోయిన ఈ వాగును.. డెవలపర్లు, రియల్ ఎస్టేట్ సంస్థల ప్రయోజనాల కోసం బలిచేశారు. వాగు సహజప్రవాహ మార్గాన్ని మళ్లించి, దెబ్బతీస్తే.. నాలా నిబంధనలను తుంగలోతొక్కి సులువుగా నిర్మాణ అనుమతులు పొందవచ్చనే ఉద్దేశంతో కొందరు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు చేసిన కుట్రలకు గత ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులు తలూపి, నిబంధనలకు నీళ్లొదిలారు. పది చెరువుల జలాలు.. పదుల కాలనీల వర్షపు నీరు కలిసి ప్రవహించే ఆ వాగును బాక్స్ డ్రైయిన్ నుంచి వెళ్లేలా ప్రణాళిక రచించారు. రియల్ ఎస్టేట్ డెవలపర్ల ప్రయోజనాల కోసం.. ప్రభుత్వ నిధులను ఖర్చు చేసి మరీ వాగు మళ్లింపు పనులు చేపట్టారు. ప్రభుత్వం మారినా.. గుట్టుచప్పుడు కాకుండా ఆ పనులు కొనసాగిస్తున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం)

పందెన్ వాగు కుతుబ్‌షాహీల కాలం నుంచే ఎంతో పేరుగాంచింది. హైదరాబాద్-ముంబై పాత రోడ్డుకు ఆనుకొని రాయదుర్గం వద్ద మల్కం చెరువు ఉండగా.. దానికి దిగువ నుంచి పందేను వాగు (మల్కంచెరువుకు తూర్పుభాగంలో నిర్మించిన లింకు రోడ్డు-32 చివరకు) ప్రారంభమవుతుంది. దుర్గం చెరువు ఎగువన గల సుమారు ఐదారు కిలోమీటర్ల విస్తీర్ణం నుంచి వచ్చే వర్షపు నీరు చేరి మత్తడి దుంకితే రాయదుర్గంలోని మల్కంచెరువులోకి చేరుతుంది. ఆ మల్కంచెరువు మత్తడి దుంకితే పందేనువాగు పారుతుంది. ఈ వాగు మణికొండ, పుప్పాల్‌గూడ, నెక్నాంపూర్ మీదుగా మూసీ నది వరకూ ఉంటుంది. దుర్గం చెరువు, ఖాజాగూడ పెద్ద చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువు, రాయదుర్గం మల్కం చెరువులు పొంగితే పందెన్ వాగు వరదను మోసుకొచ్చి బుల్కాపూర్ నాలా ద్వారా తారామతి బారాదరి వద్ద మూసీనదిలో కలుస్తుంది. చెరువుల నుంచి వచ్చే నీరే కాకుండా రాయదుర్గం, షేక్‌పేట, ఖాజాగూడ, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ పరిసర ప్రాంతాల్లోని వర్షపు నీరంతా పందెన్ వాగులో చేరుతుంది. వర్షాలు వచ్చిన సందర్భంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ పందెన్ వాగుకు అక్కడక్కడా చెక్ డ్యామ్‌లను ఏర్పాటు చేసి పంట పొలాలకు నీళ్లను మళ్లించారు. వివిధ ప్రాంతాల్లో పంట పొలాలకు ఇలాంటి మళ్లింపు కాలువలు ఉండగా.. నగర విస్తరణలో అవి కనుమరుగయ్యాయి. ఇప్పుడసలా వాగు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.



డైవర్ట్ చేయబోతున్న పందెన్ వాగు నాలా ఇదే

వాగా.. డ్రైనేజీనా?

పందెన్ వాగు ప్రారంభం వద్ద వంద అడుగులకు పైగా ఉండగా కొన్ని ప్రాంతాల్లో 30 అడుగుల మేర ఉన్నది. నగర విస్తరణలో పూర్తిగా కుచించుకుపోయింది. మల్కంచెరువు దిగువ నుంచి సుమారు 622 మీటర్ల వరకు 30 అడుగుల విస్తీర్ణంతో ఈ వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఆ తర్వాత పందెన్ వాగు మణికొండ పంచవటికాలనీలో కుడివైపు మళ్లగానే పది అడుగులకే పరిమితమై.. అది వాగా? లేక డ్రైనేజీనా? అనే సందేహం కలిగించేలా ఉంటుంది. ఎందుకంటే, ఒకనాడు వర్షపు నీటిని మోసుకెళ్లిన పందేనువాగు ఇప్పుడు సీవరేజ్ వ్యర్థాలను మోసుకెళుతోంది. సాధారణంగా నాలా కానీ, వరద కాల్వకు కానీ విస్తీర్ణం ఆధారంగా బఫర్‌జోన్ ఉంటుంది. అయితే ఒకప్పుడు కొన్ని చోట్ల వంద అడుగులు, మరికొన్నిచోట్ల 30 అడుగులతో ఉన్న పందెన్ వాగును.. ప్రస్తుతం ఐదు, పది అడుగులకే పరిమితం చేశారు. బఫర్‌జోన్ అంటూ లేకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే.. తన సహజ స్వభావం ప్రకారం పందెన్ వాగు వర్షాకాలంలో తన ఉధృతిని చూపుతూ సుమారు 20కి పైగా కాలనీలను ముంచెత్తుతోంది.

నాలా బలి..

పందెన్ వాగు మణికొండ పంచవటికాలనీ వద్ద కుడి వైపునకు మళ్లి దక్షిణం దిశగా ప్రవహిస్తుంది. ఆ ప్రాంతంలో ఓ నిర్మాణ సంస్థ భారీ ప్రాజెక్టు చేపట్టబోతోంది. ఆ భారీ ప్రాజెక్టుకు తూర్పు వైపున హైటెన్షన్ వైర్లున్నాయి. సుమారు 100 అడుగుల మేర బఫర్‌జోన్ ఉన్నది. పశ్చిమాన పందెన్ వాగు ఉంటుంది. ఈ ప్రాజెక్టు అనుమతులు పొందాలంటే రెండు వైపులా స్థలాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. దీంతో అలా వదులుకోకుండా భారీ కుట్రకు తెరతీశారు. ఈ కుట్రకు గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ కుట్రలో భాగంగా మణికొండ పంచవటి కాలనీ నుంచి హరివిల్లు వరకూ హైటెన్షన్ వైర్ల కింది భాగంలోని రోడ్డు భూగర్భంలో డ్రెయిన్ పైప్ నాలాగా నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. పందెన్ వాగు అటు శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్ఎంసీ పరిధిలోను, ఇటు మణికొండ మునిసిపాలిటీలోనూ ఉండడంతో రెండు విభాగాలూ సంయుక్తంగా నిర్మించాలని నిశ్చయించారు. ఇందుకోసం మణికొండ మునిసిపాలిటీ రూ.9 కోట్లు కేటాయించగా.. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ 20 ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ పనులు నిర్వహిస్తున్నారు. పంచవటికాలనీ రామాలయం నుంచి రెండు భాగాలు నిర్మించిన అధికారులు.. మూడో భాగం నిర్మించే ప్రాంతంలో వాగు నాలాను పూర్తిగా డైవర్ట్ చేశారు. పంచవటి కాలనీ నుంచి ట్రైల్స్ విల్లా వరకు.. అక్కడి నుంచి మళ్లీ రాయదుర్గం-మణికొండ రోడ్డు ద్వారా హరివిల్లు దాకా తీసుకొచ్చి తిరిగి వాగులో కలుపుతున్నారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి.

నాలా మలుపులు సరి చేశాం

రాయదుర్గం మణికొండ మధ్య పందెన్ వాగుపై 4.6 మీటర్ల వెడల్పుతో 600 మీటర్ల పొడవున రూ.9 కోట్లతో నాలా నిర్మిస్తున్నాం. నిధులు మణికొండ మునిసిపాలిటి వారు కేటాయించారు. మేం పనులు చేస్తున్నాం. గతంలో నాలా లేకపోవడంతో మలుపులు తిరిగి ఉండేది. ఇప్పుడు నాలా మలుపులు సరి చేసి నిర్మిస్తున్నాం.

-శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జీహెచ్ఎంసీ సర్కిల్-20

మలుపుల సరి పేరుతో..

పందెన్ వాగు మణికొండ పంచవటి కాలనీ నుంచి హరివిల్లు వరకు మలుపులుగా ఉంటుంది. దీన్ని మలుపులు లేకుండా సరిచేస్తున్నామనే పేరుతో దాదాపు 45 మీటర్ల నుంచి 60 మీటర్ల మేర మార్పు చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు స్థలానికి ఓ వైపు పందెన్ వాగు మొత్తం హైటెన్షన్ వైర్ల కిందకు రానుంది. ఆ స్థలం సుమారు ఎకరం వరకూ ఉంటుంది. ఈ స్థలమంతా సదరు ప్రాజెక్టు చేపట్టిన భారీ నిర్మాణ సంస్థకు దక్కుతుంది! ఈ ప్రాంతంలో చదరపు గజం ధర లక్షన్నర పలుకుతోంది. అంటే ఎకరం విస్తీర్ణం విలువ దాదాపు రూ.70 కోట్ల దాకా ఉంటుంది. అంటే.. నిబంధనల ప్రకారం రెండు వైపులా స్థలం పోగొట్టుకోవాల్సిన నిర్మాణ సంస్థ ఏవైపునా స్థలాన్ని పోగొట్టుకోకుండా చేయడమే కాక, విలువైన ఎకరం స్థలం కలిసొచ్చేలా అధికార యంత్రాంగమే సహకరించింది. అంతేకాదు.. ఆ నిర్మాణ సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా బాక్స్ డ్రెయిన్‌ను రూ.9 కోట్ల ప్రజాధనంతో నిర్మించిపెడుతోంది. సదరు సంస్థ నుంచి భారీగా ముడుపులు అందుకొని గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు ఈ లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాలు వస్తే ఈ నాలా డైవర్షన్ కారణంగా వరద ప్రవాహం సమీపం కాలనీలను ముంచెత్తే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

కవితకు మళ్లీ సీబీఐ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)



శరత్‌చంద్రారెడ్డి తదితరులున్నారు. ఈడీ నోటీసులు జారీ అయిన నెలలోనే సీబీఐ తాఖీదులివ్వడం గమనార్హం.! ఈడీ నోటీసులపై కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టులో కేసు ఉన్నందున కవిత వి చారణకు హాజరుకాలేదు. అయితే.. సీబీఐ నోటీసులకు స్పందించాలా? విచారణకు హాజరవ్వాలా? అనే అంశంపై న్యాయ నిపుణులను సంప్రదించిన తర్వాత కవిత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై ప్రచారం జరుగుతున్న సమయంలో ఏడాది తర్వాత సీబీఐ అనూహ్యంగా సీబీఐ నోటీసులు రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

24న కలెక్టర్లతో ధరణి కమిటీ సమావేశం

» పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు.. పరిష్కారాలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ధరణి కమిటీ ఈ నెల 24న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. ధరణి సమస్యల పరిష్కారానికి సంబంధించిన వివిధ అంశాలపై కమిటీ కలెక్టర్లతో సుదీర్ఘంగా చర్చించనుంది. కలెక్టర్ల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకోనుంది. అనంతరం కమిటీ ఇన్ని రోజులు చేసిన కసరత్తును క్రోడీకరించి త్వరలోనే ప్రభుత్వానికి మధ్యంతర నివేదికను అందజేయనుంది. ధరణికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కలెక్టర్లు హాజరు కావాలంటూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశించారు. ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై చర్చించనున్నారు. ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌లో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకు కారణాలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ-అటవీశాఖ మధ్యలో నెలకొన్న భూ వివాదాలు, ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు భూ సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలు, రెవెన్యూ వ్యవస్థ మరింత మెరుగ్గా, పటిష్ఠంగా, ప్రజలకు సులభంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ కలెక్టర్ల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను స్వీకరించనుంది.

గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్న రేణుక



హైదరాబాద్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి.. బుధవారం రిటర్నింగ్ అధికారి నుంచి తన గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. అసెంబ్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో రేణుకాచౌదరి భర్త, కూతురు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇది పార్టీ తనపైన పెట్టిన బాధ్యతగా భావిస్తానని అన్నారు. రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన మరో నేత అనిల్‌కుమార్‌యాదవ్.. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కుటుంబ సమేతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జగజ్యోతికి 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బిల్లులు మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్‌ఈ) కె. జగజ్యోతికి ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. గత సోమవారం తన కార్యాలయంలో రూ. 84 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు జ్యోతిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. ఏసీబీ కేసు, సోదాలతో తీవ్ర షాక్‌కు గురైన జగజ్యోతి అనారోగ్యం బారినపడటంతో ఏసీబీ అధికారులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఉస్మానియా వైద్యులు నివేదిక ఇచ్చారు. వైద్యుల నివేదికను ఏసీబీ కోర్టుకు సమర్పించిన అనంతరం జగజ్యోతిని నాంపల్లి ఏసీబీ కోర్టులో బుధవారం హాజరుపర్చారు. న్యాయస్థానం జగజ్యోతికి 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

రష్యాలో చిక్కుపోయిన యువకులను రక్షించాలి

» విదేశాంగ మంత్రికి అసదుద్దీన్ ఒవైసీ లేఖ

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుపోయిన భారతీయ యువకులను రక్షించాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కోసం రష్యా వెళ్లిన యువకులను ఏజెంట్లు మోసం చేసి యుద్ధానికి తీసుకెళ్లారని వారిని భారత్‌కు తీసుకురావాలని ఒవైసీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రి జయశంకర్‌కు, రష్యాలోని భారత రాయబారికి లేఖలు రాసినట్లు తెలిపారు. రష్యాలో మొత్తం 12 మంది యువకులు చిక్కుపోయారని వారిలో తెలంగాణకు చెందిన వారు ఇద్దరు ఉన్నారని లేఖలో వివరించారు. వీరికి సెక్యూరిటీ ఉద్యోగాలు ఇస్తామని ఆశచూపి రష్యా తీసుకెళ్లి ఉద్యోగాలకు బదులు వారని ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి తీసుకెళ్లారని అన్నారు.

సీఎంను కలిసిన బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

» మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం... కొట్టిపారేసిన బీజేపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్.. బుధవారం నాడు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అలాగే మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కలిశారు. ఇప్పటి దాకా బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులే.. సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసానికి వెళ్లి కలుస్తుండగా.. తాజాగా బీజేపీ ఎమ్మెల్యే కార్పొరేటర్ కూడా వెళ్లి కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఒక సీఎం హోదాలో రాష్ట్ర అవసరాల కోసం ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఎలా కలిశారో.. తమ పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లూ వారి ప్రాంత అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌ను కలిశారంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు.


సింగరేణిలో 485 పోస్టుల భర్తీ

» సీఎండీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 485 పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న 317 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులతో పాటు 168 ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు వీలుగా నోటిఫికేషన్లు సిద్ధం చేయాలన్నారు. ఇక కారుణ్య నియామక ప్రక్రియను వేగిరం చేయాలని, ఈ ఏడాదిలో 1000 మంది వారసులకు కొలువులు ఇవ్వాలని ఆదేశించారు. సింగరేణిపై ఆయన సీఎండీ ఎన్.బలరాంతో పాటు ఇతర అధికారులతో బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. సింగరేణి ఉద్యోగ మేళాలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకంలో వారసుల వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచే విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. 317 డైరెక్ట్, 168 ఇంటర్నల్ పోస్టుల భర్తీకి గురువారం నోటిఫికేషన్లను జారీ చేస్తామని సీఎండీ ఎన్.బలరాం వెల్లడించారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులపై నేడు సీఎం సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమీక్ష చేపట్టనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు జంటనగరాలకు తాగునీటిని అందించడానికి వీలుగా ఈ ప్రాజెక్టును 19 ఏళ్ల కిందట చేపట్టారు. ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం పక్కన పెట్టడంతో పదేళ్లుగా పనులన్నీ మందగించాయి. తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య జాబితాలో చేర్చింది. ఎస్ఎల్‌బీసీ కాలువ కోసం 43.930 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. ఇప్పటికే కొంత పూర్తవ్వగా మరో 10 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే గతంలో బిల్లులు అందక పనులు నిలిపేసిన నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ప్రతినిధులను కూడా సమీక్షకు రప్పించనున్నారు. పనులు తక్షణమే చేపట్టేందుకు వీలుగా రూ.52 కోట్ల బిల్లులను కూడా చెల్లించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.





కోస్గి సభలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, జూపల్లి ; కోస్గి సభకు హాజరైన జనం

వారంలో ఫ్రీ విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఉన్నారు. 3,083 మహిళా సంఘాలకు రూ.177.53 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను కూడా సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. నల్లమలలోని ఓ కుగ్రామం నుంచి వచ్చిన తనను కొడంగల్ ప్రజలు మూడుసార్లు ఆశీర్వదించి ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిని చేశారని, ఈ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మొదటి రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేశామని, మరో వారం రోజుల్లో మరో రెండు గ్యారెంటీలు అమలు చేయబోతున్నామని సీఎం తెలిపారు. రైతుబంధు బకాయిలు మార్చి 15వ తేదీ నాటికి పూర్తిగా చెల్లిస్తామన్నారు. త్వరలో రైతు రుణమాఫీ, రైతు భరోసా కూడా అమల్లోకి వస్తాయన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. వంశీచంద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా తన సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించారు. ముఖ్యమంత్రి అయిన రెండు నెలల్లోనే కొడంగల్‌కు రూ. 4,369 కోట్లు మంజూరు చేశానని, ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డికి 50 వేల కంటే ఎక్కువ మెజారిటీ ఈ నియోజకవర్గం నుంచి ఇస్తే అభివృద్ధి కార్యక్రమాల కోసం మరో రూ.5వేల కోట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్‌పై విమర్శలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. కరీంనగర్‌లో ఓడిపోతానని తెలిసి అక్కడి నుంచి పాలమూరుకు వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించామని, కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత పాలమూరుకు అన్యాయం చేసి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలు ఛీత్కరించినా కూడా పట్టించుకోకుండా, ఏ మొఖం పెట్టుకొని కేసీఆర్ అల్లుడు, కొడుకు.. నల్గొండ నుంచి ఒకరు, మహబూబ్‌నగర్ నుంచి మరొకరు పాదయాత్ర చేస్తారని ప్రశ్నించారు. పదేళ్లలో కేసీఆర్ రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి ఏ ప్రాజెక్టులనూ పూర్తి చేయలేదని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టం కంటే ఎక్కువ నష్టం చేశారని మండిపడ్డారు. పోతిరెడ్డిపాడు, రాయలసీమ ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి, మల్యాల ద్వారా రోజుకు 12 టీఎంసీలను ఏపీ సీఎం జగన్ తరలించుకుపోతుంటే.. రోజా ఇంట్లో పులుసు తిని బలిసిపోయి కృష్ణా నీళ్లను జగన్‌కు అప్పగించారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. పాలమూరును అభివృద్ధి ముసుగులో దోచుకొని వలసలకు కారణమయ్యారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2014లో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జీవో 69 తెస్తే దాన్ని పక్కన పెట్టారని, ఇప్పుడు సీఎం అయిన తర్వాత ఈ ప్రాంతానికి ఆ పథకం మంజూరు చేసుకొని శంకుస్థాపన చేసుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం జరిగిందంటే ఆలోచించవచ్చు కానీ, పదేళ్లలో వడావు చేసిన వారు క్షమార్హులు కారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని, మోదీ 2014లో పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తానని ప్రకటించి మోసం చేశారని సీఎం పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి, మరో ముగ్గురు బీజేపీ ఎంపీలు, ఆపార్టీ నేతలు డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ఏనాడైనా వీటి సాధన కోసం కృషి చేశారా అని ప్రశ్నించారు. ఒకడు పొత్తు ఉంటుందని, ఒకడు పొత్తు ఉండదని, చెప్పుతో కొడతానని, చేతితో కొడతానని చెబుతూ డ్రామాలు ఆడుతున్నారని, బీఆర్ఎస్ గెలిచినా సరేగానీ కాంగ్రెస్ మాత్రం గెలవొద్దు అనే విధంగా బీజేపీ సిద్ధాంతం ఉందని సీఎం విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత రూ.6 లక్షల కోట్లు అప్పు చేసి కమీషన్ల కోసం కాళేశ్వరం కడితే మూడేళ్లు గడవకుండానే కుప్పకూలిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల కమీషన్లను మామ చెబితే హరీశ్‌రావు తీసుకువచ్చేవారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే బొక్కలు ఇరిగాయని రేవంత్‌ను ఎదుర్కోలేక అసెంబ్లీకి రాని పిరికి వ్యక్తి కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ ఎడమకాలి గోటికి కూడా కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ సరిపోదన్నారు. మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో పూర్తిచేస్తామని చెప్పారు.

మీ వల్లే బాగున్నాం

కోస్గిలో పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి తమకు చేసిన సాయం గురించి వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. పోలేపల్లికి చెందిన పద్మమ్మ.. 2014లో తన కూతురు కృష్ణవేణి అనారోగ్యం పాలైనప్పుడు నాడు ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌ను కలిశామని, ఆయన సాయం చేసి తన బిడ్డ ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. ఊట్కూరు మండలానికి చెందిన జోగిని హాజమ్మ.. 2013లో జోగినులను గ్రామ బహిష్కరణ చేయాలని కొందరు నిర్ణయించినప్పుడు, తాను జోగినులతో ఒక సంఘం ఏర్పాటు చేసి న్యాయం కోసం అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డిని కలిశానని చెప్పారు. రేవంత్ ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి జోగినుల దుస్థితి గురించి తెలియజేశారని, తమకు ఎంతో ఉపయోగపడే 139 జీవో రావడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఇద్దరు పిల్లలను ఇంజనీరింగ్, నర్సింగ్ చదివిస్తున్నానని రేవంత్‌కు తెలిపారు. రేవంత్‌రెడ్డికి జోగినులు రుణపడి ఉంటారని హాజమ్మ చెప్పారు.

పెట్టుబడిదారులకు పూర్తి సహకారం

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకాలు కల్పించేలా, వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఇప్పటికే 65 ఐటీఐలలో నైపుణ్య శిక్షణ కేంద్రాలను టాటా సంస్థ ఏర్పాటు చేస్తోందని, దీనికోసం రూ. 2 వేల కోట్లు పెట్టుబడులు పెడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సీఐఐ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి 10 జిల్లాల్లో పది స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వీటిలో అవసరమైన భాగస్వామ్యం కోసం టెక్ మహీంద్రా, టాటా సంస్థలతో మాట్లాడామన్నారు.

ప్రభుత్వం మారినా విధానాలు మార్చం

'గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధికి చేసిన మంచి ప్రయత్నాలున్నాయి. వాటిని కొనసాగించడానికి మా ప్రభుత్వానికి భేషజాలు లేవు' అని సీఎం చెప్పారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో మొట్టమొదటిసారిగా ఐటీ కంపెనీకి మాదాపూర్‌లో శంకుస్థాపన చేశారని, ఆ తర్వాత కాలక్రమేణా అది ఆగిపోయినా చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక.. ముందుకు తీసుకెళ్లారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఐటీ ఇండస్ట్రీతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచటంతోపాటు, ఆర్థిక వ్యవస్థనూ నెక్స్ట్‌లెవెల్‌కు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని భావించి ప్రపంచంలో ఉన్న చాలా ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి చంద్రబాబు కృషి చేశారని కొనియాడారు. తర్వాత ముఖ్యమంత్రి అయిన వైఎస్ సైతం.. చంద్రబాబుతో రాజకీయ, సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప అభివృద్ధిలో ఎలాంటి విభేదాలు లేవని చాటారన్నారు. ఓఆర్ఆర్, హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రోరైలు, కృష్ణా, గోదావరి జలాల విషయాల్లోనూ వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయలేదని, అప్పటికే సిద్ధమైన ప్రణాళికలను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకే కృషి చేశారని వివరించారు. దాంతో హైదరాబాద్‌కు ప్రపంచ చిత్రపటంలో ఒక స్థానం దక్కిందని, అనేక ఐటీ, ఫార్మా కంపెనీలు తమ వ్యాపారాలు ఇక్కడ నెలకొల్పాయన్నారు. నేడు ఫార్మా రంగంలో టాప్-5 కంపెనీల్లో 4 నగరంలోనే ఉన్నాయన్నారు. 1965లో ప్రధాని ఇందిరాగాంధీ ఐడీపీఎల్ సంస్థ ఏర్పాటుచేశారని, అందులో పనిచేసిన సైంటిస్టులే హైదరాబాదులో ఫార్మా కంపెనీలు పెట్టారని గుర్తు చేశారు. ఈ రంగంలో హైదరాబాద్‌లో పెట్టుబడులకు రావడానికి నాటి ప్రధాని ఇందిరాగాంధీ కృషే కారణమన్నారు. ఓఆర్ఆర్ అవసరమా అని గతంలో విమర్శించారని, నేడు నగరానికి అదే లైఫ్ లైన్‌గా మారిందని వివరించారు. పెట్టుబడులు, అభివృద్ధికి హైదరాబాద్ చిరునామాగా మారిందని, ప్రభుత్వం మారినందున విధానాలు మారుతాయన్న అపోహలు పెట్టుకోవద్దని, పెట్టుబడిదారులకు పూర్తి సహకారం ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. పక్క రాష్ట్రం, ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంతో పోటీపడదామని, దీనికోసం 2050 సంవత్సరానికి మాస్టర్ ప్లాన్ కోసం కన్సల్టెన్సీని ఆహ్వానించామన్నారు. తెలంగాణలో రాబోయే వందేళ్లకు అవసరమయ్యే ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. 25-30 వేల ఎకరాల్లో ఏర్పాటయ్యే బల్క్‌డ్రగ్ ఫార్మా నుంచి వెలువడే కాలుష్యంతో నగరానికి ఇబ్బంది ఏర్పడుతుందని, అందుకే ఫార్మాసిటీ నుంచి ఫార్మా విలేజీలుగా 12-15 క్లస్టర్లుగా విభజించి ప్రతీ క్లస్టర్‌లో 2000-3000 ఎకరాల్లో భూములు సేకరించి పెట్టుబడులను ఆహ్వానిస్తామన్నారు. ఇంజినీరింగ్ చదువుకున్నోడికి రూ.15 వేల జీతం వస్తుంటే.. చదువుకోని వాడు రూ. 50 వేలు సంపాదిస్తున్నాడని, ఉద్యోగాల్లేక యువత పక్కదారి పడుతున్నారని, డ్రగ్స్ కేసులు పెరుగుతున్నాయని.. మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికడతామని సీఎం చెప్పారు.

కరెంటు కోతలంటూ తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించొద్దు


» వారిపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయండి

» డిస్కమ్‌ల ఎస్‌ఈలతో భేటీలో భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగినా నిరంతర సరఫరాను అందించే సామర్థ్యముందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. విద్యుత్తు కోతలంటూ సోషల్ మీడియాలో కావాలని తప్పుడు ప్రచారం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో నిరంతర విద్యుత్తు సరఫరాపై బుధవారం ఆయన సచివాలయం నుంచి క్షేత్ర స్థాయిలోని డిస్కమ్‌ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల (ఎస్‌ఈ)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల తమ ప్రాంతంలో కరెంట్ కోతలు విధిస్తున్నారని కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టగా, తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తప్పుడు ప్రచారమని తేలిందని అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. అలాంటి వారిని ఉపేక్షించరాదని.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఓవర్ లోడ్, మెయింటెనెన్స్ వంటి సమస్యలతో కొన్నిచోట్ల అంతరాయాలు కలుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. వీటిని సత్వరమే పరిష్కరిస్తే ఏ సమస్యలు ఉండవని చెప్పారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశముంటే వినియోగదారులకు ముందే సమాచారం అందించాలన్నారు. వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్తు సరఫరా చేసేందుకు విద్యుత్తు శాఖ ముందు నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ఎటువంటి ఇబ్బందులున్నా ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో/ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీకి లేదా తనకు తెలియజేయాలని భట్టి సూచించారు. తాము 24 గంటలు అందుబాటులో ఉంటామని చెప్పారు.

నేషనల్ ఉర్దూ కౌన్సిల్ సభ్యునిగా ఎం.ఎ.సత్తార్



నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ నూతన సభ సభ్యుడుగా హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ సత్తార్ నియమితులయ్యారు. కేంద్ర విద్యా శాఖ పర్యవేక్షణలో ఈ కౌన్సిల్ ఉర్దూ బాషా అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ కౌన్సిల్‌లో సభ్యుడిగా దక్షిణభారతదేశం నుంచి సత్తార్‌ను నియమించడం విశేషం. తనకు ఈ అవకాశం కల్పించినందుకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సత్తార్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా వెలువడుతున్న 'దేశ్ కా సహారా' ఉర్దూ పత్రికకు సత్తార్.. సంపాదకునిగా పని చేస్తున్నారు.

పొత్తు కోసమే ఢిల్లీకి కేసీఆర్!

శత్రువు దగ్గర యుద్ధం చేయాలి కానీ.. కొడుకును ఆశీర్వదించమని కోరతారా?

» అప్పటి నుంచే వారి మధ్య ఒప్పందం

» బీఆర్ఎస్ పని అయిపోయింది

» కేసీఆర్‌ను గెలవమనండి చూద్దాం

» వచ్చే ఎన్నికల్లో మాకు 12 ఎంపీ సీట్లు

» కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీజేపీకి నామరూపాలుండవు: కోమటిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పొత్తు కోసమే మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీకి వెళ్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. టీఆర్ఎస్ పని అయిపోయిందనే.. బీఆర్ఎస్‌గా మార్చుకున్నారని, కానీ దాని పనికూడా అయిపోయినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఉంటుందో పోతుందో తెలియడం లేదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం మంత్రి కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ఢిల్లీకి వెళ్లనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ.. ఇండియా కూటమితో కేసీఆర్‌కు పడదని, బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకునేందుకే ఢిల్లీ వెళ్తున్నారని విమర్శించారు. ఏ అభ్యర్థిని ఎక్కడ బరిలో ఉంచాలనే దానిపైనా నిర్ణయించనున్నారని ఢిల్లీలో పరిచయం ఉన్న వ్యక్తులు తనతో అన్నారని చెప్పారు. "శత్రువు దగ్గర యుద్ధం చేస్తారు కానీ.. కొడుకును పంపిస్తున్నాను ఆశీర్వదించమని కోరుతారా? కేసీఆర్ తన కొడుకును ఆశీర్వదించమన్నారని..హైదరాబాద్ వచ్చినపుడు మోదీనే స్పష్టం చేశారు. అలా ఆశీర్వదించమన్న రోజే ఒప్పందం జరిగిపోయింది. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర అభివృద్ధిని పణంగా పెట్టి కేసుల నుంచి బయటపడ్డారు" అని విమర్శించారు. బయట ఫైటింగులు చేసుకుంటూ.. లోపల మీటింగులు పెట్టుకొనే బీఆర్ఎస్, బీజేపీ బంధం కేసీఆర్ ఢిల్లీ పర్యటనతో బట్టబయలు కాబోతుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావును డమ్మీ చేసిన కేసీఆర్.. కాళేశ్వరం అంశం రాగానే అసెంబ్లీలో హరీశ్‌ను ముందుంచారని అన్నారు. కాళేశ్వరంలో కలెక్షన్ల వసూలుకు నమ్మకమైన వ్యక్తి ఉండాలనే హరీశ్‌ను నీటిపారుదల శాఖ మంత్రిగా నియమించారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే రాష్ట్రంలో బీజేపీకి నామరూపాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. మూసీని బాగుచేసేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకురాలేని కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటని నిలదీశారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసివచ్చినా.. తాము 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నామన్నారు. బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని, కేసీఆర్‌ను గెలవమనండి చూద్దాం.. అని అన్నారు.

ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్ చేంజర్

వైఎస్ హయాంలో గేమ్ చేంజర్‌గా ఔటర్ రింగ్ రోడ్డును తీసుకువచ్చారని, ఇపుడు తాము రీజినల్ రింగ్ రోడ్డును రూపంలో సూపర్ గేమ్ చేంజర్‌ను తీసుకురానున్నామని కోమటిరెడ్డి చెప్పారు. రూ.363.43 కోట్ల యుటిలిటీ చార్జీలను చెల్లించలేమని గత ప్రభుత్వం చేతులెత్తేయడం వల్లే జాతీయ రహదారుల సంస్థ ఆర్ఆర్ఆర్ పనులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌తో మాట్లాడి యుటిలిటీ చార్జీలను చెల్లిస్తామని తాను కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. తమ చొరవను గుర్తించిన కేంద్ర మంత్రి గడ్కరీ యుటిలిటీ చార్జీలను తామే చెల్లిస్తామనడం సంతోషం కలిగించిందన్నారు. మూడేళ్లలోనే రీజినల్ రింగ్‌రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలనే వినతిపైనా గడ్కరీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద మరో రూ.855కోట్లు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీలో కాలుష్యాన్ని తొలగించి టూరిస్టు స్పాట్‌గా చేయాలని సీఎం రేవంత్ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. నల్లగొండ బైపాస్ రోడ్డుకు 700 కోట్లు కేటాయించిన గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'జీరో' కరెంట్ బిల్లులకు సర్వం సన్నద్ధం

2022-23 సగటు వినియోగమే ప్రామాణికం.. 'గృహజ్యోతి' అమలుకు నేడో, రేపో ఉత్తర్వులు

» పూర్తయిన వెరిఫికేషన్.. రెండు రోజుల్లో రీ-వెరిఫికేషన్ పూర్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు అందించడానికి సర్వం సన్నద్ధమయింది. రానున్న మార్చి 1వ తేదీ నుంచి 10వ తేదీ మధ్య మీటర్లకు రీడింగ్ తీసి, అర్హులైన వినియోగదారులకు జీరో బిల్లులను అందించనున్నారు. ఈ పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారి వివరాలను డిస్కమ్‌లు వడివడిగా సేకరిస్తున్నాయి. ఇప్పటికే వెరిఫికేషన్ పూర్తి కాగా, రీ-వెరిఫికేషన్‌ను రెండు రోజుల్లో పూర్తి చేసి, అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు. రెండు డిస్కమ్‌ల పరిధిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే కనెక్షన్లు 95,23,433 ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకటికి మించి కనెక్షన్లు కలిగి, ఆ కనెక్షన్లన్నీ అతనే వాడితే, అందులో ఒకటే కనెక్షన్‌కు ఉచిత విద్యుత్ ప్రయోజనం కలుగనుంది. ఇక ఒక వ్యక్తి ఒకటికి మించి కనెక్షన్లు కలిగి, ఆయా కనెక్షన్లు కలిగిన గదుల్లో అద్దెవారు ఉండి, వారు ఆహారభద్రత(రేషన్) కార్డులు లేదా ఆధార్‌కార్డులు కలిగి ఉంటే అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్ ప్రయోజనం దక్కనుంది. ఇక ప్రజాపాలనలో 1,09,01,255 దరఖాస్తులు రాగా.. అందులో ఆధార్‌కార్డులతోపాటు రేషన్‌కార్డులు, యూనిక్ సర్వీస్ కనెక్షన్ నెంబర్లు పొందుపరిచిన దరఖాస్తులు 34,59,585 దాకా ఉన్నాయని ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. తొలివిడతలో వీరికి, ఆ తర్వాత రెండో విడతలో కొత్త రేషన్‌కార్డులు పొందిన వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి మార్గదర్శకాలతో కూడిన జీవో ఒకట్రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉండటంతో కనెక్షన్ల రీ-వెరిఫికేషన్‌ను డిస్కమ్‌లు ముమ్మరం చేశాయి. రెండురోజుల్లోగా లబ్ధిదారుల వివరాల రీ-వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్లు కీలక అధికారి ఒకరు వెల్లడించారు. రెండు డిస్కమ్‌ల పరిధిలోని సిబ్బంది 5వ తేదీ నుంచే ఆధార్‌కార్డుతోపాటు ఆహారభద్రత(రేషన్)కార్డులు, మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. అద్దెదారులకూ పథకాన్ని వర్తింపజేయనుండడంతో ఇంటి యజమానులతోపాటు అద్దెకు ఉండే వారి వివరాలనూ సిబ్బంది సేకరిస్తున్నారు.

2022-23 సగటు వినియోగమే ప్రామాణికం

2022-23 ఆర్థిక సంవత్సరంలో 12 నెలల కాలంలో సగటున నెలకు 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించిన వారే గృహజ్యోతి పథకానికి అర్హులు. ఈ కాలవ్యవధిలో వినియోగదారులు 200 యూనిట్లలోపు ఎంత కరెంట్ వాడతారో, దానికి 10% అదనంగా కలిపి, ఆ యూనిట్లను పరిగణనలోకి తీసుకుని పథకాన్ని అమలు చేయనున్నారు. గరిష్ఠ వినియోగం దాటితే శ్లాబు ప్రకారం ఛార్జీలను వసూలు చేయనున్నారు. పూర్తి మార్గదర్శకాలను జీవోలో పొందుపరచనున్నారు. గృహజ్యోతి పథకం అమలు చేయడానికి ఏటా రూ.4,160 కోట్ల భారం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. తొలివిడతలో 34.59 లక్షల మందికి 200 యూనిట్లలోపు కరెంట్ అందించడానికి దాదాపు రూ.2 వేల కోట్ల దాకా అవసరమవుతాయని గుర్తించి, బడ్జెట్‌లో ఆ నిధులను కేటాయించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 22 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

ఏపీ పాలిసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ/ప్రైవేట్/ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్న సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి విభాగాన్ని అనుసరించి మూడు లేదా మూడున్నరేళ్లు ఉంటుంది. ఏపీ పాలిసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3 డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్ ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

ఐఐటీ హైదరాబాద్‌లో
స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌పోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.



విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ చేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత: ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక: ప్రిలిమినరీ స్క్రీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్, రెగ్యులర్ అకడమిక్ వర్క్‌తోపాటు అభ్యర్థులు పూర్తిచేసిన ప్రాజెక్ట్ వర్క్‌లు; ఒలింపియాడ్స్/నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్స్‌లో పార్టిసిపేషన్/పొందిన గుర్తింపు; ఇంటర్వ్యూ స్కోర్ తదితరాలను పరిగణనలోకి తీసుకొని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ/మెంటార్ నిర్ణయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థుల సమాచారాన్ని ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తారు. వెబ్‌సైట్‌లో కూడా ఉంచుతారు.

స్టయిపెండ్: అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ.7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

తెలంగాణ గురుకుల సైనిక పాఠశాలలో
ప్రవేశాలు

కరీంనగర్ జిల్లా-రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్‌లు విడుదలయ్యాయి. వీటి ద్వారా ఆరోతరగతి, పదకొండో తరగతి(ఎంపీసీ)లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. రాష్ట్రానికి చెందిన బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సీబీఎస్ఈ కరిక్యులం ప్రకారం బోధన ఉంటుంది. మిలిటరీ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. యూపీఎస్సీ-ఎన్‌డీఏ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. మాక్ ఎస్ఎస్‌బీ టెస్ట్‌లు నిర్వహిస్తారు. డిబేట్స్, క్విజ్ కాంపిటేషన్స్, సెమినార్లు, సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్కిట్స్, డ్రమటిక్స్, పిక్చర్ పర్సెప్షన్, స్టోరీ టెల్లింగ్ తదితర ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ఫిజికల్ ట్రెయినింగ్, అబ్‌స్టాకిల్ కోర్స్ ట్రెయినింగ్, లాంగ్ డిస్టెన్స్ మార్చ్‌లు, డ్రిల్ ప్రాక్టీస్, ఎన్‌సీసీ ట్రెయినింగ్, బాక్సింగ్, రెజిలింగ్, కరాటే, ఆర్చరీ, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, హార్టికల్చర్ వంటి ఔట్‌డోర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో ఆఫీసర్స్‌గా రాణించాలనుకొనే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.



సీట్ల వివరాలు

- ఆరోతరగతిలో 80 సీట్లు ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు 60, బీసీ-సీ విద్యార్థులకు 2, ఎస్టీ విద్యార్థులకు 5, బీసీ విద్యార్థులకు 10, ఓసీ/ఈబీసీ విద్యార్థులకు 1, మైనారిటీలకు 2 సీట్లు ప్రత్యేకించారు.
- పదకొండో తరగతి(ఎంపీసీ)లో 46 సీట్లు ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు 32, ఓసీ/ఈబీసీ విద్యార్థులకు 1, మైనారిటీలకు 1, బీసీ-సీ విద్యార్థులకు 2, ఎస్టీ విద్యార్థులకు 3, బీసీ విద్యార్థులకు 7 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత

- కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2,00,000; గ్రామాల్లో రూ.1,50,000 మించకూడదు. తెలుగు మీడియం విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. నిర్దేశించిన మేరకు శారీరక ప్రమాణాలు(ఎత్తు, బరువు) ఉండాలి.
- ఆరోతరగతిలో చేరాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి అయిదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 11 ఏళ్లు మించకూడదు.
- పదకొండో తరగతిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులు/ప్రస్తుతం పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 16 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఉంటుంది. రెండో దశలో ఫిజికల్ టెస్ట్, సైనిక్ స్కూల్ అప్టిట్యూడ్ టెస్ట్, కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లు ఉంటాయి. మూడో దశలో మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఉంటుంది.
- ఆరోతరగతి ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 40 ప్రశ్నలు; జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఇంటెలిజెన్స్/రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ అయిదో తరగతి సిలబస్ ప్రకారమే ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. మేథ్స్‌కు ఒక గంట, మిగిలిన సబ్జెక్టులకు ఒక్కోదానికి అర్థ గంట చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- పదకొండో తరగతి ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: మేథమెటిక్స్ నుంచి 40; ఇంగ్లీష్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పదోతరగతి సిలబస్ ఆధారంగా ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. మేథ్స్‌కు ఒక గంట, మిగిలిన సబ్జెక్టులకు ఒక్కోదానికి అర్థ గంట చొప్పున మొత్తం పరీక్ష సమయం మూడు గంటలు.
- ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే ఒక్కో సబ్జెక్ట్‌లో కనీసం 25 శాతం మార్కులు, మొత్తమ్మీద కనీసం 40 శాతం మార్కులు రావాలి. ఇలా అర్హత సాధించినవారిని 1:10 నిష్పత్తిలో ఎంపికచేసి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరిని మాత్రమే ఫిజికల్, అప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లకు పిలుస్తారు.
- ఫిజికల్ టెస్ట్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 6 మార్కులు రావాలి. అభ్యర్థులు 20 నిమిషాల్లో నాలుగు కి.మీ.ల రన్నింగ్; 15 పుషప్‌లు, 20 సిటప్‌లు, 3 చిన్ అప్‌లు, మూడు మీటర్ల వర్టికల్ రోప్ పూర్తిచేయాల్సి ఉంటుంది.
- సైనిక్ స్కూల్ అప్టిట్యూడ్ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. దీనిని ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ఇది సబ్జెక్టివ్ అండ్ డిస్క్రిప్టివ్ పేపర్. ఆరోతరగతి అభ్యర్థులకు లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, ఇంగ్లీష్ అప్టిట్యూడ్, మేథమెటికల్ అప్టిట్యూడ్, ఈవీఎస్ అప్టిట్యూడ్, సోషల్ సైన్స్ అప్టిట్యూడ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పదకొండో తరగతి అభ్యర్థులకు లాజికల్ రీజనింగ్ అండ్ క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ నుంచి 10 మార్కులకు, ఇంగ్లీష్ అప్టిట్యూడ్ నుంచి 15 మార్కులకు, మేథమెటికల్ అప్టిట్యూడ్ నుంచి 30 మార్కులకు, సైన్స్ అప్టిట్యూడ్ నుంచి 30 మార్కులకు, సోషల్ సైన్స్ అప్టిట్యూడ్ నుంచి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- కమ్యూనికేషన్ స్కిల్స్ టెస్ట్ 25 మార్కులు ఉంటుంది. దీనిని ఓరల్ మోడ్‌లో నిర్వహిస్తారు. తరవాత మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 6 నుంచి
- **స్టేజ్-1 ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 10
- **స్టేజ్-2 స్క్రీనింగ్ టెస్ట్‌లు:** ఆరోతరగతిలో చేరే విద్యార్థులకు మార్చి 22, 23, 26, 27, 28; పదకొండోతరగతిలో చేరే విద్యార్థులకు ఏప్రిల్ 1, 3, 4, 6
- **వెబ్‌సైట్:** https://tswrsplschools.cgg.gov.in

భారత రాజ్యాంగ పరిషత్

టీఎస్‌పీఎస్సీ/పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ పరిషత్ ముఖ్య కమిటీలు
(కమిటీ- ఛైర్మన్‌గా వ్యవహరించినవారు)

1. సలహాసంఘం - వల్లభభాయ్ పటేల్(అత్యంత పెద్ద కమిటీ)
2. సారథ్య కమిటీ - రాజేంద్రప్రసాద్
3. ప్రాథమిక హక్కుల కమిటీ - వల్లభభాయ్ పటేల్
4. ప్రాథమిక హక్కుల ఉపకమిటీ- జె.బి.కృపలాని
5. కేంద్ర అధికారాల కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
6. కేంద్ర రాజ్యాంగ కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
7. రాష్ట్రాల కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
8. రూల్స్ కమిటీ - రాజేంద్రప్రసాద్
9. జాతీయ పతాకంపై తాత్కాలిక కమిటీ - రాజేంద్రప్రసాద్
10. మైనారిటీ సబ్ కమిటీ - హెచ్.సి.ముఖర్జీ
11. సుప్రీంకోర్టుపై తాత్కాలిక కమిటీ - వరదాచారి అయ్యర్(రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడు కాదు)
12. రాష్ట్ర రాజ్యాంగాలపై కమిటీ - వల్లభభాయ్ పటేల్
13. ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ - గోపీనాథ్ బోర్డోలాయ్
14. హౌస్ కమిటీ - పట్టాభి సీతారామయ్య
15. రాజ్యాంగ పరిషత్ విధుల కమిటీ - జి.వి.మౌలాంకర్
16. సభా వ్యవహారాల కమిటీ - కె.ఎం.మున్షీ
17. రాజ్యాంగ ముసాయిదా ప్రత్యేక కమిటీ - కృష్ణస్వామి అయ్యర్

- రాజ్యాంగ ముసాయిదా 1948 ఫిబ్రవరి 21న ప్రచురించారు. రాజ్యాంగ ప్రతిపై 7,635 సవరణలు ప్రతిపాదించగా వాటిలో 2,473 చర్చకు వచ్చాయి. ముసాయిదాను రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించి చట్టంగా మార్చింది.
- రాజ్యాంగ రూపకల్పనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. రాజ్యాంగ పరిషత్ ముసాయిదాను 115 రోజుల్లో తయారుచేసింది. మొత్తం 12 సమావేశాలు జరిగాయి.
- భారత రాజ్యాంగ పరిషత్ చిట్టచివరి సమావేశం 1950 జనవరి 24న జరిగింది. ఈ సమావేశానికి 284 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాజ్యాంగ పరిషత్ నూతన రాజ్యాంగం ప్రకారం భారత గణతంత్ర ప్రథమ రాష్ట్రపతిగా(అధ్యక్షునిగా) రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకుంది.
- భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. ఆ రోజునే గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటున్నాం.
- భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనతో పాటుగా, కొన్ని సాధారణ చట్టాలను కూడా రూపొందించి, ఆమోదించింది.
- భారత రాజ్యాంగ పరిషత్ చిహ్నంగా ఏనుగును గుర్తించారు.
- రాజ్యాంగ పరిషత్ కేంద్ర శాసనసభగా కూడా పనిచేసింది. స్వతంత్ర శాసనసభ 1947 నవంబరు 17న సమావేశమై మొదటి స్పీకర్‌గా జి.వి.మౌలంకర్‌ను ఎన్నుకున్నది.
- కామన్‌వెల్త్‌లో భారత సభ్యత్వాన్ని 1949 మేలో ధ్రువీకరించింది.
- 1947 జూలై 22న జాతీయ జెండాను, 1950 జనవరి 24న జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించింది. రాజ్యాంగ పరిషత్ వివిధ అంశాల కోసం సుమారు 60 దేశాల రాజ్యాంగాలను పరిశీలించింది.
- రాజ్యాంగ నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు రూ.64 లక్షలు.

విమర్శలు

1. రాజ్యాంగ పరిషత్ దేశంలో ఒక ప్రధాన వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించింది - విన్‌స్టన్ చర్చిల్
2. రాజ్యాంగ పరిషత్ హిందువుల సంస్థ- సైమన్
3. భారత రాజ్యాంగ పరిషత్ ఒకే పార్టీకి చెందిన సంస్థ, రాజ్యాంగ పరిషత్ అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే భారతదేశం - గ్రాన్‌విల్ ఆస్టిన్
4. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం, ఒక అతుకుల బొంత - ఐవర్ జెన్నింగ్స్
5. రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలు పరిచేవారిని నిందించాలి - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
6. రాజ్యాంగ పరిషత్ నిర్మాణంలో ప్రజాభిప్రాయ ఛాయలు లేవు - కె.సంతానం
7. రాజ్యాంగ రచనలో సమన్వయ పద్ధతి కంటే సర్దుబాటు పద్ధతికే ప్రాధాన్యం ఇచ్చారు - ఓ.పి.గోయల్
8. రాజ్యాంగ రచనకు రాజ్యాంగ పరిషత్ సమన్వయ పద్ధతిని అనుసరించింది - గ్రాన్‌విల్ ఆస్టిన్
9. రాజ్యాంగ పరిషత్‌లో నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒక నియంత్రణ మండలిగా వ్యవహరించారని పేర్కొన్నది - గ్రాన్‌విల్ ఆస్టిన్
10. భారా రాజ్యాంగ పరిషత్ భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వ్యక్తీకరణకు ఒక అడ్డంకిగా మారింది - జయప్రకాశ్ నారాయణ్.




వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ చిన్న పక్షిని 'వైట్ బ్రోడ్ టిట్ వార్బ్లర్' అని పిలుస్తారు.
- పది సెం.మీ. పొడవు ఉంటుంది. కేవలం 8 గ్రాముల బరువుండే బుల్లి పక్షి ఇది. తోక ముడిస్తే బంతిలా కనపడుతుంది. మగపక్షినే కలర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆడ పక్షి మాత్రం పిచ్చుక రంగులో ఉంటుంది.
- లేత పింక్, గ్రే, కొంచెం తెలుపు ఉండే ఈ పక్షి జాడను 1873లో కనుగొన్నారు.
- ఇవి మనదేశంలోని హిమాలయాలతో పాటు తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, పాకిస్తాన్, నేపాల్, చైనాలో మాత్రమే ఉంటాయి.
- ఒక్కో గుంపులో కనీసం ఇరవై ఐదు పక్షులు ఉంటాయి.
- ఇవి నాలుగు నుంచి తొమ్మిది గుడ్లు పెడతాయి. ఇరవై ఒక్క రోజులు పొదుగుతాయి.
- ఈ పక్షులు పురుగులు, సాలె పురుగులను మాత్రమే తింటాయి.
- విచిత్రంగా ఆడపక్షి గుడ్లు పెట్టాక.. ఇతర ఆడపక్షులు అదే గూటిలోకి వస్తాయి. ఒక పక్షి గూటిలో పొదిగిన తర్వాత మరో పక్షి ఆహారం కోసం వెళ్తుంది.



- ఈ పక్షిని చేతిలోకి తీసుకుంటే కాటన్‌బాల్ పట్టుకున్నట్టు ఉంటుంది.
- వీటి జీవనకాలం కేవలం నాలుగేళ్లు.

ఏవి ఎన్ని?



10 తేడాలను గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 236

			8		1			7
6	5							
		8				4	9	
	3				9	2		5
	9	6	2		5	1	3	
2		5	4				8	
	6	4				3		
							5	9
9			5		2			

సుడోకు - 235 సమాధానం

4	9	3	1	7	8	5	2	6
1	7	2	6	5	4	8	9	3
5	6	8	3	2	9	4	1	7
2	3	9	5	8	6	1	7	4
7	4	6	2	1	3	9	8	5
8	5	1	4	9	7	6	3	2
3	2	5	9	6	1	7	4	8
9	8	4	7	3	5	2	6	1
6	1	7	8	4	2	3	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.